Prajalakshyam Telugu Daily

# ప్రజాలక్ష్యం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 17 | సంచిక: 22 | కరీంనగర్ | మంగళవారం 16 జూన్ 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## చిన్నారిపై కోతుల మంద దాడి

### - గాయపడ్డ చిన్నారి ఆస్పత్రికి తరలింపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, జూన్ 15 : జిల్లాలో కోతులు బీభత్సం సృష్టించాయి. ఇంటి ముందు ఆడుకుంటున్న మూడేళ్ళ చిన్నారిపై కోతులు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో కోతులు బీభ త్సం సృష్టించాయి. మండలంలోని బొప్పాపూర్ లో ఇంటి ముం దు ఆడుకుంటున్న మూడేళ్ళ చిన్నారి అన్వికపై దాడికి చేశాయి. కోతులు దాడి చేసే సమయంలో

11 లో

## అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందం

### - స్వాగతిస్తూ ఎక్స్ వేదికగా మోడీ ప్రకటన

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)



న్యూఢిల్లీ, జూన్ 15 : అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందంపై భారత ప్రధాని నరేంద్రమోదీ స్వాగతించారు. ఉద్రిక్తతలను ముగించేందుకు ఇరుదేశాలు ఓ అంగీకా రానికి రావడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో మోదీ పోస్ట్ చేశారు.

11 లో

# మెట్రో విస్తరణకు మోకాలొడ్డిన కిషన్ రెడ్డి



- హైదరాబాద్ అభివృద్ధిని విస్మరించిన కేంద్రమంత్రి
- కెసిఆర్ కనుసన్నల్లో పనిచేస్తున్న గంగాపురం
- ఎన్‌వోసి ఇప్పించడంలో కూడా విఫలం
- ఎల్ అండ్ టికి రుణ బదలాయింపును అడ్డుకున్న పెద్దమనిషి
- అభివృద్ధి జరిగితే పుట్టగతులు ఉండవనే భయంలో బిజెపి
- మోడీ హామీల అమలుపై చెప్పండి... నేను రాజీనామాకు సిద్ధం
- మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి లక్ష్యంగా సిఎం రేవంత్ విమర్శలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 15 : మెట్రో విస్తరణను బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రో విస్తరణ జరిగేచోట బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలే ఉన్నారని తెలిపారు. సమస్యలపై మాట్లాడదామంటే కేంద్రమంతి కిషన్‌రెడ్డి సమయం ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. సోమవారం సచివాలయంలో సిఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కిషన్‌రెడ్డి బాధ్యత తీసుకుని మాట్లాడాలని సూచించారు. మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డి నిధులు విడుదల చేయిస్తారా? లేదా? అని ప్రశ్నించారు. లోన్ బదిలీ కాకుండా కిషన్‌రెడ్డి వల్లే మెట్రో విస్తరణ ఆగిందని ఆరోపించారు. మెట్రో విస్తరణకు రూ.40 వేల కోట్లు కావాలని సూచించారు. అంతా తామే భరిస్తామని.. ఎన్‌వోసి ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం లేకుండా మెట్రోను తాము విస్తరిస్తామని కేంద్ర పెద్దలతో తాము చెప్పామని పేర్కొన్నారు. రాజకీయంగా నష్టం జరుగుతోందని మెట్రోపై కిషన్‌రెడ్డి కుట్ర పన్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రుణం ఇవ్వకపోతే కనీసం ఎన్‌వోసి అయినా ఇప్పించరా? అని నిలదీశారు. నిధులు ఇప్పించి ఎన్‌వోసి

11 లో

# ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికతో ప్రజలకు చేరువయ్యాం

- కొన్ని విభాగాలు ఇంకా ప్రజల్లోకి వెళ్లలేక పోయాయి
- అన్ని శాఖలు చేపట్టిన కార్యక్రమాలకు ప్రచారం కల్పించాలి
- గ్రామాల్లో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- మీడియా, డిజిటల్ మీడియా ద్వారా చేసిన పనులకు ప్రాచుర్యం
- క్షేత్రస్థాయిలో వెళ్లని అధికారులపై చర్యలు తప్పవు
- ప్రగతి ప్రణాళికపై సచివాలయంలో సిఎం రేవంత్ సమీక్ష



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 15 : ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో చేపట్టిన కార్యక్రమాలను కొన్ని విభాగాలు ఆశించినంతగా చెప్పుకోలేక పోయాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. వెంటనే అన్ని శాఖలు తాము చేపట్టిన కార్యక్రమాలకు తగినంత ప్రచారం కల్పించాలని సూచించారు. సంబంధిత ఉన్నతాధికారులు ఆ బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. మీడియా, డిజిటల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు తాము చేసిన మంచి పనులు చెప్పుకోవాలని అధికారులకు సూచించారు. వివిధ స్థాయిల్లో జరిగిన కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, ప్రజల నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్ను నమోదు చేయాలని, గ్రామాల్లో వచ్చిన సమస్యలను కూడా ఆయా శాఖలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ మూడు నెలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, చేసిన శంకుస్థాపనలు, ఆస్తుల వివరాలన్నీ నమోదు చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 16 నుంచి జూన్ 12 వరకు చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంతో ప్రజా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. 9 రోజుల పాటు రాష్ట్రమంతటా జరిగిన

11 లో

## ఫ్యూచర్ సిటీ కోసం శరవేగంగా అడుగులు

### - సింగపూర్ కంపెనీకి మాస్టర్ ప్లాన్ బాధ్యతలు?



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 15 : ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిన సిఎం రేవంత్ రెడ్డి ఇటీవలఏ అక్కడ ఫ్యూచర్ సిటీ వెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయాన్ని ప్రారంభించారు. దీనికితోడు మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధం చేస్తున్నారు. రానున్న ఆరేడేళ్లలో ఫ్యూచర్ సిటీని అందుబాటులోకి తీసుకుని రావడం లక్ష్యంగా శరవేగంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీనికితోడు కొన్న ప్రభుత్వ కార్యాలయాలను అక్కడికి తరలిస్తున్నట్లు వార్తలు వస్తున్నారు. ఇదే క్రమంలో ఫ్యూచటర్ సిటీ మాస్టర్ ప్లాన్ ఈ బాధ్యతలను సింగపూర్ కంపెనీకి ప్రభుత్వం అప్పగించినట్లు తెలుస్తున్నది.

11 లో

## ధాన్యం సేకరణలో కేంద్రం ప్రేక్షకపాత్ర

### - మద్దతు ధరలు ప్రకటించి మిన్నకుంటోంది
### - కేంద్రం తీరుపై మండిపడ్డ మంత్రి తుమ్మల
### - జొన్న,మొక్కజొన్నలను ఎంఎస్‌పి పరిధిలోకి తేవాలి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 15 : తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. మద్దతు ధర, ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరును ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. కేంద్రం నుంచి ఆశించిన స్పందన లభించడం లేదని, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస ధరలు వస్తాయని ఆశగా సాగు చేసిన రైతులకు న్యాయం జరగట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సచివాలయంలో వ్యవసాయ మరియు మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మొక్కజొన్న కొనుగోళ్లు, నిల్వ సౌకర్యాలు, గన్ని బ్యాగుల లభ్యత, రవాణా ఏర్పాట్లు, కేంద్ర ప్రభుత్వ విధానాలపై సమగ్రంగా చర్చించారు. ఇప్పటికైనా సేకరించిన పంటలను

11 లో

## పవన్ కళ్యాణ్‌ను ఆడిస్తున్న బిజెపి

### - బిజెపి కుట్రలో పావుగా మారిన పవన్ - ఇష్టం వచ్చినట్లు తెలంగాణపై మాట్లాడితే ఊరుకోం - పిసిసి చీఫ్ మహేథ్ గౌడ్ హెచ్చరిక

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 15 : పవన్ కళ్యాణ్ పదే పదే తెలంగాణను కించపరిచేలా మాట్లాడుతున్నారని, ఆయన వ్యాఖ్యల వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. రాజకీయాల్లో విచ్చలవిడిగా మాట్లాడటానికి ఇదేమీ సినిమా కాదని మహేష్ కుమార్ గౌడ్ హితవు పలికారు. ఈ మేరకు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తెలంగాణ

11 లో





తెలంగాణ వ్యాప్తంగా

## 'బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్' పథకం

### - రాజ్‌భవన్ స్కూల్‌లో ప్రారంభించిన మంత్రి పొన్నం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జూన్15 : తెలంగాణ వ్యాప్తంగా 'బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్' పథకం ప్రారంభమైంది. సోమవారం ఉదయం రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం పథకాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేసిన మంత్రి.. వారికి పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో బ్రేక్‌ఫాస్ట్

11 లో

## తెలంగాణలో మోగిన బడిగంటలు

- రాష్ట్రవ్యాప్తంగా తెరుసుకున్న స్కూళ్లు
- మళ్లీ రెడ్డెక్కిన బస్సులు, ఆటోలు
- కొన్నిచోట్ల విద్యార్థులకు స్వాగతం పలికిన ఉపాధ్యాయులు



హైదరాబాద్, జూన్ 15 : వేసవి సెలవులు ముగియడంతో సోమవారం స్కూళ్లు పునఃప్రారంభం అయ్యాయి. ఇన్నాళ్లూ ఇంటికే పరిమితం అయిన విద్యార్థులు మళ్లీ బడిబాట పట్టారు. ఉదయమే మళ్లీ ఆటోలు, బస్సులు రయ్‌మంటూ రోడ్లపైకి వచ్చాయి. స్కూల్లను ముస్తాబు చేయడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ స్కూళ్లకు చేరారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు తెరుచుకున్నాయి. దీంతో విద్యార్థులు బడిబాట పట్టారు. పాఠశాలలకు తొలిరోజు వస్తున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. అల్పాహారం ఏర్పాటు చేశారు. ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. వేసవి సెలవులతో బోసిపోయిన పాఠశాలలు సందడిగా మారాయి. తెలంగాణలో పాఠశాలలు తెరచుకోవడంతో తల్లిదండ్రులు మళ్లీ బిజీ అయ్యారు. కొత్త పుస్తకాలు.. ఏకరూప దుస్తులతో బడులకు వెళ్లే చిన్నారులతో సందడి నెలకొంది. ఈసారి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కొత్తగా అల్పాహారాన్ని అందించనున్నారు. తొలి రోజే పాఠశాలల్లో పుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీకి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే అమావాస్య రోజు పాఠశాలలు రీఓపెన్ కావడంతో మొదటి రోజు హాజరు శాతం భారీగా తగ్గింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్కూళ్లలో చాలా తక్కువ మంది విద్యార్థులపై హాజరయ్యారు. కొన్ని చోట్ల పదుల సంఖ్యలోనే విద్యార్థులు హాజరవ్వగా.. ఇక రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం గీతానగర్‌లోని బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని ఒక్కతే పాఠశాలకు

11 లో



## డిమాండ్ ఉన్న వరి వంగడాలకే ప్రోత్సాహం

### - తెలంగాణ వరి ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్ - రైతులు వాటినే పండించేలా దిశా నిర్దేశం - మిల్లర్లు కొనుగోలు చేసే రకాలను పండిస్తే మేలు - ఇందుకోసం రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు - కేబినేట్ సబ్‌కమిటీలో డిప్యూటి సిఎం భట్టి సూచనలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్, జూన్ 15 :రాష్ట్రంలో 8 మేలురకం వరి వంగడాల సాగును పెద్దఎత్తున ప్రోత్సహించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. విదేశాల్లో తెలంగాణ బియ్యానికి బాగా డిమాండ్ ఉందని భట్టి విక్రమార్క ప్రస్తావించారు. మద్దతు ధర కంటే ఎక్కువ ధర పలికే అవకాశం ఉందని వెల్లడించారు. తెలంగాణ సోనామసూరి సహా ఎగుమతులకు అనుకూలమైన వరి రకాలపై రైతన్నలు దృష్టిపెట్టాలని సూచించారు. ఇందుకోసం రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సోమవారం ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్ష తన కేబినెట్ సబ్ కమిటీ సమా వేశమైంది. ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఎగుమతి రకాల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని

11 లో

## సింగరేణిని ప్రైవేట్ పరం చేసే కుట్రలు

- ఓపెన్ కాస్ట్‌లత విస్తరణతో సంస్థకు నష్టం
- సింగరేణి బకాయిలు 50వేల కోట్లు చెల్లించాలి
- కార్మికుల హక్కుల కోసం హెచ్‌ఎంఎస్‌తో కలసి పోరాటం
- బొగ్గుబాయిబాట కార్యక్రమంలో టిఆర్ఎస్ చీఫ్ కవిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మంచిర్యాల, జూన్ 15 : సింగరేణిని ప్రైవేట్ పరం చేసే కుట్రలు జరుగుతున్నాయని టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆరోపించారు. కొత్త బొగ్గు బావులు తెచ్చుకుంటే లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని, మన హక్కైన డిపెండెంట్ ఉద్యోగాల కోసం రాజీలేని పోరాటం చేయాల్సి ఉందన్నారు. సింగరేణిని కాపాడాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే.. వెంటనే సింగరేణికి బకాయి ఉన్న 50 వేల కోట్ల రూపాయలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అండర్ గ్రౌండ్ మైనింగ్‌ను రద్దు చేసి, ఓపెన్ కాస్ట్ మైనింగ్‌ను పెంచుతూ సింగరేణి ఉనికిని దెబ్బతీసే కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలో చేపట్టిన బొగ్గుబాయి కార్యక్రమంలో భాగంగా.. కాసిపేట మైన్-1ను ఆమె సందర్శించారు. నేరుగా గనిలోకి వెళ్లి కార్మికులతో మాట్లాడి, క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న కష్టాలను, సమస్యలను అడిగి తెలుసు కున్నారు. కాసిపేట నుంచే వారం రోజుల పాటు సాగనున్న ఈ 'బాయి బాట' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కవిత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా అవతరించిన టిఆర్ఎస్ కు సింగరేణి బిడ్డల ఆశీర్వాదం కావాలని ఆమె కోరారు. వారసత్వ ఉద్యోగాల్లో సింగరేణి కార్మికులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని తెలంగాణ రక్షణసేన అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. సింగరేణి సంస్థ పరిరక్షణ కోసమే.. టీఆర్ఎస్, హింద్ మజ్దూర్ సభ (హెచ్‌ఎంఎస్) కలిసి పని చేస్తున్నాయని చెప్పారు. పాలసీలు రూపొందించాల్సిన సీఎం, డిప్యూటీ సీఎంలే అధికారులకు వినతిపత్రాలు

11 లో









# యూరియా బుకింగ్ యాప్ లనుఎత్తి వేయాలి

## - పండిన పంటలను అమ్మేందుకు రైతుల అరిగోస
## - ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో టిఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జూన్ 15 : రైతులు పండించిన పంటలను అమ్మేందుకు రైతులుఅరిగోసపడు తున్నారని, యూరియా కోసం బుకింగ్ చేసుకునే యాప్లు పనిచేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని టీఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేన) పార్టీ అధ్యక్షురాలు కవిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో పార్టీ జెండా ఆవిష్కరించి పార్టీ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలిగా మొట్టమొదటిసారిగా జిల్లాకు వచ్చిన సందర్భంగా డప్పు చప్పుల్లతో, గుస్సాడీల నృత్యాలు నడుమ స్థానిక చెక్పోస్ట్ నుండి అంబేద్కర్ చౌక్ కొమరం భీమ్ చౌక్ ల వరకు ర్యాలీ నిర్వహించారు. ఆ మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నో ప్రకృతి అందాలు ఉన్న జిల్లాలో ఎక్కువమంది గిరిజనులు నివసిస్తున్నారని, కొమరం భీమ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. ఆదివాసి జిల్లాలో అనేకమైన సమస్యలు వారిని వెంటాడుతున్నాయని, పంటలు వేయకముందే పోడు భూముల గొడవ మొదలైందని, ఆరుగాలం శ్రమించి పంటలను పండించేందుకు వేసే యూరియా యాప్ లు పనిచేయక తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, రైతు ప్రభుత్వం అని చెబుతున్న కాంగ్రెస్ సర్కా ర్ ముందుగా ఇలాంటి యాప్లను గంగలో పాడేయాలని హెచ్చరించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా అప్లను తీసివేయాలని , రైతులు పండించిన పంటలను అమ్ముకునేందుకు సరైన మార్కెటింగ్ సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె ధ్వజమెత్తారు. రైతు ప్రభుత్వం అని చెబుతున్న ముఖ్యమంత్రి రైతులను ఏ విధంగా కూడా ఆదుకోవడం లేదని పక్కా ప్రణాళికలు లేకపోవడంతో రైతులు ఆరిగోశ పడాల్సి వస్తుందని మండిపడ్డారు. రైతు డిస్కం ల పేరుతో ప్రభుత్వం కొత్త కుట్రలకు తెర లేపుతుందని ఇలాంటి వాటిని విరమించుకోవాలని అన్నారు. జిల్లాలో నకిలీ విత్తనాలు అమ్మే వారిని గుర్తించి పీడీ యాక్ట్ వంటి కఠినమైన కేసులు పెట్టి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన ఎల్లవేళలా తాము అందుబాటులో ఉ ంటామని రైతులను ఇబ్బందులకు ఎవరైనా గురి చేస్తే వారి తరఫున కచ్చితంగా పోరాడుతామని అన్నారు. తెలంగాణలో అన్ని జాతీయ పార్టీలు ఉన్న, ప్రజా సమస్యల పట్ల పోరాడే పార్టీ ఒక్క తెలంగాణ రాష్ట్ర సేన అని అన్నారు. హైదరాబాద్ తర్వాత కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో మొట్టమొదటిసారిగా ఇక్కడ తమ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ కార్యకర్తలు నాయకులు సైనికుల్లాగా కష్టపడి పనిచేస్తూ పార్టీ అభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. మాజీమంత్రి బోడ జనార్ధన్ మాట్లాడుతూ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయని తాగునీరు, సాగునీరు సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రాజెక్టులు ఉన్న అసంపూర్తి కాలువలు, ప్రాజెక్టు పనులు పూర్తికాక రైతాంగం ఇబ్బందులను ఎదుర్కొంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన ఆసిఫాబాద్, కాగజ్నగర్ ఇన్చార్జిలు కరిమల్ల వినోద్ కుమార్, కావేటి సబితా మనోహర్, హెచ్ఎంఎస్ సంఘం మంచిర్యాల అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, పార్టీ నాయకులు అశోక్ మహల్కర్, మొయినుద్దీన్, శ్రీనివాస్ దుర్గం శ్యామ్ రావు, మాచర్ల శ్రీనివాస్, ఆత్రం వినోద్ ,మోసిన్ ,సాయి, రామ్ ప్రసాద్ ,అరుణ్, తిరుపతి, పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ కొత్తగూడెం నియోజకవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలి

## - సభ్యత్వ నమోదు సమీక్ష సమావేశానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలి
## - నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రివనమా వెంకటేశ్వరరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, జూన్ 15:బీఆర్ఎస్ పార్టీ కొత్తగూడెం నియోజకవర్గ స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ కొత్తగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 18న గురువారం ఉదయం 9 గంటలకు కొత్తగూడెంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం పురోగతి, సభ్యత్వ నమోదు ప్రక్రియపై సమగ్ర సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పార్టీ సభ్యత్వ నమోదు రాష్ట్ర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, సభ్యత్వ నమోదు కొత్తగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర హాజరుకానున్నారని తెలిపారు. కొత్తగూడెం నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పట్టణ, మండల కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, బూత్ ఏజెంట్లు, మెంబర్షిప్ కో-ఆర్డినేటర్లు, యువజన, మహిళా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విభాగాల నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని వనమా వెంకటేశ్వరరావు కోరారు. పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమం కీలకమని, ప్రతి కార్యకర్త చురుకుగా పాల్గొని సభ్యత్వ నమోదు లక్ష్యాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఈనెల 18న తెలంగాణ ఉద్యమకారుల 'ఛలో హైదరాబాద్'




## - ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా
## - రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులు భారీగా పాల్గొనాలి: నాయకుల పిలుపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 15 : తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 18న హైదరాబాద్‌లో నిర్వహించనున్న "ఛలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రావణబోయిన నర్సయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ మాట్లాడుతూ, ఈ నెల 18న ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఉద్యమకారుల సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరై ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రావణబోయిన నర్సయ్య మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారుల పెన్షన్‌తో పాటు ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న పోరాటంలో భాగంగా హైదరాబాద్‌లో "ఉద్యమ గర్జన" నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యమ ఫలాలను సాధించడంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారులందరూ ఐక్యంగా ముందుకు వచ్చి ఛలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొని తమ హక్కుల సాధన కోసం గళం వినిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకెల్లి సైమన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిల్లి రాజయ్య, కుడిక్యాల సమ్మయ్య, సర్దార్ బేగ్ అలిముద్దీన్, జావేద్, దేవులపల్లి రాంమూర్తి, శ్రీపాద సత్యనారాయణతో పాటు పలువురు ఉద్యమకారులు పాల్గొన్నారు.

# మంచిర్యాలలోని సాయి మాధవ్ హోటల్‌లో భారీ అగ్నిప్రమాదం

## రూ.20 లక్షల వరకు ఆస్తి నష్టం

(ప్రజాలక్ష్యం బ్యూరో)




మంచిర్యాల జూన్ 15 : జిల్లా కేంద్రంలోని సాయి మాధవ్ హోటల్‌లో అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదం తీవ్ర కలకలం రేపింది. సోమవారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో హోటల్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రాథమిక సమాచారం ప్రకారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. మంటలు వేగంగా వ్యాపించడంతో హోటల్‌లోని ఫర్నిచర్, విద్యుత్ పరికరాలు, వంట సామగ్రి, ఇతర వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.20 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు యాజమాన్యం అంచనా వేస్తోంది. అయితే అర్ధరాత్రి సమయంలో హోటల్‌లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఘటనపై పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు విచారణ చేపట్టారు. అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను అధికారులు పరిశీలిస్తున్నారు.



# ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందాలి

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, జూన్ 15 : గ్రామీణ ప్రజలందరికీ ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్, కుబీర్ మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. వైద్యులతో మాట్లాడుతూ, రోజువారీగా ఆసుపత్రిలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి సంబంధించిన అన్ని రకాల రిజిస్టర్లు, రికార్డులు పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. పరిసరాలను ప్రతిరోజు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆసుపత్రి ప్రహరీ గోడ నిర్మాణానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ ప్రభుత్వ వసతిగృహాన్ని తనిఖీ చేశారు. హాజరైన విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నూతన ఏకరూప దుస్తులను అందించారు.

# ప్రజావాణి దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, జూన్ 15 : ప్రజావాణి దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఆస్పత్రులలో హెల్త్ కార్డులు ఆమోదించాలి

## - కవితకు వినతిపత్రం అందజేసిన సామాజిక కార్యకర్త దాసరి శ్రీనివాస్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




ఆసిఫాబాద్, జూన్ 15 : కొమురం భీం జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులలో ఆరోగ్యశ్రీ, ప్రైవేట్ కంపెనీలకు చెందిన హెల్త్ కార్డులకు వైద్యం అందించాలని తెలంగాణ రాష్ట్ర సోషల్ వర్కర్ దాసరి శ్రీనివాస్ తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవితకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొమరం భీం జిల్లాలోని ఆసిఫాబాద్ పట్టణంలో టిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవానికి హాజరైనకవిత కు శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న ప్రయివేట్ ఆస్పత్రులలో ఆరోగ్యశ్రీ సేవలు లేకపోవడం దారుణం అన్నారు. అలాగే బడుగు బలహీన వర్గాలు మధ్యతరగతి ప్రజలు తమ కుటుంబ సభ్యుల యొక్క ఆరోగ్యం కొరకై ప్రైవేట్ కంపెనీలలో ఉండే స్టార్ హెల్త్,కేర్ హెల్త్ తదితర కంపెనీల హెల్త్ కార్డులు తీసుకొని ఉన్నారు. జ్వరం వచ్చిన,రోడ్డు ప్రమాదాలు జరిగిన ఆసిఫాబాద్ లో వైద్యం చేసుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ ప్రైవేట్ ఆస్పత్రుల వారు మెరుగైన వైద్య సేవల పరికరాలు లేకుండా ప్రతి చిన్న చిన్న చికిత్సల నిమిత్తం కూడా మంచిర్యాలకు రిఫర్ చేస్తున్నారు.ఇటు మంచిర్యాలకు అటు చంద్రపూర్ వెళ్లాలంటే సుమారు 65 కిలోమీటర్ల దూరం ఉంది. మధ్యతరగతి వారు అంబులెన్స్ చార్జీలు చెల్లించాలంటే జేబులకు చిల్లులు పడుతున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రి వారు ఆయా హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలకు దరఖాస్తు చేసుకునే విధంగా జిల్లా కలెక్టర్కు తమ ద్వారా తెలపాలని ఆస్పత్రుల వారు హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్లై చేసుకోని ఎడల వారి యొక్క లైసెన్సును రద్దు చేయాలని కోరుతున్నామన్నారు.

# ప్రజాలక్ష్యం కథనానికి స్పందించిన మున్సిపల్ యంత్రాంగం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)


క్షమించు గోదారమ్మ..!

- ప్రజల నిర్లక్ష్యంతో కలుషితమవుతున్న గోదావరి
- కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖానాపూర్ జూన్ 15 : "క్షమించు గోదారమ్మ" శీర్షికతో ప్రజాలక్ష్యం పత్రికలో ప్రచురితమైన వార్తా కథనానికి మున్సిపల్ యంత్రాంగం వెంటనే స్పందించింది. మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది గోదావరి నదిలో పేరుకు పోయిన చెత్తను తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. గోదావరి తీర ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర చెత్తను సిబ్బంది ప్రత్యేకంగా తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. ఇకపై గోదావరిలో చెత్త వేస్తూ పర్యావరణానికి హాని కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ గోదావరిలో పేరుకు పోయిన చెత్తను అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ప్రజాలక్ష్యం పత్రికకు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. వార్త ప్రచురణ అనంతరం వెంటనే స్పందించి చర్యలు చేపట్టిన మున్సిపల్ అధికారులను కూడా వారు అభినందించారు. "సమస్యను చూపిన ప్రజాలక్ష్యం... పరిష్కారం చూపిన మున్సిపల్ యంత్రాంగం" అంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



# భట్టి పర్యటనతో సింగరేణి నిధులు వృథా

## టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, జూన్ 15 : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంచిర్యాల జిల్లా పర్యటనతో సింగరేణి సంస్థ సొమ్ము వృథా అయ్యిందని, 335 మందికి నియామక పత్రాలు ఇవ్వడానికి 50 లక్షలు సంస్థ డబ్బులు ఖర్చు చేసారని టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి ఆరోపించారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో ఆ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామ్మూర్తితో కలిసి మిర్యాల రాజిరెడ్డి మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సభలో కార్మికులకు సంబంధించిన మెడికల్ బోర్డు నిర్వహణ, 250 గజాల ఇంటి స్థలం, పెర్క్ పై ఇన్కమ్ టాక్స్ రీయంబర్స్ మెంట్, గృహ నిర్మాణానికి 25 లక్షల వడ్డీలేని రుణాలు, లాభాల వాటాపై మాట్లాడకుండా అబద్ధపు మాటలు మాట్లాడారని తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క రూపాయి ఖర్చు లేకుండా 13 వేల మందికి నియామక పత్రాలు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. నిన్నటి సభలో 335 మందికి నియామక పత్రాలు ఇవ్వడానికి 50 లక్షల రూపాయలు సింగరేణి సొమ్మును వృథా చేశారన్నారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సంస్థను మరింత దివాళా తీస్తున్నారని విమర్శించారు. సింగరేణి ఆవిర్భావ వేడుకలకు, సింగరేణి హాస్పిటల్ లో సరైన మందులకు డబ్బులు లేవని, పనిముట్లు కూడా కొనడానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇలాంటి పరిస్థితుల్లో ఇంత హంగామా అవసరమా! అంటూ ప్రశ్నించారు. 335 మందిలో భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు పట్టుమని పది మందికి కూడా నియామక పత్రాలు ఇవ్వలేదని, మిగతావన్నీ అధికారులే ఇచ్చారని, అలాంటప్పుడు ఇలాంటి వృథా ఖర్చులు ఎందుకన్నారు. ఇంకా ఈ మీడియా సమావేశంలో టీబీజీకేఎస్ నాయకులు నూనె కొమురయ్య, పర్లపల్లి రవి, జాహెద్ పాషా, పోలాడి శ్రీనివాస్, శేషగిరి, రొడ్డ సంపత్, జోసఫ్ తదితరులున్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దు

## - కలెక్టర్ చిత్రా మిశ్రా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కరీంనగర్, జూన్ 15 : ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన దరఖాస్తులను పెండిం గ్‌లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరి యంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, డీఆర్ఓ స్వామి, ఆర్డీవో షర్మిల, కలెక్టరేట్ ఏవో సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుంచి వచ్చిన వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 256 దరఖా స్తులు రాగా, వాటిలో గృహ నిర్మాణ శాఖకు అత్యధికంగా 142, కరీంనగర్ నగరపాలక సంస్థకు 60 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ ఇప్పటికే వ్యవసాయ శాఖ, విద్యాశాఖల అధికారులతో తొలి విడత సమీక్ష సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. బుధవారం జరగనున్న రెండో విడత సమీక్ష సమావేశానికి సంబంధిత అధికారులు పూర్తి నివేదికలతో హాజరుకావాలని సూచించారు. అలాగే మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో డీపీఓ, డీఆర్డీఓ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులు, దరఖాస్తులు, ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించి క్లియర్ చేయాలని అన్ని శాఖల అధికారులకు ఆదేశించారు. ఈ వారానికి సంబంధించిన యాక్షన్ ప్లాన్‌లు, తనిఖీ నివేదికలను శుక్రవారం సాయంత్రం లోగా సమర్పించాలని జిల్లా అధికారులకు సూచించారు. అంతకుముందు అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ శాఖల వారీగా రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.



# విద్య, వైద్యం రంగాలకు సీఎస్ఆర్ నిధుల్లో అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

## జిల్లా కలెక్టర్ అంకిత్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూన్ 15 : జిల్లాలో విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను అధికంగా వినియోగించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ ఐడీఓసీ సమావేశ మందిరంలో సింగరేణి, కేటీపీఎస్, నవభారత్, ఐటీసీ తదితర పరిశ్రమల ప్రతినిధులతో సీఎస్ఆర్ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కోరారు. పాఠశాలల్లో తరగతి గదుల అభివృద్ధి, ఫర్నిచర్, తాగునీటి సదుపాయాలు, పారిశుద్ధ్య వసతులు, డిజిటల్ విద్యా సౌకర్యాల కోసం సీఎస్ఆర్ నిధులు వినియోగించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య పరికరాలు, మౌలిక వసతులు, రోగుల సౌకర్యాల కల్పనతో పాటు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవల విస్తరణకు పరిశ్రమలు సహకరించాలని అన్నారు. ప్రజావాణి ద్వారా అందుతున్న వినతులు, స్థానిక అవసరాల ఆధారంగా సమస్యలను గుర్తించి ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే అభివృద్ధి పనులను చేపట్టాలని ఆదేశించారు. గిరిజన, గుత్తికోయ ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీటి సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించిన కలెక్టర్, అన్ని పరిశ్రమలు సామాజిక బాధ్యతతో ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఓ సంజీవరావు, సంబంధిత శాఖల అధికారులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుడి చేతిలో డిటోనేటర్ పేలి తీవ్ర గాయాలు



**- కేటీకే-5 ఇంక్లైన్ భూగర్భ గనిలో ప్రమాదం - విచారణకు ఆదేశాలు**

**- నాణ్యత లేని పేలుడు పదార్థాల వల్లే ప్రమాదం: మిర్యాల రాజిరెడ్డి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్ భూపాలపల్లి, జూన్ 15 : భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-5 ఇంక్లైన్ భూగర్భ గనిలో సోమవారం ఉదయం జరిగిన ప్రమాదంలో సింగరేణి కార్మికుడు శ్రీరాముల ప్రదీప్ తీవ్రంగా గాయపడ్డారు. బ్లాస్టింగ్ పనులు నిర్వహిస్తున్న సమయంలో ఆయన చేతిలో డిటోనేటర్ పేలడంతో ఎడమ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం తరలించిన అధికారులు అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం మేరకు, భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-5 గనిలో 13వ లెవల్‌లో షాట్ ఫైరర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీరాముల ప్రదీప్ బ్లాస్టింగ్ పనులు చేపడుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బ్లాస్టింగ్ ప్రక్రియలో భాగంగా ఆయన చేతిలోనే డిటోనేటర్ పేలినట్లు సింగరేణి అధికారులు ప్రాథమికంగా వెల్లడించారు. ప్రమాదంలో ప్రదీప్ ఎడమ చేయి తీవ్రంగా దెబ్బతినడంతో తొలుత మంజూర్‌నగర్‌లోని సింగరేణి ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం హైదరాబాద్‌కు తరలించారు. గాయపడిన కార్మికుడి చికిత్సను భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలాన్ని ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మాటూరి రవీందర్, గని మేనేజర్ మాచర్ల రమేష్ పరిశీలించి పరిస్థితులను సమీక్షించారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు పూర్తి స్థాయి విచారణ అనంతరం మాత్రమే వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై స్పందించిన మైనింగ్ శాఖ ఇన్‌స్పెక్టర్ హరిప్రసాద్ విచారణకు ఆదేశించారు. బ్లాస్టింగ్ ప్రక్రియలో భద్రతా ప్రమాణాల అమలుపై ప్రత్యేకంగా దృష్టి సారించి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు సమాచారం. కార్మికుల అభిప్రాయం ప్రకారం, పేలుడు పదార్థం చేతిలోనే పేలడంతో తీవ్ర గాయాలు అయినప్పటికీ ప్రదీప్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. మరో కీలక అవయవం వద్ద పేలుడు సంభవించి ఉంటే మరింత ప్రమాదం జరిగే అవకాశం ఉండేదని సహచర కార్మికులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

**నాణ్యత లేని పేలుడు పదార్థాల వల్లే ప్రమాదం: మిర్యాల రాజిరెడ్డి:** ఈ ఘటనపై తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి స్పందిస్తూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో సింగరేణి సంస్థ నాణ్యమైన పేలుడు పదార్థాలను వినియోగించేదని, అయితే ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్ టెండర్ల పేరుతో ప్రైవేట్ సంస్థల నుంచి కొన్ని డిటోనేటర్లు, ఎంకర్ జెలటిన్ స్టిక్స్ నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. కోల్ ఇండియా, డబ్ల్యూసీఎల్ వంటి సంస్థల ప్రమాణాలతో పోల్చితే సింగరేణిలో ప్రస్తుతం వినియోగిస్తున్న కొన్ని పేలుడు పదార్థాల నాణ్యత, భద్రతా ప్రమాణాలపై సందేహాలు ఉన్నాయని కమిషన్లు, లాభాల కోసం ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా కొనుగోళ్లు జరగడం వల్లే ఇటువంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. ఈ ఘటనపై స్వతంత్ర, సమగ్ర విచారణ జరిపి ప్రమాదానికి గల అసలు కారణాలను వెలికితీయాలని, గనుల్లో వినియోగిస్తున్న పేలుడు పదార్థాల నాణ్యతను సాంకేతిక నిపుణులతో పరీక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే గాయపడిన కార్మికుడు శ్రీరాముల ప్రదీప్‌కు అత్యుత్తమ వైద్యం అందించడంతో పాటు తగిన ఆర్థిక సహాయం, నష్టపరిహారం ప్రకటించాలని సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, గనుల్లో భద్రతా ప్రమాణాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని మిర్యాల రాజిరెడ్డి సూచించారు.

# వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, జూన్ 15 : జిల్లాలో వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తన ఛాంబర్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి,నూతన పెన్షన్ల మంజూరు,వన మహోత్సవం,గ్రామాల పారిశుద్ధ్యం,వర్షాకాలం సంసిద్ధత అప్రమత్తత,తాగునీటి సరఫరా,వన మహోత్సవం మొక్కల పెంపకం,తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో ఎక్కడా జాప్యం లేకుండా పనులను వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తూ నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. ప్రత్యేక ప్రజా దర్బార్, ప్రజావాణి కార్యక్రమంలో పెన్షన్ల మంజూరు కోసం అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పరిశీలించి అర్హుల జాబితా సిద్ధం చేసి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. వర్షాకాలంలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించే విధంగా ముందస్తు కార్యాచరణ సిద్ధంగా ఉంచాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, చెరువులు,కుంటలు,వాగులు, కల్వర్టుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి,లోతట్టు ప్రాంతాల నుంచి గర్భిణీ స్త్రీలను ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పునరావాస కేంద్రాల ఏర్పాటు,ఇతర మౌలిక సదుపాయాల కల్పన,తదితర అంశాలపై ముందస్తు కార్యకరణతో అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని,దోమలు,సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా తాగునీటి సరఫరా అందేలా చూడాలని, సమస్యలు ఉన్న ప్రాంతాల్లో వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. వన మహోత్సవ కార్యక్రమాన్ని జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. మేడారం పరిసర ప్రాంతాలలో విస్తృత స్థాయిలో మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అధికారులు సమన్వయంతో పని చేసి జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో నిలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు,డిపిఓ వెంకయ్య, హౌసింగ్ పీడీ సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ సంపత్, ఎంపీడీవోలు,ఎంపీఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

**హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, జూన్ 15 : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ స్పష్టం చేశారు. సోమవారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని సింగన్నగూడెం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లతో పాటు తుర్కపల్లి మండలం వాసాలమర్రి, కొండాపురం, భువనగిరి మండలం అనంతారం గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ భాస్కరరావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల అమలు పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సింగన్నగూడెంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని ఆదేశించారు. అలాగే వివిధ గ్రామాల్లో మంజూరైన ఇళ్ల సంఖ్య, పూర్తయినవి, నిర్మాణ దశలో ఉన్నవి, ఇంకా ప్రారంభం కాని ఇళ్ల వివరాలను సమీక్షించారు. నిర్మాణాలు పూర్తిచేసుకున్న లబ్ధిదారుల ఇళ్లను సందర్శించి వారితో మాట్లాడారు. ప్రభుత్వం అందించిన సహాయంతో సొంత ఇంటి కల నెరవేరిందా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పూరిగుడిసెలు, డేరాలు, మట్టి గోడల ఇళ్లు, రేకుల షెడ్లలో నివసిస్తున్న నిరుపేదలను గుర్తించి వారికి కూడా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతారం గ్రామానికి చెందిన ఆగమ్మ ఇంటిని సందర్శించిన అధికారులు ఆమెతో మాట్లాడారు. "ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు కావాలనే కోరిక ఉండేదని ఈ ప్రభుత్వం వల్ల ఆ కల నెరవేరిందని ఇప్పుడు భద్రంగా, గౌరవంగా మా సొంత ఇంట్లో నివసిస్తున్నాం" అంటూ ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి అర్హులందరికీ గృహ సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎండీ గౌతమ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ అలివేలు, ఎంపీడీవోలు, ఏఈలు తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు ఆపేశారు న్యాయం చేయండి

**ప్రజావాణిలో కలెక్టర్‌కు దళిత మహిళ ఫిర్యాదు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, జూన్ 15 : రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని అర్ధాంతరంగా నిలిపివేశారని,ఇందుకు కారణమైన గ్రామ సర్పంచ్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతూ మెదక్ జిల్లా,పాపన్నపేట మండలం కుర్తివాడ గ్రామానికి చెందిన రేవెళ్ళి సంధ్య సోమవారం కలెక్టరేట్ లో ఏర్పాటుచేసిన ప్రజావాణిలో మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి సమక్షంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం.. తనకు నివసించేందుకు సొంత ఇల్లు లేకపోవడంతో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోగా,ఇటీవల ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసిందని తెలిపారు. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా గ్రామ పెద్దల సూచన మేరకు ఇంటి నిర్మాణ బాధ్యతను కాంట్రాక్టర్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు. కాంట్రాక్టర్ ఇంటి నిర్మాణంలో భాగంగా బేస్‌మెంట్ స్థాయి వరకు పనులు పూర్తి చేసిన అనంతరం,అకస్మాత్తుగా మెటీరియల్ సరఫరా నిలిపివేసి పనులను ఆపివేశాడని ఆరోపించారు. ఈ విషయమై కాంట్రాక్టర్‌ను ప్రశ్నించగా,గ్రామ సర్పంచ్ శ్రీధర్ ఆదేశాల మేరకే పనులు నిలిపివేశానని చెప్పినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్‌ను కలిసి కారణం అడగగా,గత సర్పంచ్ ఎన్నికల్లో తమ కుటుంబం తనకు ఓటు వేయలేదనే కారణంతో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని నిలిపివేసినట్లు స్పష్టంగా తెలిపారని ఆరోపించారు. అంతేకాకుండా, తనను ఆ 30 మంది గెలిపించారని,వారు అనుమతిస్తేనే ఇంటి నిర్మాణం కొనసాగుతుందని,పదేపదే తన ఇంటికి రావద్దని హెచ్చరించినట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇప్పటికే బేస్‌మెంట్ పనులు పూర్తయ్యాయని,ఆదశకు సంబంధించిన ఒక బిల్లును కాంట్రాక్టర్‌కు చెల్లించినప్పటికీ నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. తన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని అర్ధాంతరంగా నిలిపివేసిన కాంట్రాక్టర్‌తో పాటు,నిలిపివేతకు కారణమైన గ్రామ సర్పంచ్‌పై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని,తన ఇంటి నిర్మాణం పూర్తయ్యేలా జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకుని న్యాయం చేయాలని రేవెళ్ళి సంధ్య ప్రజావాణి ద్వారా జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కొత్తూరి శ్రీనివాస్, బద్రి మల్లేశం,మన్నె వెంకటేశం తదితరులు ఉన్నారు.

**దళిత సంఘాల ఆగ్రహం:**

రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణాన్ని కాంట్రాక్టర్ మరియు గ్రామ సర్పంచ్ అర్ధాంతరంగా నిలిపివేయడం పట్ల మెదక్ జిల్లా దళిత సంఘాల ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దళిత కుటుంబం పట్ల సర్పంచ్ తీరు సరికాదని,ఇలాంటివి పునరావృతమైతే ఆందోళనలు సైతం చేస్తామని హెచ్చరించారు.

# కల్వకుర్తి రూపురేఖలు మారుస్తాం



**- రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులు - ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం**

**- నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు - రైతులు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేస్తాం...**

**- పేదలందరికి ఇందిరమ్మ ఇల్లు - కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కల్వకుర్తి, జూన్ 13 : కల్వకుర్తి నియోజకవర్గాన్ని రాబోయే రెండు సంవత్సరాలలో అన్ని రంగాలలో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. రూ.1000 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ రాబోయే రెండున్నరేళ్లలో అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కల్వకుర్తిని అభివృద్ధి పథంలో నడిపిస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గానికి ఐదువేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. మొదటి విడతలో మంజూరు చేసిన 3500 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం 95శాతం పూర్తి అయిందన్నారు. రెండో విడతలో మరో 1500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. పేదలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తోందని చెప్పారు. గత పదేళ్ల పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేని బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ఇందిరమ్మ పాలనలో నిజమైన అర్హులకు సంక్షేమ పథకాలు చేరుతున్నాయని పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులు వేగంగా సాగుతున్నాయని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. మండల కేంద్రాల నుంచి ప్రతి గ్రామానికి బీటీ రోడ్ల నిర్మాణం కోసం ఇప్పటికే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతిపక్షాల విమర్శలపై స్పందించిన ఎమ్మెల్యే, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు రాజకీయ లబ్ది కోసం నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కల్వకుర్తి నియోజకవర్గానికి ఉపయోగపడే ఒక్క అభివృద్ధి కార్యక్రమమైనా చేపట్టిందా అని ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని, అభివృద్ధి పేరుతో ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రజల సంక్షేమం, అభివృద్ధినే లక్ష్యంగా ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్పష్టం చేశారు.



# క్రీడలు శారీరక,మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయి

**- జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, జూన్ 15 : క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ములుగు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ అన్నారు. ఆదివారం ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించిన అస్మిత బాలికల సైక్లింగ్ పోటీలను జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన యువతులు,విద్యార్థినిలు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ పోటీల్లో సీనియర్ కేటగిరి విభాగంలో సంగీత, జూనియర్ విభాగంలో సుమన శ్రీ అత్యంత ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. కాగా, వారికి సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్ మెమెంటోలు అందజేయడం తోపాటు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా బాదం ప్రవీణ్ మాట్లాడుతూ యువత క్రీడల వైపు ఆసక్తి పెంచుకుని శారీరక,మానసిక దృఢత్వాన్ని సాధించాలని అన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ముందుకెళ్లాలని ఆయన సూచిం చారు. సైక్లింగ్ ఆరోగ్యానికి మేలు చేయడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మరింత మంది క్రీడాకారులు ముందుకు వచ్చి జిల్లా,రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. పోటీల నిర్వహణలో భాగంగా పాల్గొన్న క్రీడాకారులకు నిర్వాహకులు అవసరమైన సూచనలు అందించారు. పోటీలను విజయవంతం చేయడంలో కోచ్‌లు, వాలంటీర్లు, క్రీడా సంఘాల ప్రతినిధులు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పోరిక అసిలాల్, కోచ్ శ్రీరామ్ క్రీడాకారులు, యువజన సంఘాల ప్రతినిధులు, పోలీసు అధికారులు,108 సిబ్బంది, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి, జూన్ 15 : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు, వినతులను సమగ్రంగా పరిశీలించి త్వరిత గతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంగీత తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిశీలించాలని సూచించారు. ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఎలాంటి జాప్యం చేయరాదని చెప్పారు. అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. జిల్లాలోని వివిధ డివిజన్లు మరియు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 62 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలెక్టరేట్‌లో 31, సంగారెడ్డి డివిజన్‌కు 15, ఆందోల్ డివిజన్‌లో 0, నారాయణ ఖేడ్ డివిజన్‌లో 10, జహీరాబాద్ డివిజన్‌లో 6 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా ప్రజావాణి కార్యక్రమం

**- ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్న జిల్లా ఎస్పీ**
**- ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాత విచారణ జరిపి**
**- సత్వర న్యాయం అందించాలని అధికారులకు ఆదేశాలు.**
**- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి, జూన్ 15 : ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విన్నారు. సంబంధిత అంశాలపై స్థానిక ఎస్.హెచ్.ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకొని, ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్‌లలో తమ సమస్యలు పరిష్కారం దొరకనప్పుడు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాల యంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. మధ్యవర్తులను నమ్మకుండా తమ సమస్యలను నేరుగా పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును జిల్లా పోలీసు కార్యాలయం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తూ, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు. ప్రజలకు త్వరితగతిన, పారదర్శకంగా న్యాయం అందించడమే పోలీసు శాఖ లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు.



# జిల్లా అభివృద్ధే లక్ష్యంగా అధికారులు పనిచేయాలి

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, జూన్ 15 : జిల్లా అభివృద్ధే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తన ఛాంబర్‌లో రెవెన్యూ అధికారులతో భూ భారతి,భూ సేకరణ, రామచంద్రపురం భూముల రీ సర్వే, మీసేవ ధ్రువీకరణ పత్రాల మంజూరు,స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తదితర అంశాలపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భూ భారతి కార్యక్రమం అమలు పురోగతి, భూ రికార్డుల పరిశీలన, ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ అవసరాలకు, అభివృద్ధి పనులకు సంబంధించిన భూ సేకరణలో నిబంధనలు పాటిస్తూ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. రామచంద్రపురం భూముల రీ సర్వే అంశంపై పెండింగ్‌లో ఉన్న భూ వివాదాలు,సర్వే ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేసి,ప్రజలకు స్పష్టమైన హక్కులు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు. మీసేవ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉండకూడదని, ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ సేవలను నిర్దిష్ట గడువులో అందించేలా సంబంధిత అధికారులు పనిచేయాలని ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం పురోగతిపై సమీక్షిస్తూ, సంబంధిత అధికారులు సమగ్రంగా పనిచేసి అన్ని వివరాలను క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సేవల అమలు,భూ సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, పెండింగ్ సమస్యలు లేకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్డీవో కృష్ణవేణి, డీఆర్ఓ రవికుమార్, కలెక్టరేట్ ఏఓ రాజ్ కుమార్, పర్యవేక్షకులు మంజుల, మహేష్ బాబు, అన్ని మండలాల తహసీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాలక్ష్యం

సంపాదకీయం

# నేలవిడిచి సాము చేస్తున్న ప్రాంతీయ పార్టీలు !

కాంగ్రెస్ నుంచి విడివడి ఏర్పడ్డ ప్రాంతీయ పార్టీలు అన్నీ మళ్లీ కాంగ్రెస్‌లో విలీనం కావాలని, అప్పుడే బిజెపి వ్యతిరేక పోరాటం బలోపేతం అవుతుందని శివసేన ఎంపి సంజయ్ రౌత్ ఈ మధ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. తృణమూల్ కాంగ్రెస్, శరద్ పవార్ పార్టీలను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన ఎందుకు అన్నారో కానీ, బిజెపిని దెబ్బతీయాలంటే కాంగ్రెస్ బలోపేతం కావా లన్న ఉద్దేశ్యంతో అలా అని వుంటారు. రెండు పార్టీల వ్యవస్థ ఉండివుంటే ఇలాంటిదే జరుగుతుంది. ఇష్టమున్న పార్టీలు ఆ రెండు పార్టీల్లో చేరుతాయి. అది బిజెపి లేదా కాంగ్రెస్ కావచ్చు. కానీ భారత ప్రజాస్వామ్యంలో ప్రాంతాయ పార్టీల పాత్రను తక్కువగా అంచనావేయలేం. ఒకప్పుడు కాంగ్రెస్ ఏకఛత్రాధిపత్యంగా, నిరంకుశంగా చేస్తున్న పాలనకు వ్యతిరే కంగా ప్రాంతీయ పార్టీలు పుట్టుకురావడం చూశాం. కమ్యూ నిస్టులు పూర్తిగా బలహీనపడి, దేశంలో కమ్యూనిజం అంతం కావడంతో ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో బిజెపి, కాంగ్రెస్ పార్టీలతో పాటు కొన్ని ప్రాంతీయ పార్టలు తమ ప్రభావం చూపుతున్నాయి. ఉమ్మడి ఎపిలో కాంగ్రెస్ నిరంకుశ పాలనపై ఎన్టీఆర్ తిరుగుబాటు చేశారు. తెలుగుదేశం పార్టీ ఏర్పడి ఇప్పటికీ బలంగా నిలిచింది. ఇటీవల తమిళనాడులో ద్రవిడ పార్టీలపై యుద్ధం ప్రకటించిన టివికె పార్టీ ఏకంగా అధికారం లోకి వచ్చింది. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ప్రాంతీయ పార్టీలు ఇప్పుడు మనుగడ సాగిస్తున్నాయి. ఆయా పార్టీలు కాంగ్రెస్‌లో విలీనం అయితే జరిగేది కాంగ్రెస్ బలోపేతం మాత్రమే. కాంగ్రెస్ దేశంలో కుటుంబ పాలన సాగిస్తున్న పార్టీ. అక్కడ సోనియా, రాహుల్, ప్రియాంకల పెత్తనం తప్ప ఇతరులకు అఇకారం ఉండదు. పేరుకే ఖర్గే జాతీయ పార్టీ అధ్యక్షుడు. ఆయన మాట కూడా చెట్టుబాటు కాదు. అలాంటి పార్టీలో ప్రాంతీయ పార్టీల విలీనం కావాలన్న ఆలోచన సరికాదు. దీంతో ఎలాంటి రాజకీయ ప్రయోజనం ఉండదు. అందువల్ల సంజయ్ రౌత్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం లేదు. ఇకపోతే కాంగ్రెస్ ముక్త భారత్ పిలుపునిచ్చిన మోడీ కూడా కాంగ్రెస్‌ను ఏమీ చేయలేక పోయారు. ఆయా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను కూడా బిజెపి ఏమీ చేయలేకపోతున్నది. దేశంలో ప్రజల ఆదరణ ఉన్నంత వరకు ఏ పార్టీ అయినా ఉంటుంది. బెంగాల్‌ను తీసుకుంటే ప్రాంతీయ పార్టీగా తృణ మూల్ విఫలం అయ్యింది. ఒక ఆడబిడ్డ చేతిలో దేశ భద్రతకు భంగం ఏర్పడింది. తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల్లో ఓడిపో యిన కొద్దిరోజులకే చిన్నాభిన్నం అవుతోంది. ఇది స్వయంకృ తంగా చూడాలి. అంతమాత్రాన కాంగ్రెస్‌లో విలీనం అయితే, భ్రష్టత్వం కాంగ్రెస్‌కు కూడా అంటుకుం టుంది. ఇకపోతే ఇండియా కూటమిలో ఉన్న పార్టీలు బలమైన వాణిని వినిపిం చడం లేదు. అందుకే ఎన్‌డిఏ వైఫల్యాలపై గట్టిగా పోరాడ లేకపోతున్నాయి. అధికారమే లక్ష్యంగా అన్ని పార్టీలు రాజకీ యాలు నడుపుతున్నాయి తప్ప ప్రజల కోణంలో ఆలోచన చేయడం లేదు. దళితుల గురించి అన్ని పార్టీలు గొప్పలు చెబుతున్నా ఇప్పటివరకు ఏ రాష్ట్రంలోనూ పూర్తికాలం ముఖ్యమంత్రి అయిన దాఖలాలు లేవు. బెంగాల్లో గతంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ పరిపాలించినా అవకాశం దళితు లకు దక్కలేదు. తమిళనాడులో డీఎంకే అధికారం కోల్పోయిన పటికీ మరో ప్రాంతీయ పార్టీ అధికారం చేపట్టింది. కేరళలో అధికారం కోల్పోయాక ఇప్పుడు దేశంలో కమ్యూనిస్టు పార్టీలు క్రమంగా కనుమరుగయ్యే స్థితి కనబడు తున్నది. బిహార్‌లో ఆర్జేడీది అదే పరిస్థితి. ఒడిశాలో కూడా నవీన్ పట్నాయక్ బిజూ జనతాదళ్ అదే బాటలో ఉంది. ప్రాంతీయ పార్టీలు ప్రజల్లో బలంగా లేకపోవడం స్వార్థ చింతనతో పాలన చేయ డం, ప్రజల ఆకాంక్షలను పట్టించుకోక పోవడం వంటి కారణా లతో కనుమరుగు అవుతున్నాయి. ఉమ్మడి ఎపిలో, ఇప్పుడు విభజిత ఎపిలోతెలుగుదేశం పార్టీ ఇంకా గట్టిగా నిలబడి ఉం దంటే అందుకు ప్రజల మద్దతు కారణమని చెప్పాలి. వైఎస్ జగన్ ప్రాంతీయ పార్టీని ప్రజలు నమ్మి ఓటేస్తే ఆయన దానిని నిలబెట్టుకోలేక పోయారు. టిడిపి, ఉత్తరప్రదేశ్‌లో సమాజ్ వాదీ పార్టీ కూడా ఫక్తు కుటుంబ పార్టీలుగా మారాయి. అలాగే తెలంగాణలో బిఆర్ఎస్ కూడా కేవలం కుటుంబ పార్టీగా మారింది. ఇలాంటి పార్టీలను ప్రజలు దీర్ఘకాలం నమ్మరని గుర్తించాలి. ఈ స్థితిలో ప్రాంతీయ పార్టీలు మారాలి. సమాజంలో అన్నివర్గాల ప్రజలను కలుపుకుని పోవాలి. ప్రజల ఎజెండాను తమ లక్ష్యంగా చేసు కుని ముందుకు సాగాలి. ప్రాంతీయ పార్టీలకు జాతీయ దృక్పథం ఉండాలి. ఆయా రాష్ట్రాల్లో పాలనలో భిన్నత్వం కనిపించాలి. అభివృద్ధిని ఆలంబనగా చేసుకుని ముందుకు సగాలి. లేకుంటే ఆయా పార్టీలను ప్రజలు విసిరి అవత పారేస్తారు. బెంగాల్లో అదే జరిగింది. దేశంలోని ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్, బిజెపిలకు భిన్నంగా పాలన సాగించాలి. ఆయా రాష్ట్రాలను అభివృద్ధిలో ముందు వరసలో నిలబెట్టాలి. జాతీయ పార్టీలకన్నా ప్రాంతీయ పార్టీలే నయమని నిరూపించాలి. ఈ ప్రయత్నంలో తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ పాలనలో తనదైన ముద్ర వేశారు. దళితులు, గిరిజనలు, బిసిలను రాజకీయంగా ఎంచుకుని వారిని ముందుకు నడిపించారు. ఓ రకంగా ఆయన విప్లవం సాధిం చారనే చెప్పాలి. అలాగే ఓటు బ్యాంక్ రాజకీయాలకు పోకుం డా అభివృద్ధి రాజకీయాలను చేస్తే ప్రజలు తప్పకుండా ప్రాంతీ య పార్టీలను ఆదరిస్తూనే ఉంటారు. ఎందుకంటే కాంగ్రెస్, బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఆయా ముఖ్యమంత్రులకు స్వేచ్ఛ ఉండదు. జాతీయ పార్టీ కనుక ఢిల్లీ ఆదేశాలను పాటించాల్సి ఉంటుంది. ఈ విషయంలో కాంగ్రెస్ ముందున్నది. చీమ చిటుక్కుమన్నా కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలకు చెప్పాల్సిందే. స్వతంత్ర నిర్ణయాలకు అక్కడ ఆస్కారం ఉండదు. ప్రాంతీయ పార్టీలు జాతీయ ప్రత్యామ్నాయంగా మారితేనే కాంగ్రెస్ , బిజెపిలకు కొంత చెక్ పడుతుంది.

# జ్ఞాన సంకల్పం... నవ నిర్మాణ రంగం:

# తెలంగాణ విద్యారంగంలో సరికొత్త సంస్కరణల శంఖారావం

## జ్ఞానదీపాల మహోత్సవం : సరికొత్త ఆకాంక్షలతో బడిబాట పడుతున్న బాల్యం



రామకిష్టయ్య సంగన భట్ల
9440595494

తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ కేవలం అక్షరాస్యతను పెంచే సాధనం మాత్రమే కాదు; అది సామాజిక సమానత్వానికి, ఆర్థిక ప్రగతికి అత్యంత బలమైన పునాది. 2026 జూన్ 15 నుంచి ప్రారంభం అయిన 2026-27 నూతన విద్యా సంవత్సరం ఈ ప్రయాణంలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలవబోతోంది. రెండు నెలల సుదీర్ఘ వేసవి సెలవుల అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలల ప్రాంగణాలు మళ్లీ బాల ల కిలకిలారావాలతో, కేరింతలతో చైతన్యవంతం కానున్నాయి. ప్రతి ఏటా బడి గంట మోగడం అనేది ఒక సాంప్రదాయంగా కనిపించి నప్పటికీ, ఈ విద్యా సంవత్సరం ప్రారంభం మాత్రం తెలంగాణ విద్యా చరిత్రలో సరికొత్త ఆశలకు, మహత్తర ఆకాంక్షలకు వేదికగా మారు తోంది. కేవలం పాఠ్యపుస్తకాల పరిమిత పరిధిని దాటి, డిజిటల్ విప్ల వాన్ని అందిపుచ్చుకుంటూ, మౌలిక వసతుల నాణ్యతను పెంచుకుంటూ ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ సంస్థలకు దీటుగా ముస్తాబవు తున్నాయి. విద్యా రంగం అనేది ఒక వ్యక్తి జీవితాన్ని తీర్చిదిద్దడమే కాకుండా, సమగ్ర సమాజ భవిష్యత్తును సాకారం చేసే అద్భుత శక్తి. అందుకే విద్యా సంవత్సరం ప్రారంభం అనేది కేవలం ఒక పరిపాలనా ప్రక్రియ కాదు, అది ఒక నవసమాజ నిర్మాణానికి, కొత్త తరానికి జ్ఞానదీపాలను అందించే ఒక పవిత్ర యజ్ఞం. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, సాంఘిక సంక్షేమ గురుకులాలు, గిరిజన సంక్షేమ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (KGBV), ఆదర్శ పాఠశాలలు (మోడల్ స్కూళ్లు) అన్నీ కలిపి సుమారు 50 వేలకు పైగా విద్యాసంస్థలు విస్తరించి ఉన్నాయి. ఈ సంస్థల్లో దాదాపు 60 లక్షల మందికి పైగా విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారు. ఇంతటి భారీ మానవ వనరుల విద్యా వ్యవస్థ మళ్లీ క్రియాశీలకం కానుండటం రాష్ట్ర పురోగతిలో అత్యంత కీలకమైన ఘట్టం.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత విద్యా రంగంలో సంభవించిన సంస్కరణలు విప్లవాత్మకమైనవి. గడిచిన దశాబ్ద కాలంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో కోల్పోయిన నమ్మకాన్ని పునరుద్ధరించడానికి అనేక పటిష్టమైన చర్యలు తీసుకున్నారు. అందులో అత్యంత ప్రధానమైనది 'మన ఊరు-మన బడి' (పట్టణాల్లో 'మన బస్తీ-మన బడి') కార్యక్రమం. ఈ బృహత్తర ప్రణాళిక కింద మొదటి, రెండవ విడతల్లో వేలాది ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయి వసతులతో పునర్నిర్మించబడ్డాయి. తరగతి గదుల ఆధునీకరణ, అదనపు గదుల నిర్మాణం, రక్షిత సురక్షిత తాగునీటి సౌకర్యం, బాలబాలికలకు ప్రత్యేక ఆధునిక మరుగుదొడ్లు, నిరంతర విద్యుద్దీకరణతో పాటు డిజిటల్ బోధనా పరికరాలను అమర్చడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల బాహ్య స్వరూపమే మారిపోయింది. ఈ మౌలిక సదుపాయాల కల్పన వల్ల గత కొన్నేళ్లుగా ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల వైపు విద్యార్థుల వలసలు గణనీయంగా పెరగడం విశేషం. విద్యాశాఖ గణాంకాల ప్రకారం, ప్రభుత్వ పాఠశాలల్లో స్థిరమైన ప్రవేశాల వృద్ధి నమోదు కావడం ఈ సంస్కరణల విజయానికి నిదర్శనం.

నూతన విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పరిపాలనా యంత్రాంగం మరియు విద్యాశాఖ ఎంతో వ్యూహాత్మకంగా అడుగులు వేశాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పోషకాహార స్థాయిని పెంచడానికి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతా ప్రమాణాలను మరింత పెంచారు. రాబోయే రోజుల్లో విద్యార్థులకు రాగి జావ, గుడ్లు వంటి బలవర్ధకమైన ఆహారాన్ని క్రమం తప్పకుండా అందించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

వేసవి సెలవుల అనంతరం బడి బాట పట్టే చిన్నారులకు, ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో తొలిసారి అడుగుపెట్టే ఒకటో తరగతి విద్యార్థులకు ఈ అనుభవం జీవితాంతం గుర్తుండి పోతుంది. అప్పటి వరకు ఇళ్లకే పరిమితమైన పసి హృదయాలు కొత్త వాతావరణం, కొత్త ఉపాధ్యాయులు, కొత్త స్నేహితులను చూసి ఒకింత భయపడే అవకాశం ఉంటుంది.కాబట్టి, విద్యా సంవత్సరం తొలి రోజుల్లో ఉపా ధ్యాయులు, తల్లిదండ్రులు ఎంతో సున్నితంగా, ప్రేమపూర్వకంగా వ్యవ హరించాల్సి ఉంటుంది. పాఠశాలలను కేవలం చదువు చెప్పే కేంద్రా లుగా కాకుండా 'ఆనంద నిలయాలుగా' మార్చాలి. ఆటపాటలతో, కథలతో కూడిన విద్యా బోధన ద్వారా బాలల మానసిక వికాసానికి అనుగుణంగా అభ్యాస ప్రక్రియ సాగాలి.



తెలంగాణ విద్యారంగంలో ప్రస్తావించదగ్గ మరొక అద్భుత విజయం-గురుకుల విద్యా వ్యవస్థ. ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనారిటీ సంక్షేమ గురుకుల విద్యాలయాలు నేడు దేశానికే ఆదర్శంగా నిలుస్తు న్నాయి. నిరుపేద, వెనుక బడిన వర్గాల పిల్లలకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన ఉచిత వసతి, నాణ్యమైన ఆంగ్ల మాధ్యమ విద్యను ఇక్కడ అందిస్తున్నారు. ఈ గురుకులాల ఫలితాలు విద్యా ప్రపంచాన్ని విస్మయానికి గురిచేస్తున్నాయి. ఇక్కడి విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన జేఈఈ (JEE) మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్ (NEET), క్లాట్ (CLAT) వంటి కఠినమైన పరీక్షల్లో అద్భుతమైన ర్యాంకులు సాధించి దేశంలోని అత్యున్నత ఐఐటీలు, ఎన్ఐటీలు, ప్రతిష్టాత్మక వైద్య కళాశా లల్లో ప్రవేశాలు పొందుతున్నారు. ఈ సామాజిక విద్యా విప్లవం ద్వారా పేదరికం చదువుకు అడ్డుకాదని నిరూపిత మైంది. నూతన విద్యా సంవత్సరంలో ఈ విజయాల పరంపరను మరింత ఉన్నత స్థానాలకు తీసుకెళ్లేందుకు విద్యా సంస్థలు కంకణం కట్టుకున్నాయి.

ప్రస్తుత 21వ శతాబ్దపు అవసరాలకు అనుగుణంగా విద్యారం గం సాంకేతికతతో వేగంగా మమేకమవుతోంది. డిజిటల్ విద్యా విస్తరణలో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్ రూమ్‌లు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (IFP), కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటు వేగవంతమైంది. ఆన్‌లైన్ విద్యా వనరులు, వర్చువల్ లాబొరేటరీలు విద్యార్థులకు క్లిష్టమైన సైన్స్, మ్యాథ్స్ భావనలను సులభంగా అర్థం చేసుకోవడానికి దోహదపడుతున్నాయి. అయితే సాంకేతికత అనేది కేవలం బోధనా సామర్థ్యాన్ని పెంచే ఒక అదనపు సాధనం మాత్రమే కానీ, అది ఏనాటికీ సజీవమైన ఉపాధ్యాయుని స్థానాన్ని భర్తీ చేయలేదు. ఉపాధ్యాయుని ఆత్మీయ స్పర్శ, వ్యక్తిగత పర్యవేక్షణ మాత్రమే విద్యార్థు లను సరైన మార్గంలో నడిపించ గలవు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్విని యోగం చేసుకుంటూనే విద్యార్థులలో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచనా ధోరణి (Critical Thinking), సమస్య పరిష్కార నైపుణ్యా లను (Problem Solving Skills) పెంపొందించడం నేటి కాలపు ప్రధాన ఆవశ్యకత.

అయితే, విద్యా వ్యవస్థ ప్రగతి పథంలో సాగుతున్నప్పటికీ కొన్ని సవాళ్లు ఇంకా వేధిస్తూనే ఉన్నాయి. గ్రామీణ మరియు ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యార్థుల క్రమబద్ధమైన హాజరు లేకపోవడం, ప్రాథమిక స్థాయిలోనే చదువు మానేయడం (డ్రాపౌట్స్), అభ్యాసన సామర్థ్యాలలో లోపాలు, ఉపాధ్యాయుల కొరత, మౌలిక సదుపాయాలు లేమి వంటి సమస్యలపై గట్టిగా దృష్టి సారించాల్సి ఉంది. కుటుంబాల ఆర్థిక ఇబ్బందులు, కాలానుగుణ వలసలు, బాల్య వివాహాలు వంటి సామాజిక రుగ్మతలు ఇప్పటికీ కొంతమంది పిల్లలను బడికి దూరం చేస్తున్నాయి. ఈ సవాళ్లను అధిగమించడానికి పాఠశాలలు ప్రారంభమైన వెంటనే ప్రతి గ్రామంలో 'బడిబాట' వంటి అవగాహన కార్యక్రమాలను విస్తృతం గా నిర్వహించాలి. చట్టప్రకారం విద్య అనేది ప్రతి బాలబాలిక ప్రాథమిక హక్కు. కాబట్టి సమాజంలోని ప్రతి పౌరుడు, స్థానిక సంస్థలు బాధ్యత వహించి బడి వయసు పిల్లలందరినీ బడిలో చేర్పించేలా చూడాలి. దేశవ్యాప్తంగా అమలు లోకి వస్తున్న నూతన విద్యా విధానం-2020 (చీజూ) ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ విద్యాశాఖ కూడా తన పాఠ్యప్రణాళికలను క్రమంగా మార్చుకుంటోంది. కేవలం మార్కులు, ర్యాంకుల కోసం చదివే బట్టీ పద్ధతికి స్వస్తి పలికి, 'అనుభవాధారిత అభ్యాసానికి' (Experien-tial Learning) ప్రాధాన్యత ఇస్తున్నారు. మాతృ భాషలో ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తూనే, ప్రపంచ స్థాయి అవకాశాల కోసం ఆంగ్ల భాషా నైపుణ్యాలనుపెంచుతున్నారు. దీని తో పాటు ఉన్నత పాఠశాల స్థాయి నుంచే వృత్తి విద్యా నైపుణ్యాలను (Voca-tional Skills) పరిచయం చేయడం ద్వారా విద్యార్థులు చదువు పూర్తి కాగానే స్వయం ఉపాధి పొందేలా లేదా ఉద్యోగ సామర్థ్యాలను సాధించేలా ప్రణాళికలు రూపొందు తున్నాయి. ఈ మార్పులన్నింటిని క్షేత్రస్థాయిలో విజయవంతం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యా యులు కూడా నిరంతర శిక్షణ ద్వారా తమ నైపుణ్యాలను నవీకరించు కోవాల్సి ఉంటుంది.

విద్యా ప్రయాణంలో పాఠశాల,ఉపాధ్యాయులతో పాటు తల్లి దండ్రుల పాత్ర సమానంగా ఉంటుంది. పిల్లలపై మార్కుల కోసం మితిమీరిన ఒత్తిడిని తీసుకరావడం వల్ల వారి సహజ సిద్ధమైన ప్రతిభ నలిగిపోతుంది. అకడమిక్ విజయాలతో పాటు వారి మానసిక ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం కూడా అంతే ముఖ్యమని తల్లిదండ్రులు గుర్తించాలి. ప్రతిరోజూ పిల్లలతో సమయం గడుపుతూ పాఠశాలలో ఏం నేర్చుకున్నారో అడిగి తెలుసుకోవడం, ఉపా ధ్యాయులతో క్రమం తప్పకుండా సంప్రదింపులు జరపడం ద్వారా వారి ప్రగతిని పర్యవేక్షిం చవచ్చు. డిజిటల్ పరికరాల వాడకంలో పిల్లలు పక్కదారి పట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం కూడా నేటి తల్లిదండ్రుల ప్రధాన బాధ్యత.

పాఠశాలలు కేవలం అక్షరాలు నేర్పే కర్మాగారాలు కావు, అవి నైతిక విలువల ఉద్యానవనాలు. ఇక్కడే విద్యార్థులు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, తోటివారి పట్ల సహానుభూతి, సామాజిక బాధ్యత, దేశభక్తి వంటి అమూల్యమైన విలువలను అంతర్గతం చేసుకుంటారు. కేవలం క్లాస్ రూమ్ బోధనకే పరిమితం కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్ ప్రదర్శనలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు వంటి పాఠ్యేతర అంశాలలో పిల్లలను భాగస్వాములను చేయడం ద్వారా వారిలో సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుంది. శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో తోడ్పడతాయి.

ముగింపుగా, 2026 జూన్ 15న తెలంగాణ వ్యాప్తంగా మోగిన పాఠశాలల గంట కేవలం ఒక దినచర్య ప్రారంభానికి సంకేతం కాదు; అది బంగారు తెలంగాణ పునర్నిర్మాణానికి, ఒక సరికొత్త మేధో తరం ఆవిర్భావానికి దిక్సూచి. ప్రతి విద్యార్థి కల సాకారం కావాలన్నా, ప్రతి పాఠశాల ఒక విజయగాథగా మారాలన్నా విద్యా వ్యవస్థకు మూల స్తంభాలైన-ప్రభుత్వం, ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు, విద్యార్థులు మరియు సమాజం అంతా ఒకే తాటిపైకి వచ్చి సమన్వయంతో పనిచేయాలి. సమష్టి కృషితోనే ప్రభుత్వ ఆశయాలు నెరవేరి, మన విద్యా ప్రమాణాలు అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటాయి. ఈ నూతన విద్యా సంవత్సరం తెలంగాణలోని ప్రతి బిడ్డకు జ్ఞాన కాంతులను పంచాలని, ప్రతి ఉపాధ్యాయునికి వృత్తిపరమైన సంతృప్తిని ఇవ్వాలని, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిద్దాం.

వ్యాసకర్త : సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.

# ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందం

## - ట్రూత్ సోషల్ మీడియాలో ప్రకటించిన ట్రంప్ - ఒప్పందాన్ని స్వాగతించిన ప్రపంచ దేశాలు



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

వాషింగ్టన్, జూన్ 15 : పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెర పడింది. అమెరికా-ఇరాన్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందం కుదిరింది. ఈ వారం చివర్లో దీనిపై సంతకాలు జరగనున్నాయి. మూడు నెలలకు పైగా సాగిన యుద్ధం ముగిసిపోవడంతో భారత్ సహా ప్రపంచదేశాలు హర్షం వ్యక్తంచేశాయి. ఈ ఒప్పందాన్ని స్వాగతిస్తూ.. పశ్చిమాసియాలో సుస్థిర శాంతి నెలకొనాలని ఆకాంక్షించాయి. నెలల తరబడి ఉత్కంఠ రేపిన పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెరదించుతూ అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కుదిరిన చరిత్రాత్మక శాంతి ఒప్పందాన్ని ప్రపంచ దేశాలు ఏకగ్రీవంగా స్వాగతించాయి.

ప్రాంతీయ స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి, వ్యూహాత్మక హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి, అంతర్జాతీయ ఆర్థిక రంగానికి ఊరటనిచ్చేందుకు ఈ ఒప్పందం ఒక అద్భుతమైన దౌత్యపరమైన మలుపు అని ప్రపంచ దేశాల నేతలు అభివర్ణించారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ఈ చారిత్రాత్మక ఒప్పందానికి పాకిస్థాన్ ప్రధానంగా మధ్యవర్తిత్వం వహించగా.. ఖతార్, టర్కీ, యునైటెడ్ కింగ్‌డమ్, జర్మనీ, ఫ్రాన్స్ దేశాలు దీనిపై హర్షం వ్యక్తం చేశాయి. ఈ ఒప్పందం పూర్తయినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' వేదికగా అధికారికంగా ప్రకటించారు. 'ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. అందరికీ అభినందనలు! ప్రపంచ నౌకలారా, మీ ఇంజన్లు స్టార్ట్ చేయండి. ఆయిల్ ప్రవహించనివ్వండి!' అని ట్రంప్ ఉత్సాహంగా ట్వీట్ చేశారు. అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. ఈ డీల్‌తో హర్మూజ్ జలసంధిలో ఇకపై నౌకల రవాణా నిరాటంకంగా, స్వేచ్ఛగా జరుగుతుందని ఆశిస్తున్నాం. శాంతి, ప్రాంతీయ స్థిరత్వం కోసం చేపట్టే అన్ని చర్యలకు భారత్ ఎల్లప్పుడూ మద్దతిస్తుంది. ఈ పరిణామాలను స్ఫూర్తిగా తీసుకుని ఉక్రెయిన్-రష్యా కూడా శాంతి ప్రయత్నాలు చేయాలని ఆకాంక్షిస్తున్నాం అని మంత్రిత్వ శాఖల అంతర్గత సమావేశంలో భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ వెల్లడించారు. అమెరికా-ఇరాన్ మధ్య దౌత్యపరంగా చారిత్రక డీల్ జరగడం అభినందనీయం. ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థికవ్యవస్థ పునరుజ్జీవనానికి మార్గం సుగమం చేశాయి. పశ్చిమాసియా మరింత సురక్షితంగా ఉంటుంది. ఈ ఒప్పందాన్ని కృతనిశ్చయంతో అమలుచేయడం అత్యావశ్యకం అని జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ అభిప్రాయపడ్డారు. ఇరాన్-అమెరికా డీల్ శుభపరిణామం. ఈ ఒప్పందాన్ని వీలైనంత వేగంగా అమల్లోకి తీసుకురావాలి. హర్మూజ్ జలసంధిని త్వరగా, భేషరతుగా తెరవాలి. ఎలాంటి ఆంక్షలు, టోల్స్ లేకుండా నౌకల రవాణాను పునరుద్ధరించాలి. అప్పుడే ప్రాంతీయ స్థిరత్వం సాధించగలం. ఇరాన్ అణు, బాలిస్టిక్ క్షిపణులకు సంబంధించిన ఆందోళనలను కూడా ఈ డీల్ పరిష్కరించాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ అన్నారు.

ఇరాన్-అమెరికా ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌తో పాటు డీల్ కోసం మధ్యవర్తిత్వం చేసిన దేశాలకు అభినందనలు. ఇప్పుడు అందరి దృష్టి ఈ ఒప్పందం అమలుపైనే ఉంది. హర్మూజ్‌ను శాశ్వతంగా తెరవడంతో పాటు నౌకల భద్రతకు సంబంధించిన సాంకేతిక అంశాల్లో మద్దతిచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. సుస్థిరశాంతికే మా ప్రథమ ప్రాధాన్యం. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండొద్దన్న మా వైఖరి ఇప్పటికీ స్థిరంగా ఉందని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తెలిపారు. ఈ ఒప్పందాన్ని యావత్ ప్రపంచం కోరుకుంది. ఈ పరిణామాలు పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వానికి మార్గం సుగమం చేస్తాయని ఆశిస్తున్నా. మరికొన్ని రోజుల్లో ఈ ఒప్పందంపై సంతకాలు జరగనున్న వేళ.. ప్రస్తుతానికి ఇరుపక్షాలు రెచ్చగొట్టే చర్యలకు దూరంగా ఉండాలని కోరుతున్నా. దీనికి మధ్యవర్తిత్వం వహించిన దేశాలకు అభినందనలు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా దౌత్య పరిష్కారాలకు మేం నిరంతరం మద్దతు ఇస్తాం తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ అభిప్రాయపడ్డారు.

# క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యం: డీసీసీ చీఫ్ శివసేన రెడ్డి

## - త్వరలో బీసీ, ఎస్టీ, మైనార్టీ, మహిళా అధ్యక్షుల నియామకం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, జూన్ 15: కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యమని వనపర్తి డీసీసీ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి పేర్కొన్నారు. త్వరలో బీసీ, ఎస్టీ, మైనార్టీ, మహిళా, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుల నియామకాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. సోమవారం వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా, పట్టణ, మండల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో బీఎల్ఏ-2 సభ్యులు కీలకంగా వ్యవహరించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సరైన విధంగా పని చేయాలని, అలసత్వం వహిస్తే పార్టీతో పాటు పరిపాలనా వ్యవస్థకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కార్యకర్తను కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ఎవరికైనా ఇబ్బందులు వచ్చినా వారిని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ పరంపర కొనసాగుతుందనే ధీమాను వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీల ద్వంద్వ వైఖరిని ప్రజల్లో ఎండగట్టాలని, కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేసే వారిని రాజకీయంగా సమర్థంగా ఎదుర్కోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం కొత్తకోట పట్టణ, మండల, మదనాపురం మండల అధ్యక్షులుగా ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మాచారి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఐ. సత్యరెడ్డి, కోళ్ల వెంకటేష్, శరవంద్, మన్యం, బి. కృష్ణ, కదిరె రాములు, సహదేవ్, దయాకర్ రెడ్డి, రామ్ రెడ్డి, సుఖేందర్ రెడ్డి, విష్ణు ముదిరాజ్, రవికిరణ్, బోయెజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణలో బీఎల్ఏల పాత్ర కీలకం

## భువనగిరిలో కాంగ్రెస్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, జూన్ 15 : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని వివేరా హోటల్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆధ్వర్యంలో భువనగిరి నియోజకవర్గ బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కోసం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు నమోదు కావడం, అనర్హుల పేర్ల తొలగింపు, వ్యక్తిగత వివరాల సవరణ వంటి అంశాలపై బీఎల్ఏలకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటర్ల జాబితా మూలస్తంభమని పేర్కొన్నారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, పేర్లు లేదా ఇతర వివరాల్లో ఉన్న తప్పులను సరిచేసే ప్రక్రియలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని, పార్టీ శ్రేణులు బీఎల్ఏలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు హక్కు వినియోగంపై ప్రతి కుటుంబానికి సమాచారం చేరేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, బీఎల్ఏలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శిక్షణ అనంతరం ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేసి, క్షేత్రస్థాయి కార్యాచరణపై నాయకులు మార్గనిర్దేశం చేశారు.

# వన మహోత్సవం విజయవంతం చేయాలి

## కలెక్టర్ స్నేహ శబరీష్




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, జూన్ 15 : జిల్లాలో వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంతో పాటు, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ లిస్నేహ శబరీష్‌లి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అటవీ అధికారి విశాల్ బత్తుల, అదనపు కలెక్టర్లు కె. అనిల్ కుమార్, పురుషోత్తం తదితర అధికారులతో కలిసి వన మహోత్సవం, వర్షాకాల యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 18 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమయ్యే వన మహోత్సవంలో జిల్లాలో లి43.5 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్నిలి పూర్తి చేయాలని సూచించారు. నర్సరీల్లో తగిన మొక్కలను సిద్ధం చేయడంతో పాటు, నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. అలాగే అటవీ, మున్సిపల్, గ్రామీణ ప్రాంతాల్లో మంకీ ఫుడ్ ప్లాంటేషన్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, గతంలో ప్రభావిత ప్రాంతాలను గుర్తించి వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో స్వచ్ఛమైన తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు హెల్ప్‌లైన్ నంబర్ 9441471624 ను సంప్రదించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





# రూ.2.70 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

## - ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యత - ప్రజలకు మెరుగైన మౌలిక వసతులే లక్ష్యం - ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్ రావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, జూన్ 15 : మెదక్ పట్టణ అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది.మెదక్ ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్ రావు ఆధ్వర్యంలో సోమవారం మెదక్ పట్టణంలోని పలు వార్డుల్లో మొత్తం రూ.2 కోట్ల 70 లక్షల 50 వేల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారులు,సీసీ డ్రైయిన్లు,స్లాబులు,తాగునీటి సదుపాయాల కల్పన వంటి కీలక పనులకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు.ప్రతి కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు,అధికారులు, యువత,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ, "మెదక్ పట్టణాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నాను.అభివృద్ధి ఫలాలు ప్రతి వార్డుకు, ప్రతి కుటుంబానికి చేరేలా నిరంతరం పనిచేస్తున్నాను" అని తెలిపారు. ప్రతి వార్డులో అభివృద్ధి జోరు సీసీ రోడ్లు, డ్రైయిన్లు, స్లాబులతో మౌలిక వసతుల బలోపేతంమొదటగా 10వ వార్డులో ఎండి అత్తర్ షరీఫ్ నుండి జియావుద్దీన్,తిరుపతి ఇంటి వరకు అలాగే బస్తీ దవాఖానా నుండి గౌడ నాగులు,బండి నర్సింలు ఇంటి వరకు రూ.21 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,"రోడ్లు ఒక ప్రాంత అభివృద్ధికి అద్దం పడతాయి. ప్రజలు వర్షాకాలంలో ఇబ్బందులు పడకుండా నాణ్యమైన రోడ్లు నిర్మిస్తున్నాం" అని పేర్కొన్నారు. అనంతరం 27వ వార్డులో రూ.35 లక్షల వ్యయంతో వివిధ ప్రాంతాల్లో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "పట్టణంలోని ఏ వార్డూ అభివృద్ధికి దూరంగా ఉండకూడదు. ప్రతి కాలనీకి సమాన ప్రాధాన్యత ఇస్తున్నాం" అన్నారు. 11వ వార్డులోని సాయినగర్ కాలనీ, వెంకట్రావు నగర్ కాలనీ, రషీద్ కాలనీలలో రూ.52 లక్షల వ్యయంతో సీసీ డ్రైయిన్లు,స్లాబులు,సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు."వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం కోసం ఆధునిక డ్రైయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం.ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని ప్రణాళికలు రూపొందిస్తున్నాం" అన్నారు.

**వార్డు 13లో రూ.1.06 కోట్ల భారీ పనులు**

**మెదక్ అభివృద్ధి చరిత్రలో మరో మైలురాయి**

పట్టణంలోని 13వ వార్డు, నల్లపోచమ్మ కాలనీ, మీరా కాలనీలలో రూ.1 కోటి 6 లక్షల వ్యయంతో సీసీ డ్రైయిన్లు, స్లాబులు,సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డా. మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ, "ఎన్నో సంవత్సరాలుగా మౌలిక వసతుల కోసం ఎదురుచూస్తున్న ప్రాంతాలకు ఇప్పుడు అభివృద్ధి చేరుతోంది. ప్రజల అవసరాలే మా ప్రభుత్వ ప్రాధాన్యత,ఈ పనులు పూర్తయిన తర్వాత ఈప్రాంతాల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయి" అని అన్నారు. అదేవిధంగా 14వ వార్డులో శ్రీ గట్టమ్మ గుడి పరిసర ప్రాంతాల్లో రూ.9 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. 24వ వార్డులో రూ.30 లక్షల వ్యయంతో సీసీ డ్రైయిన్లు, స్లాబులు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. 15వ వార్డులో ఖైరత్ అలీ ఇంటి నుండి ఖైసర్ పాషా ఇంటి వరకు, హైదర్ ఇంటి నుండి రజక సంఘం వరకు, రహమత్ ఇంటి నుండి రామవ్వ ఇంటి వరకు వివిధ ప్రాంతాల్లో రూ.17.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు."ప్రజలు నన్ను ఎన్నుకున్నది అభివృద్ధి కోసం. అందుకే ప్రతి రూపాయి ప్రజల సంక్షేమానికి ఖర్చు చేస్తున్నాం. పట్టణంలోని ప్రతి బస్తీ, ప్రతి కాలనీ అభివృద్ధి చెందే వరకు మా కృషి ఆగదు" అని స్పష్టం చేశారు.

**తాగునీటి సమస్యకు చెక్**

**ఎంఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో 3 బోరు మోటార్ల ప్రారంభం**

పట్టణంలోని 3వ వార్డులో మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ (ఎంఎస్ఎస్ఓ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు తాగునీటి బోరు మోటార్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం మా బాధ్యత. నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.ప్రజలకు కనీస అవసరాలు అందేలా నిరంతరం కృషి చేస్తాం" అని తెలిపారు.ప్రజలతో మమేకమవుతూ ప్రతి సమస్యను స్వయంగా తెలుసుకుంటూ పరిష్కార మార్గాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మెదక్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి పట్టణం మరియు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అధికారులు,మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆర్జీ-2లో స్ట్రక్చరల్ మీటింగ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



గోదావరిఖని టౌన్, జూన్ 15 : సింగరేణి ఆర్జి-2 ఏరియాలో కార్మికుల సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన పలు డిమాండ్లతో సోమవారం ఆర్జీ-2 జీఎం కార్యాలయంలో జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య అధ్యక్షతన గుర్తింపు సంఘం ఏఐటీయూసీతో స్ట్రక్చరల్ మీటింగ్ జరిగింది. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ గంధం సాంబశివరావు ఓసీపీ-3, ఫేజ్-2, వకీల్‌పల్లి, బేస్ వర్క్‌షాప్, యైటింక్లైన్ కాలనీ, పోతన కాలనీ ప్రాంతాల కార్మికుల సమస్యలను వినతిపత్రం రూపంలో యాజమాన్యానికి సమర్పించారు.

తాగునీరు, బస్సు సౌకర్యం, ఫర్నిచర్, ఆర్వో ప్లాంట్ల మరమ్మతులు తదితర అంశాలపై యాజమాన్యం సానుకూలంగా స్పందించి, త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. ఈ సమావేశంలో యాజమాన్యం తరపున ఎం.రాముడు, కె.సుజన్ మెహెర్, కె.చంద్రశేఖర్, ఉదయ్ హరిజన్, ఎ.నెహ్రూ, ఎ.వి. రాంరెడ్డి, బి.వి.సత్యనారాయణ, బి.వి.రామచంద్ర, ఎ.వి.శ్రీనివాసరావు, ఎ.విజయ్ కుమార్, పి.బాలరాజు, జి.వి.డి. మహీపాల్, ఎన్.వేణుగోపాల్, జె.సునీత, ఎం.అశ్విని, వి.సునీల్ ప్రసాద్ పాల్గొనగా ఏఐటీయూసీ తరఫున కె.రాజరత్నం, బి.శాంసన్, ఆవుల రవికుమార్, మామిడి మహేందర్, వి.కొమురయ్య హాజరయ్యారు.

# టూ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




గోదావరిఖని టౌన్, జూన్ 15 : రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి జోన్ డీసీపీ బి.రామ్ రెడ్డి సోమవారం గోదావరిఖని డివిజన్ పరిధిలోని గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న డీసీపీకి సీఐలు ప్రసాద్‌రావు, లింగమూర్తి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. డీసీపీ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం రిసెప్షన్, స్టేషన్ రికార్డులను తనిఖీ చేసి సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు. తదుపరి స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో అధికంగా నమోదవుతున్న నేరాల స్వరూపం, రౌడీ షీటర్ల వివరాలు, అనుమానితుల ప్రస్తుత పరిస్థితులు గురించి ఆరా తీశారు. స్టేషన్‌వారీగా బ్లూ కోల్ట్స్ సిబ్బంది పనితీరు, వారి విధుల నిర్వహణ సమయాలను తెలుసుకున్నారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేస్తూ, ప్రతి స్టేషన్ అధికారి తప్పనిసరిగా రౌడీ షీటర్ల నివాసాలను సందర్శించి వారి స్థితిగతులపై ప్రత్యక్షంగా ఆరా తీయాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలు, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించి వారిని చైతన్యవంతులను చేయాలని పేర్కొన్నారు. గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాల క్రయవిక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి, మత్తు పదార్థాల నియంత్రణకు నిరంతరం కృషి చేయాలని స్టేషన్ అధికారులను ఆదేశించారు. నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ అత్యంత అవసరమని, పోలీసులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు ఆకస్మిక వాహన తనిఖీలు చేపట్టాలని సూచించారు.

# రైతులకు సాగునీరు అందించాలని వినతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ములుగు, జూన్ 15 : పొట్లాపూర్ పంప్ హౌస్ నుండి ములుగు మండలంలోని అన్ని చెరువులకు,చిన్న కుంటలకు సాగునీరు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజాద్ బాషా ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. సోమవారం జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ములుగు మండలంలోని అన్ని చెరువులకు గుంటలకు పొట్లాపూర్ పంప్ హౌస్ నుండి సాగునీరు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం బృందం వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా ఎండి అంజాద్ పాషా పాల్గొని మాట్లాడుతూ మండలంలోని రైతాంగం వర్షాధారం పైన ఆధారపడి ఎక్కువ శాతం వివిధ రకాల పంటలు పండిస్తారని అన్నారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ మాసంలో వర్షాలు పడక పోవడం వల్ల అన్ని రకాల పంటలు ఎండిపోతున్నాయన్నారు.మండలంలోని రైతాంగానికి పొట్లాపురం పంప్ హౌస్ నుండి లక్నవరం, ఎస్సారెస్పీ కాలువలోనికి పాయింట్ ఇవ్వా లని, పొట్లాపురం పంప్ హౌస్ కింద భూమి కోల్పోతున్న రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారంగా నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు బోడ రమేష్,మంకిడి కృష్ణయ్య, వట్టం సమ్మయ్య, సుధాకర్ రమేష్, హనుమ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

## - పెండింగ్ లేకుండా సత్వర చర్యలు తీసుకోవాలి

## - జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి భువనగిరి, జూన్ 15 : యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావుతో పాటు రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి ప్రజల నుంచి వచ్చిన 75 వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరిం చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు అత్యధికంగా 49 దరఖాస్తులు అందగా, ఉపాధి కల్పన, సర్వే ల్యాండ్, హౌసింగ్, జిల్లా పరిషత్ శాఖ లకు నాలుగు చొప్పున, విద్యాశాఖకు రెండు, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ శాఖలకు రెండు చొప్పున అర్జీలు వచ్చాయి. సంక్షేమ, సివిల్ సప్లైస్, అటవీ, ఎస్సీ వెల్ఫేర్ శాఖలకు ఒక్కొక్క దరఖాస్తు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జడ్పీ సీఈవో శోభారాణి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ బడి... ఉన్నత భవితకు నాంది

## - జిల్లా విద్యాశాఖ అధికారి సిద్దార్థ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు (తాడ్వాయి), జూన్ 15 :ప్రభుత్వ బడి.. ఉన్నత భవితకు నాంది అని జిల్లా విద్యాశాఖ అధికారి సిద్దార్థ రెడ్డి అన్నారు. సోమవారం తాడ్వాయి మండలంలోని కాటాపూర్ జడ్పీ హెచ్ ఎస్ పాఠశాల పునః ప్రారంభ సందర్భంగా జిల్లా విద్య శాఖ అధికారి పాఠశాలను సందర్శించారు.ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయుడు సుధాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు చక్కగా పనిచేస్తున్నాయని అంకితభావం కలిగిన ఉపాధ్యాయుల కృషి బాగుందని అందుకు జడ్పీహెచ్ఎస్ కాటాపూర్ పాఠశాలలో నుండి ముగ్గురు ట్రిబుల్ ఐటీ బాసరలో సీటు సాధించడం,100 శాతం ఫలితాలు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.సైన్స్ ప్రయోగాత్మకంగా బోధించాలని నిజజీవితంలోఅనవయించుకునేలా బోధించాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దిడ్డి మోహన్ రావు మాట్లాడుతూ మా గ్రామానికి డీఈఓ రావడం చాలా సంతోషమని పాఠశాల అభివృద్ధికి గ్రామం నుండి సర్పంచిగా తన వంతు సహకారం అందిస్తానని, ప్రభుత్వం తరపు నుండి డీఈఓ పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో శ్యాంసుందర్ రెడ్డి,ఎంఈఓ గడ్డి శ్రీనివాస్,ఉపసర్పంచ్ వెంకట నరసయ్య,ఉపాధ్యాయులు సక్రు,రాజేష్,శాంసన్,విజయ గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల్లో పిల్లలను నమోదు చేయండి

## - వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయండి- మున్సిపల్ చైర్‌పర్సన్ సునీత వెంకన్న

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, జూన్ 15 : కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని రేకుల తండాలో సోమవారం నిర్వహించిన "అమ్మ మాట -- అంగన్‌వాడి బాట" కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పిల్లల పోషణ, విద్య, ఆరోగ్య పరిరక్షణలో అంగన్‌వాడి కేంద్రాల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడి కేంద్రాల్లోనే చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.అంగన్‌వాడి కేంద్రాలు పిల్లల సమగ్ర అభివృద్ధికి, వారి భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తాయని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి సిబ్బంది, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ఇంటర్ రాష్ట్ర టాపర్‌ను అభినందించిన కలెక్టర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, జూన్ 15 : ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిన రామడుగు మోడల్ స్కూల్ విద్యార్థిని కడారి రశ్మితను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సోమవారం కలెక్టరేట్‌లో అభినందించి సత్కరించారు. రశ్మిత 470 మార్కులకు గాను 469 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో తొలి ర్యాంకు సాధించడం గొప్ప విజయమన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతోనే ఇలాంటి విజయాలు సాధ్యమవు తాయని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి జిల్లా ఖ్యాతిని పెంచాలని సూచించారు. విద్యార్థిని విజయానికి కృషి చేసిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానా జీ వాకడే, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి, కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, రామడుగు సర్పంచ్ మొయిజ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్, ఉపాధ్యాయులు రమేష్, శ్రీనివాస్, శిరీష తదితరులు పాల్గొన్నారు.



# అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి

## అదనపు కలెక్టర్ కొప్పుల వెంకటరెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, జూన్ 15 : ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కొప్పుల వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరితో కలిసి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందిన వీరగోని రాజేశం తన వ్యవసాయ భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డుల్లోని తప్పులను సరిచేసి పునఃసర్వే నిర్వహించాలని కోరగా, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులను ఆదేశించారు. ఓదెల గ్రామ సర్పంచి కనకిరెడ్డి సతీష్ ప్రీ-ప్రైమరీ స్కూల్ కేంద్రాన్ని హైస్కూల్ ప్రాంగణానికి మార్చాలని వినతిపత్రం సమర్పించగా, జిల్లా విద్యాశాఖ అధికారికి పంపించారు. గోదావరిఖని కళ్యాణ్ నగర్‌కు చెందిన కొత్తపల్లి సమ్మక్క ఇంటి సరిహద్దుల ఆక్రమణపై ఫిర్యాదు చేయగా, రామగుండం మున్సిపల్ కమీషనర్‌కు చర్యల కోసం సూచించారు. పెద్దపల్లి ప్రగతి నగర్‌కు చెందిన కొండా రమాదేవి గృహజ్యోతి పథకం లబ్ధి కల్పించాలని కోరగా, సంబంధిత ఎంపీడీఓకు పంపించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ఆర్జీ-1 గనులలో ఎలక్ట్రికల్ భద్రతా తనిఖీలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, జూన్ 15 : కార్పొరేట్ సేఫ్టీ జీఎం సర్క్యులర్ మేరకు, ఆర్‌జీ-1 జీఎం సూచనలతో సింగరేణి జీడీకే-1, 3 ఇంక్లైన్ గనులలో సోమవారం ఎలక్ట్రికల్ వ్యవస్థలపై సమగ్ర భద్రతా తనిఖీలు నిర్వహించారు. ఆర్‌జీ-2 ఏరియా అసిస్టెంట్ సేఫ్టీ ఆఫీసర్ బివి. సత్యనారాయణ, వికెపి గ్రూప్ ఇంజనీర్ కె.గోపాల కృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. చెక్‌లిస్ట్ ప్రకారం గని సర్ఫేస్ ఎలక్ట్రికల్ పరికరాలు, వాటి పనితీరు, భద్రతా ప్రమాణాల అమలు, నిర్వహణ రికార్డులను పరిశీలించి, అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన విధానాలపై సూచనలు చేశారు. గనుల్లో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యుత్ పరికరాల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని అధికారులు పేర్కొన్నారు. గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దుతూ భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీడీకే-1 ఇంక్లైన్ మేనేజర్ సుధీర్ జక్కుల్వార్, గ్రూప్ ఇంజనీర్ అల్లం ఓదెలు, సేఫ్టీ ఆఫీసర్ మహేష్, పిట్ ఇంజనీర్ శేఖర్, అసిస్టెంట్ ఇంజనీర్ క్రాంతి, వర్క్‌మన్ ఇన్‌స్పెక్టర్ (ఎలక్ట్రికల్) సంపత్ పాల్గొన్నారు.

# ఫీజుల దోపిడీ అరికట్టాలి

**- అక్రమంగా పాఠ్యపుస్తకాల విక్రయాలపై చర్యలు తీసుకోవాలి**

**- డీఈఓకు ఏఐఎస్ఎఫ్ వినతి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి భువనగిరి, జూన్ 15 : ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లను అరికట్టి ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) భిక్షపతికి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా పాఠశాల ఆవరణలోనే పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నాయని ఆరోపించారు. మార్కెట్ ధరల కంటే అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తూ తల్లిదండ్రులపై అదనపు భారం మోపుతున్నారని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తు పేరుతో ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంల రూపంలో దోపిడీ కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని, విద్యార్థుల కోసం మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సాయికుమార్, గోగు వరలక్ష్మి, చిప్పలపల్లి వంశీకుమార్ తదితరులు ఉన్నారు.

# ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం

## జిల్లా ఉద్యాన శాఖ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, జూన్ 15 : కురవి మండలం మోద్గులగూడెం గ్రామంలో 10 ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటి ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ మేళా ను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన,పట్టు పరిశ్రమ శాఖ అధికారి లిజినుగు మరియన్నలిమాట్లాడుతూ, సంప్రదాయ నూనెగింజల పంటలతో పోలిస్తే ఆయిల్ పామ్ ద్వారా అధిక దిగుబడి, మెరుగైన ఆదాయం పొందవచ్చని తెలిపారు. మార్కెట్, రవాణా, ప్రాసెసింగ్ సౌకర్యాలు ఉండటంతో పాటు ప్రభుత్వం మొక్కలు, బిందు సేద్యం, అంతర పంటల సాగు, యాజమాన్య వ్యయాలపై రాయితీలు అందిస్తోందన్నారు. రైతులు వరి, పత్తి, మిరప వంటి పంటలతో పాటు ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించి అధిక ఆదాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతమల్ల ప్రవీణ్, ఆయిల్ ఫెడ్ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



**నర్సరీల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరి : జినుగు మరియన్న**

డోర్నకల్, కురవి మండలాల్లోని నర్సరీలను జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి లిజినుగు మరియన్నలి సందర్శించి నర్సరీదారులకు నర్సరీ చట్టం, నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. నర్సరీలు లైసెన్స్‌తోనే నిర్వహించాలని, ప్రభుత్వం ఆమోదించిన రకాల నారును మాత్రమే విక్రయించాలని సూచించారు. ఓపెన్ ఫీల్డ్స్‌లో నారు పెంచకూడదని, లైసెన్స్ లేకుండా నారు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే రైతులు పంట మార్పిడి చేపట్టి ఆయిల్ పామ్‌తో పాటు ఉద్యాన, కూరగాయల పంటలను సాగు చేయాలని సూచించారు. పొలం గట్లు, పెరట్లో, పండ్ల తోటల్లో అంతర పంటలుగా కూరగాయల సాగు చేపట్టి ఆధునిక సాగు పద్ధతులు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు, నర్సరీదారులు పాల్గొన్నారు.

# బోనంతో బడిబాట పెద్దకందుకూరు లో వినూత్న ప్రచారం

**- భీమగాని తేజస్విని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటింటికి అవగాహన - మండల మూడో ర్యాంకర్ శశాంక్‌కు రూ.5 వేల ప్రోత్సాహకం- బడుల బలోపేతానికి మాజీ సర్పంచ్ ల ప్రత్యేక చొరువ**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, జూన్ 15 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచేందుకు యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు గ్రామంలో వినూత్నంగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమగాని తేజస్విని ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ మాజీ సర్పంచ్ భీమగాని మాధవి, భీమగాని రాములు గౌడ్ బోనం ఎత్తుకొని గ్రామంలోని వార్డు వార్డులో, ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా భీమగాని రాములు గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు ఉచిత దుస్తులు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని చెప్పారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయుల బోధనతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో భారీ ఫీజులు చెల్లించే బదులు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పిస్తే తల్లిదండ్రులకు లక్షల రూపాయల భారం తగ్గుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చేరే విద్యార్థులకు రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేస్తామని ప్రకటించారు.

**శశాంక్‌కు సన్మానం**

ఇటీవల పదో తరగతి పరీక్షల్లో మండల స్థాయిలో మూడో ర్యాంకు సాధించిన బూడిద శశాంక్ గౌడ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి, భీమగాని తేజస్విని ఫౌండేషన్ తరఫున రూ.5 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. గతంలో ఎన్నారై దాతల సహకారంతో పాటు తన సొంత నిధులతో ప్రభుత్వ పాఠశాలకు పక్కా భవనాన్ని నిర్మించిన విషయాన్ని భీమగాని రాములు గౌడ్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు. బోనం ద్వారా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించడం జిల్లాకు ఆదర్శంగా నిలుస్తుందని గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

## కలెక్టర్ ఆదర్శ్ సురభి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, జూన్ 15 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజావాణి కార్యక్రమంలో ఆయన అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి సూర్య ప్రకాష్, జెడ్పీ సీఈవో యాదయ్యలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు, వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించి సంబంధిత ఫిర్యాదుదారులకు సమాచారం అందించడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. తమ శాఖ పరిధిలో లేని అంశాలను సంబంధిత శాఖలకు వెంటనే పంపించాలని, పరిష్కారం సాధ్యం కాని అంశాలపై ఫిర్యాదుదారులకు స్పష్టమైన సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రత్యేకంగా పరిశీలించి వెంటనే పరిష్కరించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి, జిల్లా మంత్రి ప్రజావాణి ద్వారా వచ్చిన పెండింగ్ అర్జీలను కూడా సత్వరమే పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 77 దరఖాస్తులు అందగా, ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 5 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యం

## జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, జూన్ 15 : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 82 దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించడానికి ఆయా శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యలు పరుష్కారం కోరుతూ ప్రజలు అందచేసిన దరఖాస్తులు జాప్యం చేయకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును అధికారులు వ్యక్తి గతంగా పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. వచ్చే సోమవారం వరకు వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కరించాలని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందిన ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తు దరఖాస్తుదారునికి రశీదు అందజేయాలని, తద్వారా సమస్యల పరిష్కారం పట్ల పారదర్శకత నెలకొల్పాలని ఆదేశించారు. అదేవిధంగా, దరఖాస్తులు అన్ని శాఖల అధికారులు తీసుకున్న చర్యల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతగా తీసుకుని, నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పరిష్కారంలో ఆలస్యం జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ ఆయా శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్ఏక్యూ నిబంధనల ప్రకారం వేగంగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

**- అదనపు కలెక్టర్ వినోద్ కుమార్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, జూన్ 15 : వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తిగా ఎఫ్.ఏ.క్యూ (ఖీుఱతీ-ాఙవతీుస్త్రవ-ుఋఖుశ్రీఱ్‌ఎ) నిబంధనలకు అనుగుణంగా, వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం పానగల్ మండలంలోని జమ్మాపూర్, శాఖాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, అక్కడ జరుగుతున్న ధాన్యం సేకరణ, తూకాలు, లోడింగ్, రవాణా ప్రక్రియలను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోళ్లు పూర్తిగా నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా జరగాలని, రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని పరిశీలించి సకాలంలో కొనుగోలు చేయాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు కేంద్రాల్లో హమాలీల సంఖ్యను పెంచాలని, లోడింగ్, అన్‌లోడింగ్ పనుల్లో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం రవాణాకు సంబంధించిన ట్రక్ షీట్ల అప్‌డేషన్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, రవాణాలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చూడాలని పేర్కొన్నారు. తూకాలు, లోడింగ్ ప్రక్రియకు అనుగుణంగా సరిపడా రవాణా వాహనాలను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అలసత్వాన్ని సహించబోమని స్పష్టం చేసిన అదనపు కలెక్టర్, అధికారులు మరియు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సమన్వయంతో పనిచేసి కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులు తమ ధాన్యాన్ని విక్రయించేందుకు కేంద్రాలకు వచ్చినప్పుడు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

# ప్రజావాణిలో ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి

## జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, జూన్ 15 : మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు ప్రజల నుండి వచ్చిన వినతులు, ఫిర్యాదులను స్వీకరించి వాటిపై సమగ్రంగా విచారణ జరిపారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక,భూవివాదాలు, మోసాలు,వేధింపులు మరియు ఇతర సమస్యలకు సంబంధించిన అర్జీలను సమర్పించారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ, బాధితులకు న్యాయం జరిగే విధంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా వ్యవహరించాలని,ప్రతి వినతిదారునికి ఫిర్యాదు పురోగతిపై సమాచారం అందించాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడం ద్వారా పోలీసు వ్యవస్థపై విశ్వాసం మరింత పెంపొందించాలన్నారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడం,బాధితులకు త్వరితగతిన న్యాయం చేయడం మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి పారదర్శకమైన వ్యవస్థను అమలు చేయడం మెదక్ జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా వెంకట్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పెద్దపల్లి, జూన్ 15 : పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా కొప్పుల వెంకట్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ఆర్డీఓగా పనిచేస్తున్న ఆయనకు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పదోన్నతి లభించడంతో పెద్దపల్లి జిల్లాకు బదిలీ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్న కొప్పుల వెంకట్ రెడ్డి విధుల్లో చేరి జిల్లా అధికారులను కలుసుకున్నారు. పలువురు అధికారులు ఆయనకు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

# ప్రజలకు మెరుగైన రవాణా సేవలే లక్ష్యం

**- వనపర్తి జిల్లా రవాణా అధికారిగా**

**- సురేష్ కుమార్ భాధ్యతల స్వీకరణ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి, జూన్ 15 : వనపర్తి జిల్లా రవాణా అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సురేష్ కుమార్ ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన రవాణా సేవలను అందించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలానికి చెందిన ఆయన 2012లో నిజామాబాద్ జిల్లా రవాణా శాఖలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. వివిధ జిల్లాల్లో విధులు నిర్వహిస్తూ శాఖాపరమైన అనుభవాన్ని, పరిపాలనా నైపుణ్యాన్ని సంపాదించారు. జిల్లా రవాణా అధికారిగా డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ, పునరుద్ధరణ, వాహనాల రిజిస్ట్రేషన్, యాజమాన్య మార్పిడి, వాణిజ్య వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ, పర్మిట్ల మంజూరు, రోడ్ టాక్స్ వసూళ్ల తదితర కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ట్రాఫిక్ నిబంధనల అమలు, అధిక లోడుతో నడిచే వాహనాలపై తనిఖీలు, మోటారు వాహన చట్టం ఉల్లంఘనలపై చర్యలు, రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రజలకు రవాణా శాఖ సేవలను సులభతరం చేయడంతో పాటు కార్యాలయంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటామని సురేష్ కుమార్ తెలిపారు. జిల్లా ప్రజలు రవాణా నిబంధనలను పాటిస్తూ సురక్షిత ప్రయాణానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# శ్రీనివాస థియేటర్ సెంటర్‌లో నిల్వ నీటి తొలగింపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, జూన్ 15 : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 33వ వార్డులో ఉన్న శ్రీనివాస థియేటర్ సెంటర్ వద్ద వర్షాల కారణంగా నిలిచిపోయిన వర్షపు నీరు, మురుగు నీటిని మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. ఈ పారిశుద్ధ్య కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ ఎం.వినోద్ కుమార్, 33వ వార్డు కౌన్సిలర్, సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్ సారధి రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈ ఉపేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ సిబ్బంది, గాదం శ్యాంప్రసాద్ యాదవ్, ఇష్తికార్, సాయి మెహమూద్ తదితర స్థానికులు పాల్గొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య చర్యలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

# అంబేద్కర్‌కు వినతి.. దేవస్థాన అధికారులకు హెచ్చరిక!

**యాదగిరిగుట్ట కొండపై దుకాణాలకు టెండర్లు వేయాలంటూ వ్యాపారి వినూత్న నిరసన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




యాదాద్రి భువనగిరి, జూన్ 15 : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కొండపై ఉన్న తాత్కాలిక దుకాణాలకు టెండర్లు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ స్థానిక వ్యాపారి అన్నల్దాస్ వెంకటేష్ వినూత్న నిరసనకు దిగారు. హైదరాబాద్‌లోని సచివాలయం సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. దేశానికి రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో తనకు న్యాయం చేయాలని కోరుతున్నట్లు వెంకటేష్ తెలిపారు. కొండపై ఉన్న తాత్కాలిక దుకాణాల కేటాయింపులో పారదర్శకత పాటించి టెండర్ల ద్వారా అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఇప్పటికే దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్, ఎండోమెంట్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ, సంబంధిత మంత్రులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. సాధారణ పౌరులు న్యాయం కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా దేవస్థాన ఉన్నతాధికారులు స్పందించి కొండపై ఉన్న తాత్కాలిక దుకాణాలకు టెండర్ల నోటిఫికేషన్ విడుదల చేసి స్థానిక వ్యాపారులకు న్యాయం చేయాలని వెంకటేష్ కోరారు.

# ఉప సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గనవేని నందిని మల్లేష్ యాదవ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జగిత్యాల ప్రతినిధి, జూన్ 15 : హైదరాబాద్‌లోని కంట్రీ క్లబ్ హాల్లో జరిగిన రాష్ట్ర ఉప సర్పంచ్‌ల ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఉప సర్పంచ్ ల ఫోరం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం రేగుంట గ్రామ ఉప సర్పంచ్ గనవేని నందిని మల్లేష్ యాదవ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఉప సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ ప్రకటించారు. వీరి నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని వీరిని జగిత్యాల జిల్లా, కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఇంచార్జిగా నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు గనవేని నందిని మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా ఉప సర్పంచ్ ల ఐక్యతకు హక్కుల సాధనకు కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్, రాష్ట్ర కార్యదర్శి మెరుగు జంపన్న (జానీ), రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కన్వీనర్ ముత్యాల స్వామి, సంఘ తిరుపతి యాదవ్, ముత్యాల సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించకుంటే సంస్థను స్తంభింపజేస్తాం

**- సింగరేణి గుర్తింపు సంఘం నాయకుడు మిరియాల రంగయ్య హెచ్చరిక**

**- జూన్ 22 తర్వాత ఎప్పుడైనా సమ్మెకు సిద్ధంగా ఉండాలని కార్మికులకు పిలుపు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూన్ 15:సింగరేణి యాజమాన్యం కార్మికుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య వైఖరి వీడకపోతే సంస్థ వ్యాప్తంగా సమ్మె అనివార్యమవుతుందని సింగరేణి గుర్తింపు సంఘమైన ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య హెచ్చరించారు. జూన్ 22 తర్వాత ఎప్పుడైనా సమ్మెకు పిలుపు వచ్చే అవకాశం ఉన్నందున కార్మికులు అందరూ సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని పీవీకే-5 బొగ్గు గని వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికుల సహనాన్ని యాజమాన్యం బలహీనతగా భావించవద్దని, ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేయడం వల్ల కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని అన్నారు. సింగరేణి కార్మికులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ వాటి పరిష్కారంపై యాజమాన్యం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని విమర్శించారు. కార్మిక సంక్షేమం, సంస్థ భవిష్యత్ అభివృద్ధి, యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన వంటి కీలక అంశాలను పక్కనపెట్టి రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వడం వల్ల సింగరేణి మనుగడకే ముప్పు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మెడికల్ బోర్డు కేసులు, అలియాస్ పేర్ల మార్పులు, పెర్క్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ తొలగింపు, సొంత ఇంటి స్థలాల కేటాయింపు, డిపెండెంట్ ఉద్యోగాలు వంటి అనేక సమస్యలు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పలుమార్లు చర్చలు జరిగినప్పటికీ అమలు విషయంలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదని, కార్మికుల న్యాయమైన డిమాండ్ల పట్ల యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని మండిపడ్డారు. మెడికల్ ఫిట్‌గా గుర్తింపు పొందిన డిపెండెంట్లకు నియామక ఉత్తర్వులు జారీ కావడం ఏఐటీయూసీ నిరంతర పోరాట ఫలితమేనని పేర్కొన్నారు. పోరాటాల ద్వారానే హక్కులు సాధ్యమవుతాయని, కార్మికులు ఐక్యంగా ఉంటే మిగిలిన సమస్యల పరిష్కారం కూడా సాధించవచ్చని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన సుమారు రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కొత్త కోల్ బ్లాకుల కేటాయింపు, కొత్త గనుల ప్రారంభం, సంస్థ విస్తరణ, భవిష్యత్ తరాలకు ఉద్యోగ అవకాశాల కల్పన వంటి అంశాలపై తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను పెంచాలని ఒత్తిడి చేస్తూనే సంస్థ విస్తరణను నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదన్నారు. యూనియన్‌తో జరిగిన అధికారిక సమావేశాల్లో అంగీకరించిన అనేక డిమాండ్లు ఇప్పటికీ అమలు కాకపోవడం వెనుక రాజకీయ జోక్యమే కారణమని ఆరోపించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా యాజమాన్యం నిర్లక్ష్యం కొనసాగిస్తే సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉద్ధృతమవుతాయని హెచ్చరించారు. సింగరేణిలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం కార్మిక వర్గం ఇక మౌనంగా ఉండబోదని, అవసరమైతే నిరవధిక సమ్మెకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. కార్మిక హక్కులు, ఉద్యోగ భద్రత, సింగరేణి భవిష్యత్ పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటానికి అన్ని కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, కార్మికులు మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వి. మల్లికార్జున్ రావు, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, వైస్ ప్రెసిడెంట్లు కత్తెర్ల రాములు, సహాయ కార్యదర్శి గట్టయ్య, ఆఫీస్ బేరర్లు సందబోయిన శ్రీనివాస్, ఎస్. నాగేశ్వరరావు, హుమాయూన్, పిట్ కార్యదర్శులు భూక్యా రమేష్, మధుకృష్ణ, కమల్, సీనియర్ నాయకులు మండల రాజేశ్వరరావు, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి సందీప్, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జ్ సాయి పవన్, సేఫ్టీ కమిటీ సభ్యులు రాంచందర్, నారాయణ, లాల్ సింగ్, కుమార్ రావు, సంజీవ్, మోహన్, సురేందర్ రెడ్డి, కనకయ్య, మహేష్, ముబారక్, గణేష్, సునీల్, నరేష్, విక్రమ్, సహదేవ్, సుదీర్, బాబురావు, మదనయ్య, కోటేశ్వరరావు, సుధాకర్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.



# నాణ్యమైన బొగ్గు ఉత్పత్తితో సింగరేణిని మరింత బలోపేతం చేయాలి

**- భద్రతా ప్రమాణాలతో ఉత్పత్తి పెంపుపై దృష్టి సారించాలి: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మంచిర్యాల, జూన్ 15:రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు మంచిర్యాల జిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజైన ఆదివారం సింగరేణి సంస్థలో అతిపెద్ద ఏరియాగా పేరొందిన శ్రీరాంపూర్ ఏరియాను సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఉపరితల గనిలో బొగ్గు ఉత్పత్తి, రవాణా, మార్కెటింగ్ అంశాలపై సింగరేణి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్ష సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పోటీ మార్కెట్ పరిస్థితుల్లో సింగరేణి సంస్థ మరింత బలోపేతం కావాలంటే నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదే సమయంలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ ఉత్పత్తి కార్యకలాపాలను కొనసాగించాలని స్పష్టం చేశారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం ద్వారా సింగరేణి సంస్థకు మరో వందేళ్లపాటు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సంస్థ లాభదాయకతను, పోటీతత్వ సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఉత్పత్తి, రవాణా, మార్కెటింగ్ రంగాల్లో సమర్థత పెంపుతో పాటు నాణ్యత ప్రమాణాల సాధనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,ఎమ్మెల్సీ దండే విఠల్,సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, ఐఏఎస్, డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ (ఆపరేషన్స్), కె. వెంకటేశ్వర్లు (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్), గౌతమ్ పోట్రు, ఐఏఎస్ (పర్సనల్ అండ్ ఫైనాన్స్), ఈడీ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న, ఐఆర్‌టీఎస్, జీఎం (కో-ఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్) టి. శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# 'రేవంత్ సినిమా సగమే అయింది... క్లైమాక్స్ మనమే చూపించాలి'

**- కాంగ్రెస్ హామీలు అమలు చేయకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు: రేగా కాంతారావు**

**- మణుగూరులో బీఆర్ఎస్ పినపాక నియోజకవర్గ సమావేశం**





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, జూన్ 15:"రేవంత్ సినిమా సగమే అయింది... క్లైమాక్స్ మనమే చూపించాలి. రాష్ట్రానికి పట్టిన శనిని వదిలించే బాధ్యత బీఆర్ఎస్ కార్యకర్తలదే" అని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి పార్టీ శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం సోమవారం మణుగూరులో నిర్వహించారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై సమీక్ష నిర్వహించిన ఈ సమావేశంలో రేగా కాంతారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పినపాక నియోజకవర్గ అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు విశేష కృషి చేశారని రేగా పేర్కొన్నారు. వరదల సమయంలో బాధితులకు న్యాయం చేయడంతో పాటు పోడు భూములకు పట్టాలు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. నాలుగున్నర లక్షల ఎకరాల పోడు భూములకు హక్కులు కల్పించిన విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. "ప్రజలను మోసం చేసే పార్టీ బీఆర్ఎస్ కాదు. ప్రస్తుతం ప్రజలు కాంగ్రెస్ పాలనపై గోసపడుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించండి. అవి అమలు చేస్తే నేను రాజకీయ పోటీ నుంచి తప్పుకుంటాను" అంటూ రేగా సవాల్ విసిరారు. గత ఎన్నికల్లో పార్టీ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు.

నాయకులు, కార్యకర్తలు ప్రజలతో నిరంతరం మమేకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, రాబోయే ఎన్నికల్లో పినపాకలో బీఆర్ఎస్ విజయ పతాకాన్ని ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందిన సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కేవలం కే. చంద్రశేఖర్ రావుకే దక్కుతుందన్నారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి కేసీఆర్‌కు బహుమతిగా అందించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్ మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసి పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పినపాక నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, మండలాల బాధ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రపంచ వృద్ధులపై దుర్వినియోగ అవగాహన దినోత్సవ సదస్సు

**- వృద్ధులను గౌరవించడం ప్రతి కుటుంబం, సమాజ బాధ్యత: వక్తలు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఘట్‌కేసర్, జూన్ 15:ప్రపంచ వృద్ధులపై దుర్వినియోగ అవగాహన దినోత్సవం సందర్భంగా మేడ్చల్-మల్కాజిగిరి కార్పొరేషన్ ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని కొర్రెముల సుప్రభాత్ టౌన్‌షిప్ కమ్యూనిటీ హాల్‌లో డెమొక్రటిక్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వృద్ధులపై జరుగుతున్న శారీరక, మానసిక, ఆర్థిక, సామాజిక దుర్వినియోగాలను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. వృద్ధులు కుటుంబాలకు, సమాజానికి అమూల్యమైన సంపద అని, వారి అనుభవాలు యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం జూన్ 15న నిర్వహించే ప్రపంచ వృద్ధులపై దుర్వినియోగ అవగాహన దినోత్సవం ద్వారా వృద్ధుల హక్కుల పరిరక్షణ, భద్రత, సంక్షేమంపై ప్రజల్లో చైతన్యం పెంపొందించడం ప్రధాన లక్ష్యమని వివరించారు. వృద్ధులపై దుర్వినియోగ నివారణకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, కుటుంబ సభ్యులు సమన్వయంతో ఆచరణాత్మక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సూచించారు. వృద్ధులను గౌరవించడం ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడి బాధ్యత అని, వారికి ప్రేమ, ఆదరణ, భద్రత కల్పించే వాతావరణం సమాజంలో నెలకొల్పాలని కోరారు. వృద్ధుల హక్కుల పరిరక్షణ కోసం సమాజం మొత్తం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోట రంగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్, సభ్యులు వెంకటేశ్వర్లు, ఇన్నారెడ్డి, యాది రెడ్డి, ముత్యాల గౌడ్, ప్రభాకర్ గౌడ్, కృష్ణమూర్తి, సుప్రభాత్ టౌన్‌షిప్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. మన్యం, రాజనర్సు, లక్ష్మీనారాయణ, బీరయ్య, కొట్టే మల్లయ్యతో పాటు పలువురు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అర్హులందరికీ పారదర్శకంగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**- 46 మంది లబ్ధిదారులకు రూ.16.64 లక్షల సహాయం.**

**- మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో అందజేసిన తుంబూరు దయాకర్ రెడ్డి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, జూన్ 15:అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి మధ్యవర్తులు లేకుండా, వంద శాతం పారదర్శకంగా ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేస్తున్నామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన 46 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.16,64,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంత అండగా నిలుస్తోందన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశాల మేరకు రూపాయి కూడా పక్కదారి పట్టకుండా, ఎలాంటి సిఫార్సులు లేదా మధ్యవర్తిత్వం లేకుండా పూర్తిస్థాయి పారదర్శకతతో నేరుగా లబ్ధిదారులకే ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్పొరేట్ వైద్య సేవల ఖర్చులను భరించలేక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ఈ నిధులు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయం నిరంతరం అందుబాటులో ఉంటుందని, ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంలో ఎల్లప్పుడూ ముందుంటుందని దయాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సూచించిన విత్తనాలనే సాగు చేయాలి

**- ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి: వ్యవసాయ అధికారి లాల్ చాంద్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, జూన్ 15:రైతులు ప్రభుత్వ సూచించిన ధ్రువీకరించిన విత్తనాలనే వినియోగించి పంటలు సాగు చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు వ్యవసాయ సహాయ సంచాలకులు లాల్ చాంద్ సూచించారు. సోమవారం టేకులపల్లి మండల పరిధిలోని విత్తన దుకాణాలను తనిఖీ చేసిన ఆయన అనంతరం కొత్త తండా (పీ) గ్రామ రైతులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరిలో ప్రభుత్వ సిఫార్సు చేసిన బీపీటీ-5204, హెచ్ఎంటీ తెలంగాణ సోనా, కేఎన్ఎం-1638, డబ్ల్యూజీఎల్-44, జేజీఎల్-1798, డబ్ల్యూజీఎల్-962 వంటి రకాలనే సాగు చేయాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. తక్కువ వర్షపాతం నమోదైన ప్రాంతాల్లో వరి, మొక్కజొన్న పంటలకు ప్రత్యామ్నాయంగా పెసర, కంది, నువ్వులు, కూరగాయల పంటలు, ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, అలాగే సాగుకు అవసరమైన 60 నుంచి 70 మిల్లీమీటర్ల వర్షపాతం ఇంకా నమోదు కాలేదని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు పొడి దుక్కిలో విత్తనాలు విత్తకుండా తగిన వర్షపాతం వచ్చిన తర్వాతే సాగు పనులు ప్రారంభించాలని సూచించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో పంటలు సాగు చేస్తే నష్టాలను తగ్గించుకోవడంతో పాటు మెరుగైన దిగుబడులు సాధించవచ్చని లాల్ చాంద్ తెలిపారు.

# కల్లూరు ప్రజావాణిలో వెల్లువెత్తిన వినతులు

**- సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి: సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సత్తుపల్లి, జూన్ 15: ప్రజల సమస్యల పరిష్కారా నికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజావాణికి వచ్చే ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిశీలించి సత్వర పరిష్కా రానికి చర్యలు తీసుకుంటు న్నామని కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ తెలిపారు. ఖమ్మం జిల్లా కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ గ్రామాలు, మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను సమర్పించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ స్వయంగా పరిశీలిస్తూ సమస్యల స్వరూపాన్ని తెలుసుకుని సంబంధిత శాఖల అధికారులకు వెంటనే పంపించారు. రెవెన్యూ, భూ వివాదాలు, సంక్షేమ పథకాల అమలు, తాగునీటి సమస్యలు, రహదారుల నిర్మాణం, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన అనేక వినతులు ప్రజావాణిలో అందాయి. ఆయా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కారం చూపాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజలకు న్యాయం అందేలా శాఖల మధ్య సమన్వయం పెంపొందించి పెండింగ్ సమస్యలను వేగంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని సబ్ కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు ప్రభుత్వ పరిపాలనను మరింత చేరువ చేసే వేదికగా నిలుస్తోందని, ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు. ప్రజావాణికి వచ్చిన ప్రతి వినతిపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.



# ఘనంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు

## - కల్లూరులో కేక్ కట్ చేసి మిఠాయిల పంపిణీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, జూన్ 15:తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను సోమవారం ఖమ్మం జిల్లా కల్లూరులో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. కల్లూరు జాతీయ రహదారిపై ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోట్రు అర్జున్‌రావు, కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ మోహన్ నాయక్, ఏఎంసీ చైర్‌పర్సన్ భాగం నీర్జా దేవి, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి పరస్పరం మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. భారీ సంఖ్యలో హాజరైన కాంగ్రెస్ శ్రేణులు భట్టి విక్రమార్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయనకు దీర్ఘాయుష్షు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పేదల సంక్షేమ కార్యక్రమాల అమలులో భట్టి విక్రమార్క కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ప్రజల పట్ల ఆయనకున్న అంకితభావం, సేవా దృక్పథం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# నాసిరకం పేలుడు సామగ్రితో సింగరేణిలో కార్మికుల ప్రాణాలకు ముప్పు

## - కేటీకే-5 గని ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. - తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు.కామెర గట్టయ్య

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భూపాలపల్లి, జూన్ 15:సింగరేణిలో నాసిరకం పేలుడు సామగ్రి వినియోగం కారణంగా కార్మికుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని, కేటీకే-5 ఇంక్లైన్ గనిలో జరిగిన తాజా ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య డిమాండ్ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కేటీకే-5 ఇంక్లైన్ గని (ఎస్ఎస్-2, 32 డిస్ట్రిక్ట్)లో సోమవారం ఫ్రీ షిఫ్ట్ సమయంలో బొగ్గు ఉత్పత్తి కోసం బ్లాస్టింగ్ పనులు నిర్వహిస్తుండగా షాట్ ఫైరర్ శ్రీరాముల ప్రదీప్ చేతిలో పేలుడు పదార్థం (పూర్ణి) పేలింది. ఈ ప్రమాదంలో ఆయన చేతి బొటనవేలు తెగిపోగా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయనను భూపాలపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై స్పందించిన కామెర గట్టయ్య, ఇటీవల సింగరేణి సంస్థ కొన్ని కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుని నాసిరకం పేలుడు సామగ్రిని కొనుగోలు చేస్తోందని ఆరోపించారు. కొత్త సాంకేతికత పేరుతో అధిక ధరలకు దిగుమతి చేసుకుంటున్న పేలుడు పదార్థాలు, ఎక్స్‌ప్లోడర్లు కార్మికుల భద్రతకు ముప్పుగా మారుతున్నాయని పేర్కొన్నారు. గతంలో తక్కువ ధరలకు లభించే పేలుడు సామగ్రికి బదులుగా ప్రస్తుతం అనేక రెట్లు అధిక వ్యయంతో కొనుగోలు చేస్తున్న సామగ్రి నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆయన అన్నారు. ఈవిధానంతో ఒకవైపు కార్మికులు ప్రమాదాలకు గురవుతుండగా, మరోవైపు సంస్థకు కూడా ఆర్థిక నష్టం వాటిల్లుతోందని విమర్శించారు. ఈ ప్రమాదానికి యాజమాన్య నిర్లక్ష్యమా, లేక పేలుడు సామగ్రి సరఫరా చేస్తున్న కంపెనీల బాధ్యతా అనే అంశాన్ని ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం తేల్చాలని గట్టయ్య డిమాండ్ చేశారు. ప్రమాదానికి కారణమైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, నాసిరకం సామగ్రి సరఫరాపై సమగ్ర విచారణ జరిపి భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలనిఆయన కోరారు.

# డిమాండ్లు పరిష్కరించకపోతే సింగరేణిలో భారీ సమ్మె తప్పదు

## - 31 డిమాండ్లపై యాజమాన్యానికి వినతిపత్రం అందజేశాం
## - ఎస్.సి.డబ్ల్యు.యు. ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, జూన్ 15:సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి కొనసాగిస్తే సంస్థ వ్యాప్తంగా భారీ సమ్మెకు దిగక తప్పదని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమిరి రాజ్‌కుమార్ హెచ్చరించారు. కార్మికులకు సంబంధించిన 31 ప్రధాన డిమాండ్లతో యాజమాన్యానికి వినతిపత్రం అందజేశామని, వాటి పరిష్కారంపై స్పష్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అనేక కీలక అంశాలు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నప్పటికీ యాజమాన్యం స్పందించకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. మెడికల్ బోర్డు విధానాన్ని కొనసాగించాలని, పెండింగ్‌లో ఉన్న మారు పేర్ల (అలియాస్) సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అలాగే కోల్ ఇండియాలో అమలు చేస్తున్న కార్మికుల రిఫండ్ విధానాన్ని సింగరేణిలో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థకు ప్రభుత్వం చెల్లించాల్సిన సుమారు రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా యాజమాన్యం కాలయాపన చేస్తే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే భారీ సమ్మెకు కూడా వెనుకాడబోమని కొమిరి రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం యూనియన్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ మణుగూరు అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మేకల ఈశ్వర్, ఆఫీస్ బేరర్లు శనిగరపు కుమారస్వామి, ఆవుల నాగరాజు, సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, సర్వర్, ఇమాముద్దీన్, తేనేటి నారాయణ, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో ఘనంగా బడిబాట కార్యక్రమం ప్రారంభం

## - విద్యకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత - సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సత్తుపల్లి, జూన్ 15:విద్యార్థుల భవిష్యత్ నిర్మాణానికి విద్యే బలమైన పునాదిగా నిలుస్తుందని, విద్యా రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లను నిరంతరం సందర్శిస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ సహకారంతో పాటు ఆశా ఫౌండేషన్ ద్వారా కూడా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. "చదువే మనిషికి నిజమైన ఆస్తి. నేడు విద్యార్థులు పొందే విద్యే రేపటి వారి కుటుంబాలను, సమాజాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుంది. విద్య ద్వారా మాత్రమే ఉన్నత శిఖరాలను అధిరోహించగలం" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఆమె అభినందించారు. అల్పాహారం, పాలు వంటి పోషకాహార కార్యక్రమాలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తూ, ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, డాక్టర్ మట్టా దయానంద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజేశ్వర్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామ్మోహన్, మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా బేగం కమల్ పాషా, వైస్ చైర్‌పర్సన్ బొంతు సుమలత వేణు, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, యూపీఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి

## - కార్మికుల సమీకరణ పెంచి మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలి
## - ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, జూన్ 15:జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను వేగవంతం చేసి, అధిక సంఖ్యలో కార్మికులను సమీకరించి మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధికి తోడ్పడే పనులతో పాటు రైతులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చే సాగునీటి వనరుల అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సోమవారం వైరా నియోజకవర్గ పరిధిలోని వైరా మండలం సాన్నాల లక్ష్మీపురం గ్రామం, కొనిజర్ల మండల కేంద్రంలో కొనసాగుతున్న కెనాల్ లింక్ కాలువ పూడికతీత పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనుల పురోగతిని పరిశీలించి కార్మికులతో మాట్లాడారు. వేతనాలు సకాలంలో అందుతున్నాయా, పనుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న పనులు గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించడమే కాకుండా వ్యవసాయాభివృద్ధికి దోహదపడేలా ఉండాలని అన్నారు. కాలువల పూడికతీత, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే పనులు, సాగునీటి సదుపాయాల మెరుగుదల వంటి పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనుల సంఖ్యను పెంచి ఎక్కువ మంది కార్మికులకు పని దినాలు కల్పించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు అందేలా చూడాలని, హాజరు నమోదులో పారదర్శకత పాటించాలని, మాస్టర్ రోల్స్‌లో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. మహిళల భాగస్వామ్యాన్ని పెంచడంతో పాటు పనుల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ప్రతి పనిని ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా నమోదు చేసి, జియో ట్యాగింగ్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని కూలీల ఆరోగ్య భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. పని ప్రదేశాల్లో షేడ్ నెట్లు ఏర్పాటు చేసి నీడ కల్పించడంతో పాటు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎండల ప్రభావం వల్ల కార్మికులు ఇబ్బందులు పడకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం గురించి గ్రామాల్లో మరింత అవగాహన కల్పించి అర్హులైన ప్రతి కుటుంబం నుంచి ఎక్కువ మంది పనులకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం మాస్టర్ కార్డులను పరిశీలించిన కలెక్టర్ పని దినాల నమోదు, హాజరు వివరాలు, వేతన చెల్లింపులపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. మహిళా సంఘ భవనాల నిర్మాణాలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని, ఎంపీడీవోలు పనుల అమలు, పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అధిక సంఖ్యలో కార్మికులను సమీకరించి పనులు చేపడితే అదనపు కాంపోనెంట్ నిధులు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్మికులు చేసిన పనికి సంబంధించిన వేతన వివరాలను అదే రోజున వారికి తెలియజేయాలని, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన, వ్యవసాయ మౌలిక సదుపాయాల బలోపేతంలో ఉపాధి హామీ పథకం కీలక పాత్ర పోషిస్తోందని కలెక్టర్ దివాకర టీఎస్ పేర్కొన్నారు. ఈ తనిఖీలలో కొనిజర్ల తహసీల్దార్ అరుణ, ఎంపీడీవో ఉపేంద్రయ్య, సర్పంచ్ గుదే పుష్పావతి, వైరా తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో సక్రు నాయక్, లక్ష్మీపురం సర్పంచ్ నూతి వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలి

## జిల్లా కలెక్టర్‌కు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) వినతిపత్రం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి/కాటారం, జూన్ 15:జిల్లాలోని పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సామంతుల శ్యామ్, హెల్త్ కమిటీ సభ్యుడు సామల శ్రీనివాస్, చిన్న పత్రికల సంఘం అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజానికి సమాచార వారధులుగా పనిచేస్తూ ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం నిరంతరం శ్రమిస్తున్న జర్నలిస్టుల కుటుంబాలు మాత్రం అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యా ఫీజులు గణనీయంగా పెరిగిపోవడంతో జర్నలిస్టులు తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా జిల్లాల్లో పనిచేస్తున్న విలేకరుల ఆదాయం పరిమితంగా ఉండటంతో విద్యాభారం మరింత పెరుగుతోందన్నారు. జర్నలిస్టుల సేవలను గుర్తించి వారి పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో కనీసం 50 శాతం ఫీజు రాయితీ కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక విధానం రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా విద్యాశాఖ అధికారికి కూడా వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు విజయ్, సుధాకర్, రామారావు, పవన్‌తో పాటు పలువురు విలేకరులు పాల్గొన్నారు.

# కొడుకు, కోడలు వేధింపుల నుంచి రక్షణ కల్పించాలి

## కలెక్టర్‌కు 85 ఏళ్ల వృద్ధురాలి ఆవేదన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పాల్వంచ, జూన్ 15:కొడుకు, కోడలు వేధింపుల నుంచి తనను రక్షించి, తన ఆస్తి మరియు వ్యవసాయ భూమిని తిరిగి ఇప్పించాలని కోరుతూ 85 ఏళ్ల వృద్ధురాలు జిల్లా కలెక్టర్ అంకిత్‌కు ఫిర్యాదు చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని 34వ డివిజన్ కరకవాగు గ్రామానికి చెందిన భట్టు కోమి సోమవారం నిర్వహించిన ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించింది. తనకు ముగ్గురు కుమారులు ఉన్నారని, వారిలో పెద్ద కుమారుడు భట్టు రామ్ దన్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడని ఆమె తెలిపింది. తనను బాగా చూసుకుంటానని నమ్మబలికి ఇంటి స్థలం, నాలుగున్నర ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించిన పత్రాలపై సంతకాలు తీసుకున్నాడని ఆరోపించింది. అయితే ఆస్తి తన పేరునుంచి మార్చుకున్న తర్వాత తనకు సరైన భోజనం కూడా పెట్టకుండా వేధింపులకు గురిచేస్తున్నారని, దుర్భాషలాడుతూ శారీరకంగా దాడి చేస్తున్నారని వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. అంతేకాక తనకు వచ్చే వృద్ధాప్య పింఛన్ నగదును కూడా కుమారుడు తీసుకుంటున్నాడని కన్నీటి పర్యంతమైంది. తన భూమి, పింఛన్ డబ్బులు తిరిగి ఇప్పించి, కొడుకు-కోడలు వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని కలెక్టర్‌ను ఆమె వేడుకుంది. ఫిర్యాదుపై స్పందించిన జిల్లా కలెక్టర్ అంకిత్ వెంటనే విచారణ జరిపి సమగ్ర నివేదిక సమర్పించాలని కొత్తగూడెం ఆర్డీవోను ఆదేశించారు.

# గాల్లోనే ఆరిపోతున్న గౌడన్నల జీవితాలు

## - తాటి చెట్టుపై నుంచి పడి గండి సదయ్య గౌడ్ మృతి బాధాకరం.
## - కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలి.
## - తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్ గౌడ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, జూన్ 15:తాటి చెట్లపై నుంచి పడిపడి గౌడ కార్మికులు మృత్యువాత పడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని, గాల్లోనే గౌడన్నల జీవితాలు ఆరిపోతు న్నాయని తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. రేగొండ మండల కేంద్రానికి చెందిన గండి సదయ్య గౌడ్ (55) ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందడం అత్యంత బాధాకరమని అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వృత్తినే జీవనాధారంగా చేసుకుని కుటుంబాలను పోషిస్తున్న గౌడ కార్మికులు ప్రతిరోజూ ప్రాణాలను పణంగా పెట్టి తాటి చెట్లు ఎక్కుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో ప్రమాదాలకు గురై మృతి చెందడంతో అనేక కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రేగొండకు చెందిన గండి సదయ్య గౌడ్ తాటి చెట్టుపై నుంచి కిందపడడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడని, ఆయన మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారని పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే గౌడ కార్మికుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, తాటి చెట్లు ఎక్కే సమయంలో ప్రమాదాలు జరగకుండా ప్రతి గౌడ కుటుంబానికి "కాటమయ్య రక్ష కవచం" భద్రతా కిట్లను ఉచితంగా అందించాలని కోరారు. గీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక పథకాలు అమలు చేసి వారి కుటుంబాలకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్‌కు తెలంగాణ గౌడ సంఘం జిల్లా కార్యదర్శి మామిండ్ల శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు తడుకా సుధాకర్ గౌడ్, సొసైటీ అధ్యక్షులు, గౌడ కుల సంఘ నాయకులు, సభ్యులు మద్దతు తెలిపారు. గౌడ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరారు.

# భవిష్యత్తులో 'నిరంతరాయం' కోసం... నేడు ఇస్నాపూర్‌లో విద్యుత్ సరఫరాకు 'అంతరాయం

- 11కేవీ నాగులమ్మ, ఐడీఏ ఫీడర్ల పరిధిలోని పలు కాలనీల్లో నిలిచిపోనున్న సరఫరా
- వర్షాకాల ముందస్తు నిర్వహణ పనుల నేపథ్యంలో విద్యుత్ శాఖ కీలక నిర్ణయం
- నాణ్యమైన సరఫరా కోసమే ముందస్తు చర్యలు : ఏడీఈ తులసీరాం, ఏఈ వీరాంజనేయులు
- నేడు ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా వేర్వేరు ఫీడర్లలో కరెంట్ కోత
- సిబ్బంది భద్రత దృష్ట్యా గృహ, వ్యాపార వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పటాన్‌చేరు, జూన్ 15 : రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఇస్నాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడంతో పాటు (ట్రీ ట్రిమ్మింగ్), అత్యవసర ఫీడర్ల నిర్వహణ పనులను చేపట్టనున్నారు. ఏడీఈ తులసీరాం పర్యవేక్షణలో ఈ మరమ్మతు పనులు సాగనున్నట్లు ఇస్నాపూర్ విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్. వీరాంజనేయులు తెలిపారు. భవిష్యత్తులో వినియోగదారులకు ఎలాంటి సాంకేతిక లోపాలు లేని, నాణ్యమైన నిరంతరాయ విద్యుత్‌ను అందించేందుకే ఈ ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఈ పనుల నిమిత్తం మంగళవారం ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా వేర్వేరు ఫీడర్ల పరిధిలో కరెంట్‌ను పూర్తిగా నిలిపివేస్తున్నామని తెలిపారు.

ఏయే ప్రాంతాల్లో.. ఎప్పుడెప్పుడంటే?

మొదటి విడత ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం పన్నెండు గంటల ముప్పై నిమిషాల వరకు 11కేవీ నాగులమ్మ ఫీడర్ పరిధిలో అత్యవసర మరమ్మతుల కారణంగా క్రింది ప్రాంతాల్లో ఉదయం పూట కరెంట్ సరఫరా నిలిచిపోతుంది. వాటిలో నాగార్జున కాలనీ, సన ఎస్టేట్, సాయి ప్రియ కాలనీ, విజేత కాలనీ, రామ్ రాజ్ నగర్, ఈషా బ్లూమ్స్ రైస్ మిల్ రోడ్ ప్రాంతం రెండవ విడత మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు 11కేవీ ఐడీఏ ఇస్నాపూర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం తర్వాత నిర్వహణ పనులు ప్రారంభం కానున్నాయి, అని తెలియచేసారు. రెండో నేపథ్యంలో క్రింది ప్రాంతాల్లో కరెంట్ కోత ఉంటుంది. అందులో ప్రముఖ్ నగర్, గాయత్రి నిలయం పూల మార్కెట్, ఎస్.ఎమ్ హాస్పిటల్ ఏరియా ఇస్నాపూర్ ఎక్స్ రోడ్, పద్మారావు నగర్ కావ్య కాలనీ, జనప్రియ అపార్ట్‌మెంట్స్ డీమార్ట్ గోడౌన్ ఏరియా, లక్డారం గేట్ ఏరియా, శిరిడి హిల్ ఈ లైన్ల నిర్వహణ పనులు జరుగుతున్న సమయంలో క్షేత్రస్థాయి సిబ్బంది భద్రతను దృష్టిలో ఉంచుకుని కరెంట్ నిలిపివేత తప్పనిసరి అంటూ, నిర్దేత సమయం లోపే పనులను పూర్తి చేసి, సరఫరాను పునరుద్ధరించడానికి శాయశక్తులా కృషి చేస్తాం, అని ఇస్నాపూర్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు, గృహ, వ్యాపార సముదాయాల నిర్వాహకులు ఈ విషయాన్ని గమనించి, విద్యుత్ శాఖ సిబ్బందికి పూర్తిస్థాయిలో సహకరించాలని ఏడీఈ తులసీరాం, ఏఈ వీరాంజనేయులు తెలియచేసారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

**- జయశంకర్-భూపాలపల్లి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్ భూపాలపల్లి, జూన్ 15 : ప్రజావాణి కార్యక్రమంలో అందుతున్న దరఖాస్తులను జాప్యం లేకుండా పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతగా పరిగణించాలని సూచించారు. సోమవారం జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 66 దరఖాస్తులను స్వీకరించారు. సమస్యల స్వరూపాన్ని పరిశీలించిన అనంతరం వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్‌మెంట్ చేసినట్లు అశోక్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సమస్యల పరిష్కారంపై ఆశతో ప్రభుత్వాన్ని ఆశ్రయిస్తున్నందున ప్రతి దరఖాస్తును అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చే సోమవారం నాటికి అందిన ప్రతి దరఖాస్తుపై పురోగతి నమోదు చేసి సాధ్యమైనంత వరకు పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందిన ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని, దరఖాస్తుదారులకు రశీదు అందజేసి సమస్యల పరిష్కార ప్రక్రియలో పారదర్శకతను నెలకొల్పాలని ఆదేశించారు. అలాగే ప్రతి శాఖ అధికారి తమ పరిధిలోని దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, పరిష్కారంలో అనవసర జాప్యం జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఆర్వో వసంతకుమారి, ఆర్డీవో హరికృష్ణతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలకు సత్వర సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం

**- ప్రజావాణిలో వచ్చిన ప్రతి వినతిని ప్రాధాన్యతతో పరిష్కరించాలి**

**- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూన్ 15 : ప్రజలకు సత్వర, పారదర్శక సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్‌ఓ పద్మావతితో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు భూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, మౌలిక సదుపాయాలు, రెవెన్యూ మరియు ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు సమర్పించిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్, సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను కేవలం నమోదు చేయడం సరిపోదని, వాటి పరిష్కారానికి నిర్దిష్ట కార్యాచరణతో ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే సమస్యల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేదా నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేసిన కలెక్టర్, వెంటనే పరిష్కరించగల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, మిగిలిన సమస్యలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు పనిచేయాలని, ప్రభుత్వ సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలు తమ వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలు సమర్పిస్తే సమస్యల పరిష్కార ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, వారి సమస్యలకు సత్వర పరిష్కారం అందించడమే ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యునిగా గిన్నెల శ్రీకాంత్ నియామకం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, జూన్ 15 : బిజెపి జగిత్యాల జిల్లా బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యునిగా కోరుట్ల పట్టణానికి చెందిన గిన్నెల శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం బిజెపి జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ వై.అనూప్ రావు నివాసంలో బీజేపీ నాయకుడు గిన్నెల శ్రీకాంత్ కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు కస్తూరి లక్ష్మి నారాయణ.మాట్లాడుతూ.. బీజేపీ సీనియర్ నాయకుడు గిన్నెల శ్రీకాంత్ పార్టీ బలోపేతనికి కృషి చేస్తూ, కోరుట్ల పట్టణ బీజేపీలో పార్టీకి అత్యంత కీలకమైన సేవలందించారని కొనియాడారు. గిన్నెల శ్రీకాంత్ మాట్లాడుతూ..నాపై నమ్మకంతో జగిత్యాల జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యునిగా నా నియామకానికి సహకరించిన ఇందూరు పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్, జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వైఅనూప్ రావులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శ్రీనివాసన్, జిల్లా ఉపాధ్యక్షుడు తుక్కారం గౌడ్, రాష్ట్ర నాయకుడు ఏలేటి నరేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు రుద్ర శ్రీనివాస్, జగిత్యాల జిల్లా కార్యదర్శి సుదవేణి మహేష్, బీజేపీ, బీజేవైఎం నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులు చెట్లపెల్లి సాగర్, ఎర్ర రాజేందర్, మ్యాకల గణేష్, గందే నవీన్, మాడవేణి నరేష్, కోరుట్ల మండల అధ్యక్షుడు అంబల్ల సుదర్శన్, సంకు నరేందర్, బోలిశెట్టి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రగుంట చెరువును సర్వే చేసి ఎఫ్‌టీఎల్ హద్దులు నిర్ణయించాలి

**- చెరువును కబ్జాల నుంచి కాపాడి గ్రామాన్ని రక్షించాలి**

**- సీపీఎం జిల్లా కార్యదర్శి మెచ్చా వెంకటేశ్వర్లు**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, జూన్ 15 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణ పరిధిలోని ఎర్రగుంట చెరువును కబ్జాల నుంచి రక్షించి, వెంటనే సర్వే నిర్వహించి ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) హద్దులను నిర్ణయించాలని సీపీఎం భద్రాద్రి జిల్లా కార్యదర్శి మెచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఎర్రగుంట చెరువును పరిరక్షించాలంటూ స్థానిక రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం ఆరవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని సందర్శించిన మెచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, చెరువు, తూములు, అలుగు భౌతికంగా స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ అధికారులు మాత్రం రికార్డుల్లో చెరువు లేదంటూ చెప్పడం ఆశ్చర్యకరమని విమర్శించారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు ఒకవైపు చెరువు ఉనికిని అంగీకరిస్తూ నివేదికలు ఇస్తుండగా, మరోవైపు రికార్డుల్లో లేదని చెప్పడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. భౌతికంగా ఉన్న చెరువు రికార్డుల్లో కనిపించకపోవడం అధికారుల నిర్లక్ష్యం లేదా ఉద్దేశపూర్వక చర్యల ఫలితమని ఆరోపించారు. తమదే భూమి అని చెబుతున్న వ్యక్తులు సర్వే నిర్వహించేందుకు ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. నిజంగా ఆ భూమి వ్యక్తిగత వ్యవసాయ భూమి అయితే సర్వేకు అంగీకరించి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని సవాల్ విసిరారు. తప్పుడు పత్రాల ఆధారంగా రైతు బంధు వంటి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందినట్లయితే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, అక్రమంగా పొందిన నిధులను తిరిగి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఎర్రగుంట చెరువును గ్రామ ప్రజలకు తిరిగి అప్పగించే వరకు సీపీఎం రైతుల పోరాటానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చెరువు పరిరక్షణ కోసం అవసరమైతే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రిని కూడా కలిసి సమస్యను వివరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఎర్రగుంట రైతులు చేపడుతున్న ఉద్యమంలో సీపీఎం ప్రత్యక్ష భాగస్వామిగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దొడ్డా రవికుమార్, పట్టణ కార్యదర్శి పి. తులసిరాం, కార్యదర్శివర్గ సభ్యురాలు వి. సత్యవాణి, కమిటీ సభ్యులు వి. రాములు, గ్రామస్తులు ఎం. వరప్రసాద్, ఈ. నాగభూషణం, వి. నాగసత్యనారాయణ, ఎం. సత్యనారాయణ, ఎం. వెంకన్న, సత్యం, ఎల్లయ్యతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



# నీట్ పరీక్షలు జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జూన్ 15 : ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న నీట్ పరీక్షను జిల్లాలో పటిష్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ డి ఎస్ పి అశోక్ లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించే నీట్ పరీక్షలు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు మధ్య పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల- కళాశాల లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని,హౌ353 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5.15 గంటల వరకు పరీక్ష ఉంటుందని, అభ్యర్థులను ఉదయం 11 గంటలకు నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అనుమతించడం జరుగుతుందని, 1.30 గంటల తర్వాత పరీక్ష కేంద్రంలోనికి అనుమతి ఉండదని తెలిపారు. అభ్యర్థులు 2 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, అడ్మిట్ కార్డు, గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా తీసుకురావాలని, పరీక్షా కేంద్రంలోనికి మొబైల్ ఫోను అనుమతి లేదని తెలిపారు. పరీక్ష కేంద్రంలో అభ్యర్థులకు సరిపడా కుర్చీలు, టేబుళ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, పరీక్ష కేంద్రంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద వైద్య సిబ్బంది అవసరమైన మందు లతో శిబిరం ఏర్పాటు చేయాలని, ఆర్ టి సి అధికారులు సమయానుకూలంగా బస్సులు నడిపించాలని తెలిపారు. పరీక్ష విధులు నిర్వహించే సిబ్బంది తప్ప ఇతరులకు పరీక్ష కేంద్రంలోనికి అనుమతి లేదని, పరీక్షను ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి బందోబస్తు మధ్య పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నీట్ పరీక్షల సిట్ సమన్వయకర్త నరసింహస్వామి, పరీక్ష కేంద్రం ముఖ్య పర్యవేక్షకులు, విద్య, వైద్య, విద్యుత్, ఆర్ టి సి, రవాణా, అగ్నిమాపక, శాఖల అధికారులు, తహసిల్దార్ రియాజ్ అలీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీసీటీఎన్ఎస్ 2.0 అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలి

**భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూన్ 15 : సీసీటీఎన్ఎస్ 2.0 పరిధిలో నమోదైన కేసుల దర్యాప్తు పురోగతిని నిర్దేశిత గడువులోగా ఆన్ లైన్ లో అప్ లోడ్ చేయాలని, పెండింగ్ కేసులను సత్వరమే పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆయన పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని సూచించిన ఎస్పీ, వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైనందున స్కూల్ బస్సుల ఫిట్నెస్‌ను నిశితంగా తనిఖీ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే బ్లాక్‌స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని, గంజాయి, మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు సైబర్ నేరాల నివారణకు నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, పెండింగ్ కేసుల పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం కొనసాగించాలని సూచించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలి... లేకపోతే సీఎం పదవికి రాజీనామా చేయాలి

**- తెలంగాణ రక్షణ సేన కందడి మణిపాల్ రెడ్డి - యాదగిరిగుట్ట నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర - ప్రజావాణిలో వినతి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, జూన్ 15 : ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని, లేకుంటే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందడి మణిపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం యాదగిరిగుట్ట నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించి ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నిరుద్యోగుల బలిదానాలతో ఏర్పడిన తెలంగాణలో అధికార కాంగ్రెస్ ప్రభుత్వం యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల తల్లిదండ్రులు కూలీ పనులు చేస్తూ పిల్లలను చదివిస్తే, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత నిరాశలో కూరుకుపోయిందన్నారు. పోటీ పరీక్షల కోసం కోచింగ్ సెంటర్లకు వేల రూపాయలు ఖర్చు చేస్తున్నా ఉద్యోగాల భర్తీపై స్పష్టత లేక యువత అయోమయంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి లేక పాన్ షాపులు, టీ దుకాణాలు, బట్టల దుకాణాల్లో పని చేస్తూ అర్థాకలితో జీవనం సాగిస్తున్న నిరుద్యోగుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ఇప్పటికే పలువురు నిరుద్యోగులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. గతంలో ఉద్యోగ దరఖాస్తు ఫీజు తక్కువగా ఉండేదని, ప్రస్తుతం ప్రభుత్వం భారీగా పెంచిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఉచిత దరఖాస్తుల హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో ఆశించిన మేర చర్యలు తీసుకోలేదని విమర్శించారు. రైతులు, నిరుద్యోగ యువత ఆశలతో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారని, ఇప్పుడు వారి సమస్యలను విస్మరించిందని మండిపడ్డారు. జీఓ-46ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ కూడా ప్రభుత్వ వైఫల్యాలపై గట్టిగా పోరాడడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో కనుగంటి శ్రీనివాస్ గౌడ్, కౌడి ఉపేందర్, మండల అధ్యక్షుడు విజయ్, జానకి, భవానీరాజు తదితరులు పాల్గొన్నారు.

# పల్స్ పోలియో, సికిల్ సెల్ ఎనీమియా నివారణ కార్యక్రమాలను విజయవంతం చేయాలి

**- డీఎంహెచ్‌వో డా. తుకారాం రాథోడ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూన్ 15 : జిల్లాలో పల్స్ పోలియో, సికిల్ సెల్ ఎనీమియా నివారణ కార్యక్రమాలతో పాటు ఆరోగ్య సంస్థల్లో మందుల నిర్వహణను పటిష్టంగా చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. తుకారాం రాథోడ్ సూచించారు. సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రోగ్రాం ఆఫీసర్లతో, అనంతరం ఫార్మసీ అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించి శిక్షణలు, బూత్ కార్యకలాపాలు, రెండో, మూడో రోజుల గృహ సందర్శనలపై దిశానిర్దేశం చేశారు. జూన్ 19న ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా దినోత్సవం సందర్భంగా జిల్లాలో సికిల్ సెల్ ఎనీమియా, తలసీమియా, ఇతర రక్త కణ లోపాలతో బాధపడుతున్న వారిని గుర్తించి స్క్రీనింగ్, ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొరతను అధిగమించేందుకు పటిష్ట కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ఫార్మసీ అధికారులతో జరిగిన సమావేశంలో ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల నిల్వ, పంపిణీ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. గడువు ముగిసిన మందులు, డిస్కార్డ్ చేసిన మందుల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, వ్యాక్సిన్లు, మందులకు ప్రత్యేక స్టాక్ రిజిస్టర్లు నిర్వహించాలని సూచించారు. వ్యాక్సిన్లను నిర్దేశిత ఉష్ణోగ్రత వద్ద భద్రపరుస్తూ కోల్డ్ చైన్ వ్యవస్థను కచ్చితంగా అమలు చేయాలని, మందుల కొనుగోలు, పంపిణీ, నిల్వలకు సంబంధించిన వివరాలను ఈ-ఔషధి పోర్టల్‌లో సకాలంలో నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య సంస్థల్లో అవసరమైన మందులు, వ్యాక్సిన్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. సాయి కళ్యాణ్, ప్రోగ్రాం ఆఫీసర్లు డా. ప్రతాప్, డా. దినేష్, డా. రాకేష్, డా. హరీష్, డిప్యూటీ డెమో నాగలక్ష్మి, డీపీఎంఓ మోహన్, సీహెచ్‌వో నాగభూషణం, జిల్లా ఫార్మసీ అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించే దిశగా చర్యలు

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మంచిర్యాల, జూన్ 15 : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. చెన్నూర్ మండలం ఒతుకులపల్లి గ్రామానికి చెందిన కావేరి శోభ తన పేరు ఇందిరమ్మ మొదటి జాబితాలో వచ్చిందని, ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన సెగ్గెం ప్రసాద్ ఎస్.సి. కులానికి చెందిన నిరుపేద అయిన తనకు జీవనాధారంగా ఆటో, రెండు పడక గదుల ఇల్లు అందజేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తాండూరు మండలం అచలాపూర్ గ్రామానికి చెందిన కట్ల పోసక్క, కట్ల పోచం లు గ్రామ శివారులో చేపట్టిన అక్రమ కల్వర్టు నిర్మాణంలో తమ భూమి ఆక్రమణ జరుగుతుందని, ఈ విషయమై తమకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని భగత్ నగర్ కు చెందిన సత్యనారాయణ రావు తనకు జిల్లాలోని లక్షెట్టిపేట మండలం మోదెల గ్రామంలో గల భూమి గోదావరి నీటిలో మునిగిందని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.

# సినిమా న్యూస్



# పెద్ది విన్నింగ్ షాట్ కొట్టాడు కానీ..



ఈ రోజుల్లో హిట్ టాక్ తెచ్చుకున్న సినిమాలకు తొలి వీకెండ్ తర్వాత వసూళ్లు బాగా పడిపోతున్నాయి. ఒకసారి పడ్డాక, వసూళ్లు పుంజుకోవడం కష్టమవుతోంది. అలాంటిది డివైడ్ టాక్‌తో మొదలైన 'పెద్ది' సినిమా రెండో వీకెండ్లో పుంజుకున్న తీరు అనూహ్యమే. చాన్నాళ్ల తర్వాత వచ్చిన పెద్ద హీరో సినిమా కావడం.. కమర్షియల్ హంగులకు తోడు కథాబలం కూడా ఉన్న సినిమా కావడం.. టికెట్ల ధరలు కూడా తగ్గించడం.. జనాలు థియేటర్లకు రావడానికి తోడ్పడింది. నిన్న ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాల్లోనూ 'పెద్ది'కి చాలా థియేటర్లలో హౌస్ ఫుల్స్ పడ్డాయి. సింగిల్ స్క్రీన్ల ముందు రెండో వీకెండ్లో హౌస్ ఫుల్ బోర్డులు పెట్టడం అంటే ఈ రోజుల్లో అరుదైన విషయమే. వీక్ డేస్‌లో సినిమా వీక్ అవడం చూసి తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాకు బ్రేక్ ఈవెన్ అవుతుందా.. బయ్యర్లు సేఫ్ అవుతారా లేదా అన్న సందేహాలు కలిగాయి. కానీ మ్యాచ్ చివర్లో విన్నింగ్ షాట్ కొట్టినట్లే.. పెద్ది థియేట్రికల్ రన్ చివర్లో భలేగా పెర్ఫామ్ చేసింది. దీంతో తెలుగు రాష్ట్రాల్లో దాదాపుగా అన్ని ఏరియాల్లో 'పెద్ది' సినిమా సేఫ్ జోన్లోకి వచ్చేసింది. ఐతే పెద్ది విన్నింగ్ షాట్ ఏపీ, తెలంగాణకే పరిమితం. ఇంకెక్కడా ఈ సినిమా బ్రేక్ ఈవెన్ అవ్వలేదు. కర్ణాటకలో బాగా ఆడినప్పటికీ.. పెట్టుబడి భారీ మొత్తంలో పెట్టడంతో అక్కడ సినిమా నష్టాలే మిగిల్చింది. తమిళనాడు, కేరళలో 'పెద్ది' ఏమాత్రం ప్రభావం చూపలేకపోయింది. హిందీలో ఓమాదిరిగా ఆడుతోంది కానీ.. అది సరిపోదు.

ఈ చిత్రాన్ని హిందీలో జియో స్టూడియోస్ గట్టిగా ప్రమోట్ చేసి రిలీజ్ చేసింది కానీ.. ఆశించిన ఫలితం అయితే రాలేదు. పెట్టుబడిలో చాలా వరకు నష్టపోయినట్లే. ఇక 'పెద్ది' సినిమాకు అతి పెద్ద షాక్ అంటే యుఎస్‌లోనే. రూ.40 కోట్లకు పైగా పెట్టి హక్కులు తీసుకున్న ప్రత్యంగర సినిమాస్ సగానికి సగం నష్టపోయినట్లు తెలుస్తోంది. 6.5 మిలియన్ డాలర్లు రాబట్టాల్సిన సినిమా కాస్తా 4 మిలియన్ల మార్కును కూడా దాటడం కష్టంగా ఉంది. మొత్తంగా చూస్తే 'పెద్ది'ని పక్కా లోకల్ హిట్‌గా చెప్పొచ్చు. తెలుగు రాష్ట్రాల అవతల మాత్రం సినిమా డిజాస్టరే.

# హై-ప్రొఫైల్ స్కామ్ థ్రిల్లర్ రిటర్న్స్!



కొన్ని సినిమాలు ఎంత అద్భుతంగా రూపొందినా? అనివార్య కారణాలతో ప్రేక్షకుల ముందుకు రావడానికి ఏళ్ల తరబడి సమయం పడుతుంది. ఆ కోవకు చెందిన చిత్రమే -శతురంగ వేట్టై 2-. అరవింద్ స్వామి-త్రిష జంటగా నిర్మల్ కుమార్ తెరకెక్కించిన చిత్రమిది. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు.. ఇతర అడ్డంకులను దాటుకుంటూ ఎట్టకేలకు చిత్రం త్వరలోనే థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా వెనుక ఉన్న అతిపెద్ద విషాదం .. భావోద్వేగ ప్రయాణం దివంగత నటుడు, నిర్మాత మనోబాలది. ఈ ప్రాజెక్ట్‌ను ఆయన ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి తలపెట్టారు. సినిమా ఎలాగైనా థియేటర్ల వరకు తీసుకురావడానికి చివరి శ్వాస వరకు శ్రమించారు. చిత్రం ఆలస్యం అవుతున్న కొద్దీ మానసిక వేదనకు, ఒత్తిడికి గురయ్యారు. మంచి సినిమాను ప్రేక్షకులకు అందించాలనే ఆయన తపన.. ఆ క్రమంలో ఎదురైన అడ్డంకులు ఆయనపై ఎంతో ప్రభావాన్ని చూపించాయి. అయితే తాజాగా ఈ సినిమా విడుదలకు సంబంధించి లైన్ క్లియర్ అయింది. ఈ చిత్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను పరిష్క రించేందుకు చిత్రబృందం ప్రముఖ ఫైనాన్షియర్ మదురై అన్బుచెలియన్‌ను సంప్రదించింది. దీనిపై స్పందించిన ఆయన మానవీయ కోణంలో ఎలాంటి ముందస్తు డబ్బు ఆశించకుండా సినిమా విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సినిమా థియేటర్ లోకి రావడం... కలెక్షన్లు రావడం ప్రారంభమయ్యాక తన వాటాను నెమ్మదిగా సెటిల్ చేసుకోవచ్చని చెప్పి పెద్ద మనసును చాటుకున్నారు. ఈ చిత్రంలో అరవింద్ స్వామి, త్రిషల కాంబినేషన్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. -తని ఒరువన్- చిత్రంతో విలక్షణ నటనతో సరికొత్త ఇన్నింగ్స్ ప్రారంభించిన అరవింద్ స్వామి.. ఇప్పటికీ క్రేజీ ప్రాజెక్ట్స్‌తో రాణిస్తున్న క్వీన్ త్రిషల స్క్రీన్ ప్రెజెన్స్ ఈ మైండ్ గేమ్ థ్రిల్లర్‌కు పీక్ రేంజ్ హైప్ తీసుకొస్తోంది. మొదటి భాగం తరహాలోనే సమాజంలో జరిగే ఆధునిక మోసాలు, హై-ప్రొఫైల్ స్కామ్‌ల చుట్టూ తిరిగే కథలో ఇద్దరి స్క్రీన్ కెమిస్ట్రీ .. నటన ఎలా ఉండబోతోందా? అని ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ చిత్రానికి ఎన్వీ నిర్మల్ కుమార్ దర్శకత్వం వహించగా పవర్‌ఫుల్ అండ్ ఇంటెలిజెంట్ సినిమాల దర్శకుడు హెచ్. వినోద్ కథ, స్క్రీన్‌ప్లే అందించారు. వినోద్ రాసిన పదునైన సంభాషణలు, మైండ్ బ్లోయింగ్ కన్-డ్రామాలు థియేటర్లలో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

# వ్వాటే పంచ్: సమంత చేసిన పూరీలు ఎలా ఉంటాయో చెప్పిన భర్త!



దశాబ్దాల పాటు తనదైన ప్రత్యేకమైన యాంకరింగ్ శైలితో.. అద్భుతమైన టైమింగ్‌తో సీనియర్ యాంకర్ సుమ కనకాల తెలుగు ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నారు. బుల్లితెరపై ఈ సీనియర్ యాంకర్ సందడి ఎప్పటికీ అల్టిమేట్. ఇప్పుడు సుమ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న -సుమ అండ్ చాట్ షో- సరికొత్త ఇంటర్వ్యూలతో మరోసారి అభిమానుల ముందుకు వచ్చింది. తాజాగా ఈ షోకి -మా ఇంటి బంగారం- చిత్ర బృందం విచ్చేసింది. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకురాలు నందిని రెడ్డితో పాటు అన్యోన్య దంపతులు సమంత, రాజ్ పాల్గొని సందడి చేశారు. సుమ మార్క్ పంచ్‌లు...బంగారం టీమ్ కాంబినేషన్‌తో ఈ ఎపిసోడ్ అంతా నవ్వుల పువ్వులు పూయించింది. ఈ ఇంటర్వ్యూలో భాగంగా సుమ అడిగిన ఆసక్తికరమైన ప్రశ్నలు, దానికి సమంత-రాజ్ జంట ఇచ్చిన సమాధానాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. --సమంత వర్సెస్ రాజ్ : ఎవరు ఉత్తమమో ఎవరికి తెలుసు?-- అనే టాస్క్‌లో భాగంగా సుమ వీరిద్దరితో పాటలు పాడించారు. అలాగే టెన్త్ క్లాస్‌లో 80 శాతం కంటే ఎక్కువ మార్కులు ఎవరికి వచ్చాయి? అని సుమ ప్రశ్నించగా.. సమంత ఏమాత్రం ఆలోచించకుండా రాజ్ వైపు చూపించారు. ఇక ఏదైనా ఎమోషనల్ సీన్ చూస్తే త్వరగా ఎవరు కనెక్ట్ అయి ఏడుస్తారు? అని అడగగా.. రాజ్ వెంటనే -సమంత- వైపే చూపించారు. తాను ఏ ఏ సందర్భాల్లో అంతగా ఎమోషనల్ అవుతుందో సమంత కూడా ఈ షోలో ఓపెన్‌గా వెల్లడించారు. ఇక ఈ ఇంటర్వ్యూలో ఒక టాప్ హైలైట్ సీన్ ఏమిటంటే.. --ఏదైనా ఒక మంచి జోక్ చెప్పండి-- అని సుమ రాజ్‌ను కోరగా.. అతడు ఏమాత్రం తడుముకోకుండా -సమంత చేసిన పూరీలు చాలా బావుంటాయి- అంటూ భార్య వంట గది నైపుణ్యంపై సెటైర్ వేశాడు. రాజ్ వేసిన ఈ కౌంటర్‌తో సమంతతో పాటు యాంకర్ సుమ, దర్శకురాలు నందిని రెడ్డి కూడా నవ్వులు ఆపుకోలేకపోయారు. ఇలా ఎంతో సరదాగా, హుషారుగా సాగిన ఈ ఫుల్ ఎపిసోడ్‌ను --సుమ ఢ చాట్ షో- యూట్యూబ్ ఛానెల్స్‌లో వీక్షించవచ్చు. -మా ఇంటి బంగారం- విశేషాలు ప్రస్తుతం టాలీవుడ్‌లో -మా ఇంటి బంగారం- సినిమాకు సంబంధించిన టీజర్, పోస్టర్లు, సింగిల్స్ ఇలా ప్రతి ఒక్క ప్రమోషనల్ కంటెంట్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో సమంత ప్రధాన పాత్రలో నటిస్తుండగా తన భర్తగా రాజ్ స్క్రిప్టు పరంగా ప్రొడక్షన్ పరంగా సహకారం అందించారు. ఒక ఇంటికి కోడలిగా వెళ్లిన సమంత ఎంతో అమాయకంగా కనిపిస్తూనే.. ఆ ఇంట్లో ఒక సీక్రెట్ ఆపరేషన్‌ను ఎలా నడిపించింది? అన్న ఆసక్తికరమైన లైన్‌తో ఈ సినిమా తెరకెక్కినట్లు తెలుస్తోంది. నటిగా సమంతలోని విలక్షణ నటనను, కామెడీ టైమింగ్‌ను ఈ సినిమా మరోస్థాయికి తీసుకెళ్లనుంది. సమంత, రాజ్‌ల మధ్య కెమిస్ట్రీ కూడా స్క్రీన్‌పై అద్భుతంగా పండబోతోందని ప్రమోషనల్ మెటీరియల్ చూస్తేనే అర్థమవుతోంది.

# చిరు కోసం 'ఫ్యామిలీ మ్యాన్'.. అసలు నిజమిదే..



ఒక కథ ఎవరిని దృష్టిలో పెట్టుకుని రాస్తారో.. చివరకు అది ఎవరి చేతుల్లోకి వెళ్ళి రికార్డులు క్రియేట్ చేస్తుందో ఎవరూ ఊహించలేరు. పాన్ ఇండియా రేంజ్ లో సంచలన విజయం సాధించిన ఫ్యామిలీ మ్యాన్ వెబ్ సిరీస్ విషయంలో కూడా అలాంటి ఆసక్తికరమైన విషయం ఇప్పుడు బయటకు వచ్చింది. ఆ సిరీస్ క్రియేటర్స్ లో ఒకరైన దర్శకుడు రాజ్ నిడిమోరు చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. రాజ్ నిడిమోరు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఫ్యామిలీ మ్యాన్ కథను మొదట వెబ్ సిరీస్ గా కాదు, పూర్తి స్థాయి ఫీచర్ ఫిల్మ్ గా రూపొందించాలని భావించారు. అంతే కాదు, ఆ కథలోని లీడ్ రోల్ ను మెగాస్టార్ చిరంజీవిని దృష్టిలో ఉంచుకుని డెవలప్ చేశారట. మిడిల్ క్లాస్ ఫ్యామిలీకి చెందిన వ్యక్తి.. ఒకవైపు కుటుంబ బాధ్యతలు చూసుకుంటూనే మరోవైపు సీక్రెట్ ఆపరేషన్స్ ను నిర్వహించే వ్యక్తిగా ఆ పాత్రను ఊహించుకున్నట్లు చెప్పారు. అదే సమయంలో చిరంజీవి ఖైదీ నెం.150 మూవీతో రీ ఎంట్రీ ఇచ్చి భారీ విజయాన్ని అందుకున్నారు. అలాంటి స్టేజ్ లో ఇద్దరు పిల్లల తండ్రిగా కనిపించే రోల్ ను ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారన్న పెద్ద డౌట్ వచ్చినట్లు తెలుస్తోంది. కథ నచ్చినప్పటికీ, ఇమేజ్ పరంగా ఆలోచించి ముందుకు వెళ్లలేదని అప్పట్లో వినిపించిన ప్రచారానికి ఇప్పుడు రాజ్ వ్యాఖ్యలు బలం చేకూర్చాయి. కథలో మార్పులు చేయడానికి కూడా దర్శకులు సిద్ధమయ్యారట. ఫ్యామిలీ బ్యాక్ గ్రౌండ్ తగ్గించి, కొన్ని పాత్రల క్యారెక్టరైజేషన్ ను మార్చాలని భావించి నా చివరకు ఆ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లలేదు. దీంతో అదే ఆలోచన ను మరింత ఎలబరేట్ చేసి వెబ్ సిరీస్ రూపంలో తీసు కొచ్చారు. అలా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఫ్యామిలీ మ్యాన్ నేషనల్ వైడ్ గా మంచి రెస్పాన్స్ అందుకుంది. ఆ సిరీస్ విజయానికి ప్రధాన కారణంగా నిలిచిన అంశాల్లో ఒకటి శ్రీకాంత్ తివారీ రోల్. సాధారణ ఫ్యామిలీ పర్సన్ గా కనిపిస్తూ.. కొన్ని పరిస్థితులను ఎదుర్కొనే ఆ పాత్రలో నటుడు మనోజ్ బాజ్ పాయ్ అద్భుతంగా నటించారు. ఆ రోల్ ను ఆయన తప్ప మరెవరితోనూ ఊహించుకోలేని స్థాయిలో ప్రేక్షకుల మదిలో నిలిచిపోయింది. అయితే ఆ కథ చిరంజీవి వరకు వెళ్లిందనే విషయం తెలిసిన తర్వాత అభిమానుల్లో మరో చర్చ మొదలైంది. చిరంజీవి ఆ సమయంలో ఆ కథకు ఓకే చెప్పి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదన్న ప్రశ్న ఆసక్తి రేకెత్తిస్తోంది. ఒకవేళ సినిమాగా తెరకెక్కి ఉ ంటే అదే స్థాయి విజయాన్ని సాధించేదా? లేక వెబ్ సిరీస్ గా మారడమే మంచిది అయిందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇక రాజ్ నిడిమోరు విషయానికి వస్తే.. తిరుపతి బ్యాక్ డ్రాప్ నుంచి వచ్చిన ఆయన, తన ఫ్రెండ్ కృష్ణ డీకేతో కలిసి బాలీవుడ్ లో ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. కొత్త తరహా కథలు, భిన్నమైన కథనాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ఓటీటీ వరల్డ్ లో తనదైన ముద్ర వేశారు.

# పవన్ కళ్యాణ్‌ను ఆడిస్తున్న బిజెపి

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంపై, కాంగ్రెస్ పార్టీపై చేసిన వ్యాఖ్యలపై కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్ కళ్యాణ్ స్వతహాగా మాట్లాడడం లేదన్నారు. కేంద్రంలోని మోడీ, ఇతర బీజేపీ నేతలు కించపరిచేలా స్క్రిప్ట్ ఇస్తే, దాని ప్రకారం పవన్ మాట్లాడుతున్నారు. ఆయన పూర్తిగా బీజేపీ ఆడించే తోలుబొమ్మలా మారిపోయారని దుయ్యబట్టారు. తెలంగాణ ఆవిర్భావాన్ని, రాష్ట్ర విభజనను పవన్ కళ్యాణ్ వ్యతిరేకిస్తూ మాట్లాడటం కొత్తేమీ కాదని, గతంలోనూ మోడీతో సహా బీజేపీ నేతలు ఇదే తరహాలో తెలంగాణను అవమానించారని గుర్తుచేశారు. ఎంతో మంది యువకులు ప్రాణత్యాగం చేస్తే, తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తించి సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని సాకారం చేశారని టీపీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమం జరుగుతున్నప్పుడు పవన్ కళ్యాణ్ ఎక్కడున్నారు? ఏ సినిమాలో నటిస్తున్నారు? అని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించడమంటే సినిమాల్లో డైలాగులు చెప్పినంత సులువు కాదని.. నెహ్రూ, గాంధీ కుటుంబాల త్యాగాల చరిత్రను పవన్ శ్రద్ధగా చదువుకుంటే మంచిదని హితవు పలికారు. ప్రధాని మోడీ ఇవాళ రాకెట్ల ముందు నిలబడి ఫోటోలు దిగుతున్నారంటే, ఆ అంతరిక్ష రంగానికి పునాది వేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తుంచుకోవాలన్నారు. పవన్ కళ్యాణ్ చాలా పెద్ద హీరో కావడానికి తెలంగాణ ప్రజలు కూడా కారణమని, ఇక్కడి ప్రేక్షకులు చూడబట్టే ఆయన సినిమాలు ఆడాయనే విషయాన్ని మరువరాదని మహేష్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్‌కు అక్కడ చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని, వాటిపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో ఇంకా చాలా నేర్చుకోవాల్సి ఉంది. కాంగ్రెస్ గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదు, ఆ విషయంలో ఆయన చాలా చిన్నవాడు. అధికారం ఉందని తెలంగాణ గురించి ఎలా పడితే అలా మాట్లాడితే చూస్తూ ఊరుకోం' అని హెచ్చరించారు. రెండు రాష్ట్రాలు విడిపోయినా అన్నదమ్ములుగా కలిసి ఉండాలని తాము కోరుకుంటున్నామని, కానీ తెలంగాణలో రాజకీయ లబ్ది కోసం ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడటం సరికాదని మహేష్ గౌడ్ అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పాలన సాగుతోందని.. ఏపీ సైతం మన వైపు చూసేలా ఇక్కడ పరిపాలన ఉందన్నారు. అయితే, తెలంగాణను కించపరుస్తూ పవన్ కళ్యాణ్ ఇంతలా మాట్లాడుతున్నా.. బీఆర్ఎస్ నేతలు ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. వీరి మౌనం వెనుక బీజేపీ, బీఆర్ఎస్, పవన్ కళ్యాణ్ మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందం స్పష్టంగా అర్థమవుతోందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు.

## సింగరేణిని ప్రైవేట్ పరం చేసే కుట్రలు

మొదటిపేజీ తరువాయి

ఇస్తూ.. కార్మిక రంగాన్ని మభ్యపెడుతున్నారని విమర్శించారు. సింగరేణి సంస్థను ప్రైవేటీకరించడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. అండర్ గ్రౌండ్ మైన్లను కాపాడుకోవడానికి హెచ్ఎంఎస్‌తో కలిసి పోరాటం చేస్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో, ఆ తర్వాత బిఆర్ఎస్ ప్రభుత్వంలోనూ మనం కలిసి పనిచేశాం. నేను ఎక్కడున్నా అనునిత్యం మీ పక్కనే ఉండి పోరాడాను. గతంలో మెడికల్ బోర్డు కోసం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌ను ముట్టడించిన చరిత్ర మనది. కానీ ఈ ప్రభుత్వంలో.. సర్వసాధారణంగా జరగాల్సిన పనుల కోసం కూడా కార్మికులు రో÷-డఎక్కి పోరాడాల్సి వస్తోంది అంటూ కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ, హైదరాబాద్‌లలో ఉండి సింగరేణికి కొత్త బొగ్గు బావులు తేవాల్సిన సీఎం, డిప్యూటీ సీఎంలు.. ఇక్కడికి వచ్చి కార్మికులకే వినతిపత్రాలు ఇస్తూ మభ్యపెడుతున్నారని కవిత మండిపడ్డారు. ఐటీ సమస్యలను తీర్చడంలో, నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు పెట్టడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఇప్పుడున్న కార్మికుల్లో ఎక్కువ మంది యువకులే ఉన్నారని.. కానీ వారి పిల్లల చదువుల కోసం సరైన స్కూళ్లు, వైద్యం కోసం కార్పొరేట్ ఆసుపత్రులు లేవని కవిత ఆందోళన వ్యక్తం చేశారు.

## తెలంగాణలో మోగిన బడిగంటలు

మొదటిపేజీ తరువాయి

వచ్చింది. తోటి క్లాస్‌మేట్స్ ఎవరూ లేకపోవడంతో ఆ విద్యార్థిని ఒంటరిగానే క్లాస్ రూంలో కూర్చుంది. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ పునఃప్రారంభ తేదీ అమావాస్య రోజు రావడంతో కొందరు అశుభంగా భావిస్తున్నారు. ఈ రోజున కొత్త పనులు, చదువులు ప్రారంభించడం మంచిది కాదని తల్లిదండ్రులు భావిస్తున్నారు. తెల్లవారి పంపుదామంటే మంగళవారం అవుతుండడంతో ఈ రెండు రోజులు పిల్లలను ఇంటి వద్దే ఉంచాలని వారు ఆలోచిస్తున్నారు. దీంతో ఈ రోజుల్లో విద్యార్థుల హాజరు తగ్గే అవకాశం ఉంది. కొన్ని ప్రైవేట్ స్కూళ్లు ముందుగానే అమావాస్యను ఆలోచించి ఈ నెల 17న బుధవారం, 19న శుక్రవారం ప్రారంభించేందుకు నిర్ణయించాయి.

# ఫ్యూచర్ సిటీ కోసం శరవేగంగా అడుగులు

మొదటిపేజీ తరువాయి

ఇందుకోసం గ్లోబల్ టెండర్లను పిలువగా.. ఆరు సంస్థలు టెండర్లలో పాల్గొన్నాయి. అందులో సింగపూర్‌కు చెందిన డీపీ ఆర్కిటెక్ట్స్ అనే సంస్థ లోయెస్ట్ బిడ్డర్‌గా నిలిచిందని సమాచారం. దీంతో ఆ సంస్థకే మాస్టర్ ప్లాన్ తయారీ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించినట్టు సమాచారం. 765 చదరపు కిలోమీటర్ల మేర ఫ్యూచర్ సిటీకి ఆ సంస్థ మాస్టర్ ప్లాన్ తయారు చేయనున్నది. 9 నెలల్లో మాస్టర్ ప్లాన్‌ను తయారు చేసి ఇచ్చేలా సంస్థకు బాధ్యతలు అప్పగించినట్టు అధికారవర్గాలు చెబుతున్నాయి. తొలిదశలో భాగంగా 30 వేల ఎకరాలపై మాస్టర్ ఎ÷-లాన్‌ను సిద్ధం చేయనున్నారు. అందులో భాగంగా వేటికి ఎంత భూమి వినియోగించాలి.. మౌలికవసతుల అవసరాలు, అభివృద్ధి ప్రాధాన్యాలను ప్లాన్‌లో పొందుపరచ నున్నారు. మొత్తంగా 30 వేల ఎకరాల్లో 13 వేల ఎకరాలను మౌలికవసతులు, పారిశ్రామిక అవసరాల అభివృద్ధికి వాడుకోబోతున్నారు. డెవలప్‌మెంట్‌లో భాగంగా లైఫ్‌సైన్సెస్, ఎలక్ట్రానిక్స్ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలుస్తున్నది. 13 వేల ఎకరాల్లో సింహభాగం లైఫ్?సైన్సెస్‌కు కేటాయించనున్నారు. 4 వేల ఎకరాల్లో లైఫ్‌సైన్సెస్ హాబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఆ తర్వాత 2,177 ఎకరాల్లోఎలక్ట్రానిక్స్ అండ్? అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్? జోన్‌ను అభివృద్ధి చేస్తారని తెలుస్తున్నది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ వెహికల్స్‌కు ట్రెండ్, డిమాండ్ పెరగడంతో దానికీ ప్రాధాన్యం ఇచ్చారు. ఎలక్ట్రిక్ వెహికల్స్, ఎనర్జీ పార్క్ కోసం దాదాపు 2 వేల ఎకరాలు కేటాయించినట్టు తెలిసింది. ఏఐ సిటీ కోసం 400 ఎకరాలు, డేటా సెంటర్ హబ్ కోసం 310 ఎకరాలు, హెల్త్ సిటీకి 594 ఎకరాలు, ఎడ్యుకేషన్ అండ్ యూనివర్సిటీ డిస్ట్రిక్ట్ కోసం 255 ఎకరాల కేటాయింపులు చేసినట్టు చెబుతున్నారు. వాటితోపాటు రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌ల అభివృద్ధి కోసం 2,477 ఎకరాలను కేటాయించారు. మిక్స్‌డ్‌యూజ్‌పర్పస్‌లో ఎంటర్‌టైన్‌మెంట్, స్పోర్ట్స్, ఫర్నీచర్? మాన్యుఫ్యాక్చరింగ్‌కు కూడా భూములు కేటాయించినట్టు చెబుతున్నారు. ట్రాన్స్‌పోర్ట్ కారిడార్లు, యుటిలిటీ నెట్‌వర్క్స్, సోషల్? ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వాణిజ్య ప్రాంతాలు, పర్యావరణ పరిరక్షణ ప్రాంతాలను మాస్టర్ ప్లాన్‌లో పొందు పరచనున్నారు. ప్రస్తుతం ఎఫ్?సీడీఏ ప్రాంతం వివిధ హద్దుల్లోకి వస్తున్నది. ఉత్తర భాగంలోని కొన్ని ప్రాంతాలు హెచ్ఎండీఏ, మధ్యభాగంలో హైదరాబాద్ ఫార్మా సిటీ ఏరియా ఉంటున్నది. దక్షిణ భాగం గ్రామీణ ప్రాంతాలే ఉన్నాయని చెబుతున్నారు. ప్లాన్ ప్రకారం సిటీ అభివృద్ధిపై సమగ్ర ప్రణాళికను పొందుపరుస్తారని అధికారులు చెబుతున్నారు.

## డిమాండ్ ఉన్న వరి వంగడాలకే ప్రోత్సాహం

మొదటిపేజీ తరువాయి

అన్నారు. కేబినెట్ సబ్ కమిటీకి వ్యవసాయ నిపుణుల కీలక సూచనలు చేశారని తెలిపారు. ఆ 8 రకాల వంగడాలతోనే రైతులకు లాభాలు వస్తాయని వివరించారు. మార్కెట్ డిమాండ్ ఉన్న వరి రకాల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఆదరణ ఉన్న బియ్యం ఉత్పత్తిని పెంచాలని సూచించారు. రైతుల ఆదాయం పెంచే పంటల సాగును ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. గ్రామస్థాయిలో రైతులకు చైతన్య సదస్సులు నిర్వహించాలని సూచించారు. రైతులకు మార్కెట్ ఆధారిత పంటల సాగుపై మార్గనిర్దేశర చేయాలని నిర్ణయించామని అన్నారు. డిమాండ్ లేని వరి రకాల సాగును క్రమంగా తగ్గించాలని చెప్పారు. వినియోగదారులు, మిల్లర్లు కోరుకునే వరి రకాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎగుమతులకు అనుకూలమైన నిర్దిష్ట వరి రకాల సాగు విస్తరణపై దృష్టి పెట్టాలని భట్టి విక్రమార్క మార్గనిర్దేశం చేశారు. వానాకాలం సాగుపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు పక్రియను కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. రైతులకు నష్టాలు రాకుండా మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల ప్రణాళిక చేపట్టాలని సూచించారు. నాణ్యమైన బియ్యం ఉత్పత్తి, నిల్వ, మార్కెటింగ్ వ్యవస్థలను బలోపేతం చేయాలని నిర్ణయించామని చెప్పారు. రైతులకు లాభదాయకమైన, ఎగుమతి అవకాశాలు ఉన్న వంగడాలపై ప్రత్యేక ప్రోత్సాహకాలని పరిశీలించాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు, నిల్వ నదుపాయాలపై నిరంతర నమీక్షా నమావేశాలు కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. తెలంగాణను అధిక విలువ కలిగిన వరి ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు చేపట్టాలని నిర్దేశిరచారు. రైతు ఆదాయం పెంపు, మార్కెట్ అనుసంధానానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించామని అన్నారు. రైతులకు మెరుగైన ధరలు వచ్చేలా మార్కెట్ డిమాండ్ ఆధారిత వ్యవసాయ విధానాన్ని అమలు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు.

## ధాన్యం సేకరణలో కేంద్రం ప్రేక్షకపాత్ర

మొదటిపేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం కేవలం మద్దతు ధరను ప్రకటించి, ఆ తర్వాత కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకుంటోందని ఆయన ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకే రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, అలా నిబంధనల ప్రకారం నడుచుకుంటున్నా కూడా ఎందుకు తమపై ఇంత వివక్ష అని మంత్రి తుమ్మల ప్రశ్నించారు. మద్దతు ధర ప్రకటించిన అన్ని రకాల ధాన్యాలనూ సేకరించాల్సిన ప్రాథమిక బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పుకొంటూ, రాష్ట్ర రైతాంగాన్ని, ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. కేంద్రం చేతులెత్తేసినా రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనకాడలేదని, ఇప్పటికే 15 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నతో పాటు, 2 లక్షల మెట్రిక్ టన్నుల జొన్నలను రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా కొనుగోలు చేసిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ఈ ధాన్యం మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా తీసుకోవాలని మంత్రి తుమ్మల డిమాండ్ చేశారు. కేంద్రం కొనుగోలు చేయకపోయినా రాష్ట్ర ప్రభుత్వం రూ.4,000 కోట్లతో మొక్కజొన్న సేకరణ చేపట్టిందన్నారు. జొన్న కొనుగోలుకు రూ.1100 కోట్లతో ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మొక్కజొన్న, జొన్నలను వెంటనే పీఎస్ఎస్ పరిధిలోకి తీసుకురావాలన్నారు. పిఎస్ఎస్ స్కీంలో ఉన్న శనగ, పొద్దుతిరుగుడు పంటలపై 25శాతం సీలింగ్ పరిమితిని 50 శాతంకు వెంటనే పెంచాలని మంత్రి డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల రైతులు ఇబ్బంది పడుతున్న కేంద్రం నుంచి ఎటువంటి సమాధానం లేదని విమర్శించిన మంత్రి తుమ్మల, రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతులు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు రైతుల నుండి 9.57 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న సేకరించినట్లు మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయకపోయినా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్వంత నిధులతో రూ.4,000 కోట్ల వ్యయంతో మొక్కజొన్న కొనుగోలు చేపట్టిందన్నారు. అదేవిధంగా, రాష్ట్రంలో సాగవుతున్న జొన్న పంటను కూడా రూ.1,000 కోట్లతో సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి వెల్లడించారు. సేకరించిన మొక్కజొన్న నిల్వ కోసం మొత్తం 15.07 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములు అవసరమవుతున్నాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 11.40 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం మాత్రమే అందుబాటులో ఉందని, దీంతో ఇంకా 3.29 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు నిల్వ సామర్థ్యం అత్యవసరంగా అవసరమని పేర్కొన్నారు. ఈ మేరకు అదనపు గోదాములను వెంటనే గుర్తించి, అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. మొక్కజొన్న కొనుగోళ్ల కోసం మొత్తం 3 కోట్ల గన్ని బ్యాగులు అవసరమవుతుండగా, ఇప్పటివరకు 2 కోట్ల గన్ని బ్యాగులు సరఫరా చేసినట్లు తెలిపారు. మిగిలిన ఒక కోటి గన్ని బ్యాగులు వెంటనే అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో అప్‌లోడింగ్ పాయింట్ల వద్ద హమాలీల కొరత లేకుండా చూడాలని మంత్రి స్పష్టం చేశారు. రైతులు తీసుకొచ్చిన పంటను ఆలస్యం లేకుండా బరువు తూచి, గోదాములకు తరలించేందుకు తగిన సంఖ్యలో లారీలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుండి గోదాములకు పంట తరలింపులో ఎటువంటి ఆటంకాలు లేకుండా సమన్వయంతో పనిచేయాలని వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులకు సూచించారు. మొక్కజొన్న, జొన్న పంటలను కేంద్ర ప్రభుత్వ ధర మద్దతు పథకం పరిధిలోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి స్పందన రాలేదని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నా కేంద్రం స్పందించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రస్తుతం పీఎస్ఎస్ పరిధిలో ఉన్న శనగ, పొద్దుతిరుగుడు పంటల కొనుగోలుపై అమలులో ఉన్న 25 శాతం సీలింగ్‌ను వెంటనే 50 శాతానికి పెంచాలని మంత్రి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ మంత్రికి మరోసారి లేఖ రాస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు రాష్ట్ర రైతుల సమస్యలను కేంద్ర దృష్టికి తీసుకెళ్లి, శనగ, పొద్దుతిరుగుడు కొనుగోలు పరిమితిని 50 శాతానికి పెంచించడంతో పాటు, మొక్కజొన్న, జొన్నలను పీఎస్ఎస్‌లో చేర్చేలా కృషి చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం, వారి కష్టానికి తగిన ప్రతిఫలం అందించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆ బాధ్యతల నుండి కేంద్ర ప్రభుత్వం తప్పుకుని పనిచేస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రైతు సంక్షేమమే పరమావధిగా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు పక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతోందని స్పష్టం చేశారు.

# ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికతో ప్రజలకు చేరువయ్యాం

మొదటిపేజీ తరువాయి

కార్యక్రమాలపై సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. విభాగాల వారీగా చేపట్టిన కార్యక్రమాలు, వాటి ద్వారా వచ్చిన ఫలితాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా అన్ని విభాగాలు తాము జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు చేపట్టిన కార్యక్రమాల వివరాల నివేదికలను సమర్పించాయి. 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో చురుగ్గా పాల్గొన్న విభాగాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. ప్రధాన కార్యదర్శుల నుంచి జిల్లా కలెక్టర్ వరకు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతినెలా క్షేత్రస్థాయికి వెళ్లాలని గతంలోనే ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లని అధికారులు, జిల్లా కలెక్టర్లపై తనకు నివేదిక ఇవ్వాలని చీఫ్ సెక్రటరీని సీఎం ఆదేశించారు. వారిపై క్రమశిక్షణా ఉల్లంఘన చర్యలు ఎందుకు తీసుకోకూడదో.. వెంటనే వివరణ కోరాలని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించని అధికారులను ఉపేక్షించవద్దని హెచ్చరించారు. ఇప్పటికీ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ భవనాలు లేని గ్రామాలుంటే.. వెంటనే ఆ జాబితాను సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ అధికారులను సీఎం ఆదేశించారు. అక్కడ కొత్తగా గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలను కూడా చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. అన్ని పాఠశాలల భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యా, వైద్య విభాగాల్లో అన్ని స్థాయిల్లో ఫేషియల్ రికగ్నిషన్ విధానం అమలు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పాఠశాలల నుంచి కాలేజీల వరకు, పీహెచ్ సీ నుంచి ఉస్మానియా, గాంధీ ఆసుపత్రి వరకు ఉద్యోగులందరికీ ఇదే అటెండన్స్ విధానం పాటించాలన్నారు. రాష్ట్రస్థాయిలో 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష నిర్వహించినట్లే.. జిల్లాల వారీగా వెంటనే ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై వెంటనే సమీక్ష జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమీక్షలకు రాష్ట్ర స్థాయి నుంచి ప్రతి జిల్లాకో సీనియర్ ఐఏఎస్ అధికారిని స్పెషల్ ఆఫీసర్ గా నియమించి, ఆ జిల్లాకు పంపించాలని చెప్పారు. స్పెషలాఫీసర్ ఆ జిల్లా కలెక్టర్ కలిసి అన్ని విభాగాల్లో 99 రోజుల పాటు జరిగిన ప్రత్యేక కార్యక్రమాలు, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, వివిధ పథకాలపై వచ్చిన స్పందనలన్నింటినీ సమీక్షించాలని ఆదేశించారు. జిల్లాల వారీగా ఈ ప్రగతి నివేదికలను విడుదల చేయాలని చెప్పారు. జిల్లాలతో పాటు నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుకున్న లబ్దిదారులు, ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వీటిని డ్యాష్ బోర్డులో అందుబాటులో ఉంచాలని చెప్పారు. తాను ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత జిల్లాల పర్యటనలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సీఎం అధికారులను ఆరా తీశారు. నియోజకవర్గాల వారీగా ముఖ్యమంత్రి హామీల పురోగతిపై నివేదిక ఇవ్వాలని ప్లానింగ్ విభాగాన్ని ఆదేశించారు. ÷ూజ్యసభ ఎంపీ వేంనరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రితో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## తెలంగాణ వ్యాప్తంగా 'బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్' పథకం

మొదటిపేజీ తరువాయి

అందిస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించే విధంగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. వారంలో 6 రోజులు మంచి బ్రేక్‌ఫాస్ట్ పాలు, రాగి జావాను అందిస్తున్నామని.. దాదాపు రూ.800 కోట్ల వ్యయంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతు న్నట్లు చెప్పారు. విద్యార్థులను ప్రైవేట్ స్కూళ్ల నుంచి ప్రభుత్వ స్కూళ్లకు పంపించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించా రు. ప్రభుత్వ స్కూల్లో చదివితేనే ప్రభుత్వ పథకాలు అందుతాయనే రోజులు రానున్నాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రభుత్వ పథకాలు కావాలి కానీ ప్రభుత్వ ఆసుపత్రులు, స్కూల్ వద్దు అనే భావన ఉందన్నారు. దాన్ని తొలగించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు రూ.800 కోట్లతో ఈ పథకాన్ని ప్రారంభించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కలెక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

# మెట్రో విస్తరణకు మోకాలొడ్డిన కిషన్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

ఇస్తే శాలువా కప్పి ఆయనను సన్మానిస్తామని తెలిపారు. కిషన్‌రెడ్డిని కేసీఆర్ తిట్టినట్లు తాను తిట్టలేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ డైరెక్షన్‌లోనే కేంద్రమంత్రి పనిచేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు లొంగిపోయి కిషన్‌రెడ్డే అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ఆయన వెనుక కేటీఆర్ ఉన్నారని ఆరోపించారు. కేటీఆర్ కుట్రలకు కేంద్రమంత్రి సహకరిస్తున్నారని ఆక్షేపించారు. కేటీఆర్ కుట్రలు చేస్తుంటే.. కిషన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కిషన్‌రెడ్డికి అంత తెలివిలేదని.. కేటీఆర్ చెప్పిందే చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మెట్రోలో ప్రయాణించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచిస్తున్నారని తెలిపారు. ప్రధాని సూచనలను తాము అమలు చేయాలని చూస్తుంటే.. ఆయన ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఫేజ్-1ను కేంద్రం స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఫేజ్-2 నిర్మించుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు. అహ్మదాబాద్ మెట్రోకు అనుమతులు, నిధులు వచ్చాయని ప్రస్తావించారు. హైదరాబాద్‌కు మాత్రం అనుమతులు, నిధులు ఎందుకు రావట్లేదని ప్రశ్నించారు. విశాఖపట్నం మెట్రో నిర్మాణానికి కూడా అనుమతి ఇచ్చారని తెలిపారు. తెలంగాణపై కేంద్రానికి ఎంత వివక్ష ఉందో ఈ విషయంలో అర్థమవుతోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మెట్రో రైలు నిర్మాణంలో హైదరాబాద్ కంటే ఇతర నగరాలు ముందున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. మొదటి దశలో రూ.15 వేల కోట్లతో పూర్తి కావాల్సిన మెట్రో రైలు నిర్మాణ వ్యయం రూ.22 వేల కోట్లకు పెరిగిందన్నారు. కేసీఆర్ పాలనలో ప్రజలు ప్రయాణించాల్సిన ప్రాంతాల్లో మెట్రో విస్తరణ జరగలేదని విమర్శించారు. సెకండ్ ఫేజ్‌లో మెట్రో విస్తరణ అనుమతి కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చామన్నారు. అయితే, ఏడాదికి రూ.400 కోట్ల నష్టం వస్తుందని ఎల్అండ్‌టీ చెప్పిందని, ఆర్థిక ఇబ్బందుల వల్ల మెట్రో విస్తరణకు ఆ సంస్థ ఒప్పుకోవట్లేదని వివరించారు. రూ.30వేల కోట్ల ఎల్అండ్‌టీ ఆస్తుల్ని రూ.15వేల కోట్లకు ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఎల్అండ్‌టీకి రూ.13,600 కోట్ల అప్పు ఉంది. ఐఆర్ఎఫ్‌సీ నుంచి ఎల్అండ్‌టీకి రూ.13,600 కోట్ల రుణాలు ఇప్పించాం. ఆ మొత్తానికి 4 శాతం వడ్డీగా రుణం ఇప్పించాం. రేవంత్‌రెడ్డిని తేలికగా పని చేయిస్తే.. తెలంగాణలో భాజపాకి ఇబ్బందులు వస్తాయని సహచర కేంద్రమంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, అశ్వినీ వైష్ణవ్‌కు కిషన్‌రెడ్డి చెప్పారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చినా.. లోన్ డబ్బులు ఎల్అండ్‌టీకి ట్రాన్స్‌ఫర్ కాలేదన్నారు. ఐఆర్ఎఫ్‌సీ లోన్ మంజూరు చేయకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారు. తెలంగాణ నుంచి కేంద్ర క్యాబినెట్‌లో ఉన్న కిషన్‌రెడ్డికి నగరాన్ని అభివృద్ధి చేసే బాధ్యత లేదా అని ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్ కలిసి ఆయన మెట్రో ఫేజ్-2ను అడ్డుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపాకు కేసీఆర్ సహకరించినందుకు కిషన్‌రెడ్డి గురుదక్షిణ చెల్లిస్తున్నారు. అహ్మదాబాద్, విశాఖ మెట్రోలకు అనుమతులిచ్చి హైదరాబాద్‌కు ఆపారు. తెలంగాణపై కేంద్రం వివక్ష కొనసాగిస్తోంది. కచ్చితంగా కేంద్ర ప్రభుత్వం వద్దే మెట్రో ఫేజ్-2 ఆగింది. హైదరాబాద్‌కు 2023లోనే ట్రిపుల్ ఆర్‌ను కేంద్రం ప్రకటించింది. అది ఇంకా సాకారం కాలేదు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ హామీ ఇచ్చి నెరవేర్చలేదు. ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని అన్నారు. అన్నింటికీ బాధ్యత వహిస్తూ మోదీ

రాజీనామా చేస్తే.. మేమూ చేస్తాం అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేస్తారా? అంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్ విసరగా, సవాల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్టాం÷-రగ్ కౌంటర్ ఇచ్చారు. 'మోదీ హామీల లెక్క తేల్చండి.. ఆ తర్వాత నా రాజీనామా గురించి మాట్లాడండి' అంటూ ప్రతి సవాల్ విసిరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ముందుగా సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. దేశ ప్రజలకు ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, విదేశాల్లోని నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రతి భారతీయుడి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని మోదీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ హామీలు ఎంతవరకు అమలయ్యాయో దేశ ప్రజలకు స్పష్టత ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. రెండు కోట్ల ఉద్యోగాల కల్పన, ప్రతి ఖాతాలో రూ.15 లక్షల జమ వంటి కీలక హామీలు నెరవేర్చకపోయినా వాటిపై ఎవరూ ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. తన ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న కిషన్‌రెడ్డి ముందుగా వీటికి సమాధాని చెప్పాలని నిలదీశారు. ఎన్నికల హామీలు అమలు కాలేదనే కారణంతో ప్రధాని మోదీ తన పదవికి రాజీనామా చేయడానికి సిద్ధపడితే, తాను కూడా తన కేబినెట్‌ను రద్దు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని సీఎం స్పష్టం చేశారు.

## అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందం

మొదటిపేజీ తరువాయి

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడింది. ఎన్నో దేశాల్లో ప్రాణనష్టం వాటిల్లింది. ఈ యుద్ధాన్ని ముగించేలా అమెరికా, ఇరాన్ అంగీకారం కుదుర్చుకోవడం స్వాగతించే విషయం. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వాలను పునరుద్ధరించడం, స్వేచ్ఛా నౌకాయానం, వాణిజ్యానికి భరోసా కల్పించడంలో ఈ పరిణామం సాయపడుతుందని భారత్ విశ్వ సిస్తోంది. సుస్థిరమైన తుది ఒప్పందానికి దారితీసేలా.. మిగిలిన అంశాల పైనా సానుకూల చర్చలు జరుగుతాయని విశ్వసిస్తు న్నాం అని మోదీ రాసుకొచ్చారు. పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించేలా ఇరాన్‌తో ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షు డు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీన్ని టెహ్రాన్ కూడా ధ్రువీకరించింది. దీనిపై స్విట్జర్లాండ్ వేదికగా జూన్ 19న ఇరుదేశాలు సంతకాలు చేయనున్నాయి. హర్మూజ్‌లో అమెరికా నౌకాదళ దిగ్బంధాన్ని తొలగించడం, ఈ జలసంధిని పూర్తిగా తెరవడం, ఇరాన్ చమురుపై ఆంక్షలు తదితర అంశాలపై ఇరుదేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలిసింది.

## చిన్నారిపై కోతుల మంద దాడి

మొదటిపేజీ తరువాయి

చిన్నారి అన్విక కేకలు విని వెంటనే తల్లి కోతులను తరిమికొట్టింది . కోతుల దాడిలో అంవికకు తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారిని ఆసుపత్రికి తరలిం చి చికిత్స అందిస్తున్నారు. గ్రామంలో కోతులు, కుక్కల బెడదతో భయాందోళనకు గురవుతున్నామని అంటున్నారు గ్రామస్తులు. కోతుల సమస్యపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు గ్రామస్తులు. చిన్నారులు బయట ఆడుకోవాలంటే భయపడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# కేటీకే-5 ఇంక్లైన్ ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలి

**- కార్మికుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలి - ఎస్‌సీఎంకేఎస్ అధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్.- గాయపడిన షాట్ ఫైరర్‌కు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, జూన్ 15:భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-5 ఇంక్లైన్ గనిలో సోమవారం జరిగిన ప్రమాద ఘటనపై సమగ్ర, పారదర్శక విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని సింగరేణి కాలరీస్ మజ్దూర్ సంఘ్ (ఎస్‌సీఎంకేఎస్) అధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కార్మికుల ప్రాణ భద్రతకు మించినది ఏదీ కాదని సింగరేణి యాజమాన్యం గుర్తుంచుకోవాలని ఆయన సూచించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫ్రీ షిఫ్ట్ సమయంలో ఎలక్ట్రానిక్ డిటోనేటర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతున్న క్రమంలో బ్లాస్టింగ్‌కు సంబంధించిన ప్రమాదం చోటుచేసుకోవడం ఆందోళన కలిగించిందన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన షాట్ ఫైరర్‌కు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఘటనపై సింగరేణి యాజమాన్యం ఉన్నత స్థాయి విచారణ నిర్వహించి ప్రమాదానికి దారితీసిన కారణాలను అధికారికంగా వెల్లడించాలని కోరారు. ఇటీవల సింగరేణిలో ఎలక్ట్రానిక్ డిటోనేటర్ల వినియోగాన్ని విస్తరించే చర్యలు జరుగుతున్న నేపథ్యంలో కార్మికుల్లో భద్రతాపరమైన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేసే ముందు భూగర్భ గనుల ప్రత్యేక పరిస్థితులు, భద్రతా ప్రమాణాలు, కార్మికుల అనుభవాలను పరిగణనలోకి తీసుకోవడం అత్యంత అవసరమని ఆయన అన్నారు. దశాబ్దాలుగా వినియోగిస్తున్న ఎలక్ట్రికల్ డిటోనేటర్ల పద్ధతిపై కార్మికులకు విస్తృత అనుభవం ఉందని, అన్ని భద్రతా అంశాలను సమగ్రంగా పరిశీలించకుండా కొత్త విధానాలను అమలు చేయడం పట్ల గుర్తింపు సంఘాలు, కార్మిక ప్రతినిధి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. కేటీకే-5 ఘటనపై స్వతంత్ర లేదా న్యాయపరమైన విచారణ జరపాలని, ప్రమాదానికి గల కారణాలను అధికారికంగా వెల్లడించాలని, గాయపడిన కార్మికుడికి మెరుగైన వైద్యం అందించాలని, భద్రతా సమీక్ష పూర్తయ్యే వరకు ఎలక్ట్రానిక్ డిటోనేటర్ల వినియోగంపై పునరాలోచన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మిక సంఘాలతో సంప్రదింపులు జరిపిన తర్వాతే తదుపరి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సింగరేణి అభివృద్ధి ఎంత ముఖ్యమో, కార్మికుల ప్రాణ భద్రత అంతకంటే ముఖ్యమని పేర్కొన్న అప్పాని శ్రీనివాస్, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన భద్రతా చర్యలు చేపట్టాలని యాజమాన్యాన్ని కోరారు. ఇంకా ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వెలబోయిన సుజేందర్, కేంద్ర కమిటీ సభ్యులు పంద్రాల మల్లయ్య, రాసకట్ల నర్సింగరావు, కాదారి శంకర్, డి. నారాయణ, పని రమేష్, ఓరం లక్ష్మణ్, కొత్తూరి మల్లేష్, కటకం శ్రీనివాస్, అల్లం శ్రీనివాస్, పునీత్ రావు, చిట్యాల ప్రవీణ్, రాజు నాయక్, దేవర సమ్మయ్యతో పాటు పలువురు కార్మికులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘట్‌కేసర్ ఆర్ఓబీ పనులను వెంటనే ప్రారంభించాలి



**- 17 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుపై బీజేపీ నిరసన**

**- ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారాలు మానుకోవాలి**

**- బీజేపీ నాయకుడు ఏనుగు సుదర్శన్ రెడ్డి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఘట్‌కేసర్, జూన్ 15 : ఘట్‌కేసర్‌లో 17 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఘట్‌కేసర్ బైపాస్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఘట్‌కేసర్ 6వ డివిజన్ అధ్యక్షుడు కొమ్మిడి మహిపాల్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ నాయకుడు ఏనుగు సుదర్శన్ రెడ్డి, ఆర్ఓబీ నిర్మాణ పనుల పురోగతిపై కాంట్రాక్టర్ సత్తిరెడ్డితో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే పూర్తయిన పనులకు సంబంధించిన సుమారు 20 శాతం బిల్లులు ప్రభుత్వం నుంచి విడుదల కాలేదని, ప్రాజెక్టు పూర్తికి మరో రూ.6 కోట్లకు పైగా నిధులు అవసరమని కాంట్రాక్టర్ తెలిపినట్లు వెల్లడించారు. అవసరమైన నిధులు సమయానికి విడుదలైతే 2026 డిసెంబర్ నాటికి పనులు పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్ఓబీ పనుల విషయంలో కాంగ్రెస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పనులు పూర్తికాకముందే పూర్తయినట్లుగా ప్రచారం చేయడం, ముఖ్యమంత్రి ఫోటోలకు పాలాభిషేకాలు నిర్వహించడం ప్రజలను మభ్యపెట్టే చర్య అని విమర్శించారు. కేవలం రూ.4 కోట్లు వస్తే పనులు పూర్తవుతాయని, నిధులు ఇప్పటికే విడుదలయ్యాయని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ప్రచారం వాస్తవాలకు విరుద్ధమని ఆరోపించారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన కీలక అంశాలపై రాజకీయ ప్రయోజనాల కోసం అసత్య ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు. ఘట్‌కేసర్ ప్రజల సమస్యలను రాజకీయ కోణంలో కాకుండా ప్రజా ప్రయోజనాల దృష్ట్యా పరిష్కరించాలని, ఆర్ఓబీ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయడమే అన్ని రాజకీయ పార్టీల లక్ష్యంగా ఉండాలని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే మరింత ఉద్ధృతంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పడిగెం వీరేశం, పసులాది చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి చెల్లక శ్రీధర్, యువ మోర్చా అధ్యక్షుడు కొమ్మిడి విక్రాంత్ రెడ్డి, ఓబీసీ మోర్చా నాయకుడు బాల నరసింహ, కిసాన్ మోర్చా నాయకుడు కట్ట మధుసూదన్ రెడ్డి, యువ మోర్చా ఉపాధ్యక్షుడు సురుప అనిల్ గౌడ్, సీనియర్ నాయకులు బండ్లగూడెం కిషోర్ గౌడ్, లంబ పవన్ యాదవ్, బూత్ అధ్యక్షులు మమత శర్మ, శ్యామ్ రెడ్డి, సాయి గౌడ్, తేజావత్ సుదీర్, కల్లెం మహేష్ గౌడ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

**- మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, జూన్ 15 : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులు భాగంగా జూన్ 15 నుండి ఈనెల 20వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన వంట కార్మికుల సమస్యల పరిష్కార నిమిత్తం ప్రధానోపాధ్యాయులకు సర్పంచ్ లకు,పంచాయతీ కార్యదర్శులకు జిల్లాలోని మదనపల్లి,పత్తిపల్లి గ్రామాలలో స్వయంగా పాల్గొని వినతి పత్రాలు అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని 54 వేల రెండు వందల మంది వంట కార్మికులు,అనేకమైన ఇబ్బందులకు గురవుతున్న సందర్భంలో రాష్ట్ర వ్యాప్తంగా వినతి పత్రాలు అందజేసి మన బాధలు తెలియజేయాలనే లక్ష్యంతో ప్రారంభించిన పథకం ఈనెల 20వ తారీకు వరకు కొనసాగుతుంది అన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ప్రధానోపాధ్యాయులు, సర్పంచులు స్పందించి వారి వల్ల అయ్యే కార్యక్రమాలను పరిశీలించాలని అలాగే జిల్లా అధికారులకు ఈ వినతి పత్రాలు పంపించాలని కోరడం జరిగిందని 20 సంవత్సరాలుగా ఈ పథకంలో కొనసాగుతూ జీవిస్తున్న వంట కార్మికులను అకారణంగా చిన్నచిన్న రాజకీయ కారణాలతో డ్వాక్రా గ్రూపుల పేరుతోని,కొంతమంది ప్రధానోపాధ్యాయులు కూడా వారి అనుయాలను పెట్టుకోవడం కోసం 20 సంవత్సరాల కొనసాగుతున్న వారిని తొలగించడానికి కూడా వెనుకాడడం లేదు అన్నారు. ఎవరిని తొలగించకుండా ఉండాలని లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది అన్నారు.మెనూ చార్జీలు అతి తక్కువగా ఇచ్చి మెనూ ప్రకారం వంటలు చేయాలని ఒత్తిడి చేస్తే ఎలా సాధ్యం అవుతుందని ఆలోచించాలని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం రూపాయలు 10000 వేతనాలు వెంటనే చెల్లించాలని,సరుకులు మొత్తం ప్రభుత్వమే సరఫరా చేయాలని,అధికారులు వంట కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మురహరి రాము,సోమిడి అరుణ,పొన్నాల లలిత,సారా సారమ్మ,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు సమర్పించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఖమ్మం, జూన్ 15 : ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ఆయన ప్రజల అర్జీలను స్వీకరించారు. ఎర్రుపాలెం మండలం మీనవోలు గ్రామానికి చెందిన కాంగ్రెస్ ఆర్గనైజర్ సాగుర్తి ఫిలిప్, సర్వే నంబర్లు 188, 190, 119లో వ్యవసాయం చేస్తున్న ఎస్సీ, ఎస్టీ రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని కోరగా, సంబంధిత అధికారులకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఖమ్మం నగరం 32వ వార్డు బొక్కలగడ్డకు చెందిన టి. ఉమారాణి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేయగా, పీడీ హౌసింగ్‌కు పంపించారు. కొణిజర్ల మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన కె. రమేష్‌బాబు తన వ్యవసాయ భూమికి సాగునీటి కాలువ ఆక్రమణ తొలగించి నీటి సౌకర్యం కల్పించాలని కోరగా, తహసీల్దార్‌కు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఖమ్మం మోతీనగర్‌కు చెందిన కే. వెంకటకృష్ణ మిషన్ భగీరథ పైప్‌లైన్, రోడ్డు, డ్రైనేజీ సమస్యల పరిష్కారం కోరగా, సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచనలు జారీ చేశారు. సింగరేణి మండలం బొక్కలతండాకు చెందిన ఏ. రామారావు ఇంటి స్థలంలో ఉన్న రెండు విద్యుత్ స్తంభాలను తొలగించాలని కోరగా, టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కాటారం కేజీబీవీలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**- అర్హులైన అభ్యర్థులు జూన్ 18లోగా దరఖాస్తులు సమర్పించాలి: ప్రిన్సిపాల్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కాటారం, జూన్ 15 : జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రం లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చల్ల సునీత తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సోషల్ సబ్జెక్ట్ బోధించేందుకు, అలాగే ఇంటర్మీడియట్ విద్యార్థులకు గణితశాస్త్రం బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీలను తాత్కాలిక ప్రాతిపదికన నియమించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 16 నుంచి 18వ తేదీ లోపు తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. సంబంధిత సబ్జెక్టులో పీజీతో పాటు బి.ఎడ్ పూర్తి చేసి, టెట్ అర్హత సాధించిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. విద్యారంగంలో సేవలందించాలని ఆసక్తి ఉన్న అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ చల్ల సునీత కోరారు. నియామకానికి సంబంధించిన పూర్తి వివరాలు కేజీబీవీ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**- గుర్తు తెలియని వాహనం ఢీకొని ఘటన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మణుగూరు, జూన్ 15 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా మణుగూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం రాత్రి పట్టణంలోని సురక్ష బస్ స్టాండ్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, మణుగూరులోని శివలింగాపురం ప్రాంతానికి చెందిన యదల మరియమ్మ (55) రాత్రి సుమారు 10.40 గంటల సమయంలో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి అక్కడి నుంచి వెళ్లిపోయింది. ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడగా, చికిత్స అందించేలోపే మృతి చెందినట్లు సమాచారం. మృతురాలి చిన్న కుమార్తె గొర్రె నర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మణుగూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన వాహనం, దాని డ్రైవర్‌ను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# గ్రామ సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్‌ను ఆశ్రయించిన యువకుడు

**పాండురంగాపురంలో డ్రైనేజీ, రహదారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినతి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పాల్వంచ, జూన్ 15 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పాండురంగా పురం గ్రామంలో వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించాలని కోరుతూ గ్రామానికి చెందిన యువకుడు ముత్యాల వెంకటేష్ జిల్లా కలెక్టర్ అంకిత్‌కు వినతిపత్రం సమర్పించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి గ్రామంలోని ప్రధాన సమస్యలను ఆయన వివరించారు. గ్రామంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రతి వర్షాకాలంలో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోతుందని, దీంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడంలో ఇబ్బందులు పడుతున్నారని, గర్భిణీలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. బైకులు, ఇతర వాహనాలు, అత్యవసర సేవల వాహనాలు గ్రామంలోకి చేరుకోవడంలో కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిల్వ నీటి కారణంగా దోమలు పెరిగి గ్రామ ప్రజలు వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు గురవుతున్నా రని తెలిపారు. ఈ సమస్యలపై ఇప్పటికే గ్రామ సర్పంచ్, ఎంపీడీవోతో పాటు సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం, దెబ్బతిన్న రహదారుల మరమ్మత్తులకు నిధులు మంజూరు చేసి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు.




# ఫిర్యాదులపై తక్షణ స్పందనకు ఆదేశాలు

**- జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**

**- ప్రజావాణిలో 25 ఫిర్యాదుల స్వీకరణ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, జూన్ 15 : ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ఫిర్యాదులపై పోలీసు అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఆదేశించారు. సోమవారం వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్య క్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 25 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను నేరుగా ఎస్పీకి వినిపించారు. అందిన ప్రతి ఫిర్యాదును ఎస్పీ స్వయంగా పరిశీలించి, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం చేయకుండా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించిన ఎస్పీ, ప్రతి ఫిర్యాదును సానుకూల దృక్పథంతో పరిశీలించాలని అధికారులకు తెలిపారు. దీంతో తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే నమ్మకం కలిగిందని ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ రోజు స్వీకరించిన మొత్తం 25 ఫిర్యాదుల్లో 17 భూ వివాదాలకు సంబంధిం చినవి కాగా, 8 పరస్పర గొడవలకు సంబంధించినవిగా అధికారులు వెల్లడించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి వేదిక సమర్థవంతంగా ఉపయోగపడుతోందని ఎస్పీ పేర్కొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే 'ప్రజావాణి'కి ప్రాధాన్యత: కలెక్టర్ స్నేహ శబరీష్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, జూన్ 15 : జిల్లాలోని ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకే 'ప్రజావాణి' కార్యక్రమానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ లిస్నేహ శబరీష్‌లి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కె. అనిల్ కుమార్, పురుషోత్తం లతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు బాధ్యతాయుతంగా పరిశీలించి,క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు.నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యాశాఖ, పంచాయతీ, మున్సిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల నిర్వహణ, పాఠ్యపుస్తకాలు,యూనిఫాంల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం అమలు సక్రమంగా ఉండేలా చూడాలని ఆదేశించారు.ప్రజావాణిలో ప్రధానంగా భూ సమస్యలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఆసరా పింఛన్లు, ఉపాధి హామీ పథకం, మున్సిపల్, పంచాయతీ సమస్యలకు సంబంధించిన 215 దరఖాస్తులు అందాయి.అర్జీలను శాఖల వారీగా ఆన్‌లైన్‌లో సంబంధిత అధికారులకు పంపించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో పురుషోత్తం, డీఆర్‌డీవో ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాయిగిరి చెరువు నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి

**- చేపలు మృతి... మత్స్యకారులకు భారీ నష్టం**

**- ప్రజావాణిలో ఆర్డీఓకి మత్స్య సంఘం వినతి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి భువనగిరి, జూన్ 15 : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణం రాయిగిరి పెద్దచెరువులోకి ఫార్చ్యూన్ బయోటెక్ పరిశ్రమ నుంచి వ్యర్థ జలాలు, రసాయనాలు చేరుతున్నందున నీరు తీవ్రంగా కలుషితమై చేపలు, ఇతర జలా చరాలు మృత్యువాత పడుతున్నాయని బస్వాపురం మత్స్యపారిశ్రామిక సహకార సంఘ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో ఆర్డీఓ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. రాయిగిరి--యాదాద్రి ప్రధాన రహదారి పక్కన ఉన్న పెద్దచెరువు స్థానిక ప్రజలతో పాటు యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించే ముఖ్యమైన మంచినీటి వనరుగా ఉందని తెలిపారు. అయితే చెరువు సమీపంలోని పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థజలాలు, రసాయనాలు నేరుగా చెరువులోకి చేరడంతో నీటి నాణ్యత దెబ్బతింటోందని ఆరోపించారు. కాలుష్య ప్రభావంతో చెరువులోని చేపలు, ఇతర జలాచరాలు మృతి చెందుతుండటమే కాకుండా మత్స్యకారులు వదిలిన చేప పిల్లలు కూడా మనుగడ సాగించలేకపోతున్నాయని పేర్కొన్నారు. దీంతో చెరువుపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకార కుటుంబాలు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థజలాలు చెరువులోకి చేరకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, చెరువు నీటిని శాస్త్రీయంగా పరీక్షించి కాలుష్యానికి కారణమైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని సంఘ సభ్యులు అధికారులను కోరారు. చెరువును పరిరక్షించి మత్స్యకార కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బస్వాపురం మత్స్యపారిశ్రామిక సహకార సంఘ సభ్యులు, మత్స్యకారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# వాట్సాప్ శిక్షణ తో 62 మంది అగ్నివీర్లు

**- ఉచిత శిక్షణతో నిరుపేద యువతకు ఉద్యోగాలు**

**- ఎస్‌వైఎంఎస్ సేవలను ప్రభుత్వం గుర్తించాలని విజ్ఞప్తి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, జూన్ 15 : నిరుపేద కుటుంబాలకు చెందిన యువత ఆర్మీలో ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో సైనిక యూత్ మోటివేషనల్ సొసైటీ (ఎస్ వై ఎం ఎస్) అందిస్తున్న ఉచిత శిక్షణ విశేష ఫలితాలను సాధించిందని సంస్థ ఫౌండర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారి ప్రసాద్ ముదిరాజ్ తెలిపారు. వాట్సాప్ మాధ్యమం ద్వారా ఉచితంగా పీడీఎఫ్‌లు, గత ప్రశ్నపత్రాలు పంపించడంతో పాటు ఆన్‌లైన్‌లో వ్యాయామ శిక్షణ, మోటివేషన్ తరగతులు నిర్వహించడం ద్వారా మే-2026లో వెలు వడిన అగ్నివీర్ ఫలితాల్లో 62 మందికి పైగా యువత ఉద్యోగాలు సాధించినట్లు వెల్లడిం చారు. ఆర్మీ సైనికులుగా ఎంపికైన అభ్యర్థులకు ఆలేరులో ఆదివారం నిర్వహించిన అభినందన సభలో ఘనంగా సన్మానించారు. ప్రైవేటు అకాడమీలు భారీ ఫీజులు వసూలు చేస్తున్న నేపథ్యంలో ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా వాట్సాప్ ద్వారానే శిక్షణ అందించి 62 మందికి పైగా యువతను అగ్నివీర్లుగా తీర్చిదిద్దడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఎస్ వై ఎం ఎస్ రాష్ట్ర ప్రభుత్వం సహకరించి ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు, ప్రముఖులు కోరారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com